



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## దేశం గర్వించదగ్గ విజయం

- భారత హాకీ జట్టుకు సీఎం చంద్రబాబు అభినందనలు

4

## తమిళనాడు బీజేపీ మాజీ చీఫ్ అన్నామలైతో మంత్రి లోకేష్ భేటీ

3



విశాఖ పారిశుద్ధ్య రంగంలో

# కొత్త శకం

- ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి రూ.553 కోట్లతో కొత్త ప్రాజెక్ట్
- ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జీవీఎంసీ-ఐఎఫ్‌సీ మధ్య ఒప్పందం
- దేశంలో ఐఎఫ్‌సీ రుణం పొందిన తొలి కార్పొరేషన్‌గా జీవీఎంసీ రికార్డ్

2

# సమృద్ధిగా యూరియా

- ❑ రాష్ట్రంలో 80 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు
- ❑ బ్లాక్ మార్కెటింగ్‌పై కఠినచర్యలు
- ❑ రబీ సీజన్‌కు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి
- ❑ ఉల్లి కొనుగోళ్లు- నిల్వలపై దృష్టి
- ❑ అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ❑ యూరియా, ఉల్లి, తురకపాలెంలో ఆరోగ్య పరిస్థితులపై ఆర్టీజీఎస్ నుంచి సీఎం చంద్రబాబు సమీక్ష
- ❑ సమీక్షిస్తూనే కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో ఫోన్‌లో మాట్లాడిన సీఎం
- ❑ కాకినాడ పోర్టుకు వచ్చిన నౌకలో 7 రేక్‌లు రాష్ట్రానికి కేటాయించేందుకు కేంద్రమంత్రి అంగీకారం
- ❑ దీంతో రాష్ట్రానికి అదనంగా 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా
- ❑ పౌర సేవల్లో సంతృప్త స్థాయిపై ప్రతీవారం సమీక్షిస్తానన్న సీఎం



2

## క్షేత్రస్థాయిలో తిరగండి

- ◆ యూరియా నిల్వలపై రైతుల్లో భరోసా కల్పించండి
- ◆ అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు ఆదేశం
- ◆ యూరియాతో పాటు వివిధ అంశాలపై 5 గంటల పాటు సమీక్ష

4

## కళాశాలల్లో హింసాత్మక ధోరణులు సహించం

- మంత్రి లోకేష్ స్పష్టీకరణ

- ఆర్జెయుకేటీ ప్రొఫెసర్ గోపాలరాజుపై విద్యార్థి దాడికి ఖండన

3

## అన్నదాతలను దగా చేసి మొసలి కన్నీరా?

- ◆ యూరియా కొరత లేకున్నా దుష్ప్రచారం
- ◆ గత ప్రభుత్వంలో 5 లక్షల మెట్రిక్ టన్నులే సరఫరా
- ◆ మేం 7 లక్షల మెట్రిక్ టన్నులు అందజేస్తున్నాం
- ◆ వ్యవసాయం, ఇరిగేషన్‌పై చర్చకు సిద్ధమా?
- ◆ మంత్రి కొలుసు పార్థసారథి

6

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటారా?

- పోలీసులు, జైలు అధికారులను దూషిస్తారా?

- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే జాగ్రత్త

- బాధ్యులను తక్షణమే అరెస్టు చేయాలి

- పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

7

## చంద్రబాబు పాలనలోనే వైద్యకళాశాలలు

- వాటిని అభివృద్ధి చేసిన ఘనత టీడీపీదే
- జగన్‌రెడ్డి వైద్యరంగాన్ని భ్రష్టు పట్టించారు
- అబద్ధాలతో బతుకుతున్న పార్టీ అది
- మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు

6

## టీటీడీ ఈవోగా ఏకే సింఘాల్

- రాష్ట్రంలో 11 మంది ఐఏఎస్‌ల బదిలీ

9

## మరో నాలుగు కార్పొరేషన్లకు 51 మంది డైరెక్టర్ల నియామకం

4

పరిశ్రమలను రప్పించేందుకే...

## మెరుగైన ప్రోత్సాహకాలు

- చంద్రబాబు బ్రాండ్‌తోనే ఏపీకి దిగ్గజ సంస్థలు
- పెట్టుబడుల ఆకర్షణకే 99 పైసలకు ఎకరా భూమి
- టీసీఎస్ ద్వారా 25వేల ఉద్యోగాలు
- ట్రంప్ సుంకాల నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్కెట్ల అన్వేషణ
- ప్రతీకార రాజకీయాలు చేయం... తప్పుచేస్తే నన్నయినా చంద్రబాబు వదలరు
- భారత్ ఫస్ట్ మా నినాదం.. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏకే మా మద్దతు
- 2029 తరువాతా ప్రధాని మోదీ నేతృత్వంలో ఎన్డీఏతోనే మా ప్రయాణం
- ఇండియా టుడే కాంక్లేవ్‌లో మంత్రి లోకేష్

3







## బాలయ్య మరో ఘనత

- ముంబై స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో బెల్ మోగించిన తొలి దక్షిణాది నటుడిగా గుర్తింపు

- ఇదో చిరస్మరణీయ, మరపురాని ఘట్టం: బాలకృష్ణ

- మనందరి ఆత్మ గౌరవానికి ప్రతీక

- తెలుగు ప్రజల ప్రేమ, ఆశీర్వాదాల ఫలితమే

3

## రాజకీయ లబ్ధికోసమే దుష్ప్రచారం



- రైతులకు అందుబాటులోనే యూరియా
- ఐదేళ్లూ రైతుల కోసం ఏమి చేశారు?
- వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలి
- పదవుల్లో ఉండి రాకపోవడం నేరమే
- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

5

## వైసీపీ ప్రతిపక్షం కాదు.. విష వృక్షం

- నాడు రైతులను మోసగించి నేడు నీతులా?
- రెచ్చగొట్టేందుకే జగన్‌రెడ్డి సరికొత్త నాటకాలు
- వైసీపీ అన్నదాత పోరు కాదు..దగా పోరు
- ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



7

చైతన్యరథం

# సమృద్ధిగా యూరియా సరఫరా

- రాష్ట్రంలో 80 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు
- రబీ సీజన్‌కు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి
- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- యూరియా, ఉల్లి, తురకపాలెంలో ఆరోగ్య పరిస్థితులపై ఆర్టీజీఎస్ నుంచి సీఎం చంద్రబాబు సమీక్ష
- యూరియా సరఫరాపై కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో ఫోన్‌లో మాట్లాడిన సీఎం
- కాకినాడపోర్టుకు వచ్చిన నౌకలో 7 రేక్‌లు రాష్ట్రానికి కేటాయించేందుకు కేంద్రం అంగీకారం
- దీంతో రాష్ట్రానికి అదనంగా 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా
- పౌర సేవల్లో సంతృప్త స్థాయిపై ప్రతీవారం సమీక్షిస్తానన్న సీఎం



అమరావతి (చైతన్యరథం): యూరియాపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్రంలో ప్రస్తుతం 80,503మెట్రిక్‌టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. అన్ని జిల్లాల్లోనూ ఎరువులు సమృద్ధిగా సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు.పంపిణీలో ఎక్కడా సమస్య రాకుండా చూడాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీచేశారు. సోమవారం ఆర్టీజీఎస్ నుంచి రాష్ట్రంలో ఎరువుల సరఫరా, ఉల్లి కొనుగోళ్లు, తురక పాలెం గ్రామంలో ఆరోగ్య పరిస్థితులు,కాఫీ పంటలకు సోకిన తెగులు తదితరఅంశాలపై సుదీర్ఘంగా మూడు గంటలపాటు అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.రాష్ట్రంలో రైతులకుఎక్కడా యూరియా సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. మరో పది రోజుల్లో 23,592 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి వస్తుందన్నారు. ఆర్టీజీఎస్ నుంచి అధికారులతో  సమీక్ష నిర్వహిస్తూనే రాష్ట్రానికి మరింత మొత్తంలో ఎరువుల కేటాయింపుపై కేంద్రమంత్రి జేపీ నడ్డాతో ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడారు. సోమవారం కాకినాడ తీరానికి చేరుకున్న నౌకలోని 7 రేక్‌ల యూరియాను ఏపీకి కేటాయించాలని కోరారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి తక్షణమే రాష్ట్రానికి ఆ యూరియాను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రాష్ట్రానికి అదనంగా మరో 50 వేల మెట్రిక్ టన్నుల కేటాయించినట్లయింది. వచ్చే రబీ సీజన్‌కు ఇప్పటి నుంచే యూరియా సరఫరా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ఎరువుల పంపిణీకి సంబంధించి రైతుల్లో కల్పించాలని సూచించారు. అలాగే రైతులు, కౌలు రైతులు.. రాబోయే రోజుల్లో ఎరువులు దొరకవనే ఆందోళనతో ఒకేసారి కొనుగోలు చేయకుండా.. నిల్వచేసి పెట్టుకోకుండా పర్యవేక్షించాలని సీఎం పేర్కొన్నారు. అలాగే అనవసరపు కోనుగోళ్లపైనా దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. నిత్యావసర సరకుల జాబితాలో ఉన్న ఎరువులను బ్లాక్ మార్కెటింగ్ చేయకుండా నియంత్రించాలని స్పష్టం చేశారు. కొందరు కావాలనే రాజకీయ దురుద్దేశాలతో చేస్తున్న ప్రయత్నాలను నిలువరించాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు జరుగుతున్న ఈ తరహా ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. అధిక మోతాదులో ఎరువుల వినియోగం వల్ల ఏర్పడే దుష్ప్రభావాలపై రైతులను చైతన్య పరిచేలా కార్యక్రమాలను, ప్రచారాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎరువుల వినియోగాన్ని తగ్గించిన రైతులకు ప్రోత్సాహకంగా సబ్సిడీని రైతుల ఖాతాల్లోకి జమ చేసే పథకంపైనా దృష్టి పెట్టి విస్తృత ప్రచారం చేయాలని సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు.

## ఉల్లి కొనుగోళ్లు- నిల్వలపై దృష్టి పెట్టండి

కర్నూలు మార్కెట్‌లో ఉల్లి కొనుగోళ్లు, మద్దతు ధరపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. ఉల్లి క్వింటాలుకు రూ.1200 ధర తగ్గకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ఎవరైనా ఆ ధరకంటే తక్కువకు అమ్ముకుంటే ఆ మేరకు వ్యత్యాసాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఉల్లి పంట ఉత్పత్తి అంచనాల మేరకు నిల్వ చేసేందుకు గోదాములు, కోల్డ్ స్టోరేజీ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. కొనుగోలు చేసిన ఉల్లిని రైతు బజార్లతో పాటు మార్కెట్‌కు కూడా తరలించాలని స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా కోడుమూరులో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఈ ఘటనలో డ్రామా ఆడిన వారిపై విచారణ జరుపుతున్నామని అధికారులు తెలిపారు. పంటను కనీసం మార్కెట్‌కు తేకుండానే పురుగుమందు తాగినట్టుగా డ్రామా ఆడిన వ్యవహారంపై చర్యలు తీసుకుంటున్నామని అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు అరకులో కాఫీ పంటకు సోకిన కాయతొలుచు పురుగు తెగులుపైనా తక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పటికే తెగులు సోకిన 60 ఎకరాల్లో పంట తొలగించామని మరో 20 ఎకరాల్లో తొలగింపు ప్రక్రియ జరుగుతోందని సీఎంకు అధికారులు వివరించారు. అలాగే తురకపాలెం గ్రామంలో తలెత్తిన ఆరోగ్య పరిస్థితిపైనా అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు జారీ చేశారు. ఈ వ్యాధికి మూలం ఎక్కడుందన్న అంశాన్ని గుర్తించాలని ఆదేశించారు. దీన్ని కేస్ స్టడీగా తీసుకుని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## పౌర సేవల్లో సంతృప్త స్థాయికే ప్రాధాన్యత

ప్రభుత్వ విభాగాలు అందించే వివిధ పౌరసేవల్లో సంతృప్త స్థాయిపై ఇక ప్రతీవారం సమీక్షిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పెన్షన్లు, ఉచిత గ్యాస్, ఆర్టీసీ, రెవెన్యూ, పంచాయతీరాజ్ ఇలా వేర్వేరు శాఖల్లో అందిస్తున్న సేవలపై ఇంకా సంతృప్త స్థాయి పెరగాలని సీఎం పేర్కొన్నారు.

ప్రజల నుంచి వ్యక్తం అయ్యే అభిప్రాయాలను డేటా అనలటిక్స్ ద్వారా విశ్లేషించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కొన్ని చోట్ల రాజకీయ కారణాల వల్ల కూడా ప్రజల సంతృప్త స్థాయిపై ప్రభావం చూపుతోందన్నారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ప్రజలకు అందించే పౌరసేవల్ని మరింతగా మెరుగుపర్చుకోవాలని సూచించారు. అలాగే కీ పెర్ఫార్మెన్సు ఇండికేటర్లు ఏ మేరకు రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగేందుకు ఉపకరిస్తున్నాయన్న అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్టీజీఎస్ నుంచి నిర్వహించిన ఈ సమీక్షకు సీఎస్ కే.విజయానంద్ సహా వ్యవసాయ శాఖ, వైద్యారోగ్యశాఖ, మార్కెటింగ్, ఐటీ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# విశాఖ పారిశుద్ధ్య రంగంలో కొత్త శకం

- ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి రూ.553 కోట్లతో కొత్త ప్రాజెక్ట్
- ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జీవీఎంసీ-ఐఎఫ్‌సీ మధ్య ఒప్పందం
- దేశంలో ఐఎఫ్‌సీ రుణం పొందిన తొలి కార్పొరేషన్‌గా జీవీఎంసీ రికార్డ్



అమరావతి(చైతన్యరథం): విశాఖపట్నం పారిశుద్ధ్య రంగంలో ఒక కొత్త శకం మొదలైంది. విశాఖ నగరాభివృద్ధి కోసం అంతర్జాతీయ ఆర్థిక సంస్థ (ఐఎఫ్‌సీ) నుంచి విశాఖపట్నం మహానగర పాలక సంస్థ (జీవీఎంసీ) రుణం తీసుకునేందుకు సంబంధించి ఐఎఫ్‌సీ-జీవీఎంసీ అధికారులు మధ్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో సోమవారం ఒప్పందం జరిగింది. అనంతరం జీవీఎంసీ అధికారులు ముఖ్యమంత్రితో సమావేశమై త్వరలో చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టు వివరాలను వెల్లడించారు. ఈ ఒప్పందంతో భారతదేశంలో మొదటిసారిగా అంతర్జాతీయ ఆర్థిక సంస్థ నుంచి ప్రత్యక్ష రుణం పొందిన మున్సిపల్ కార్పొరేషన్‌గా జీవీఎంసీ నిలిచిందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా విశాఖపట్నంలోని మధురవాడ జోన్-2లో ఆధునిక మురుగునీటి వ్యవస్థను అభివృద్ధి చేయనున్నారు. మొత్తం రూ.553 కోట్లు వ్యయం అయ్యే ఈ ప్రాజెక్టులో రూ.498 కోట్లు ఐఎఫ్‌సీ రుణంగా ఇవ్వనుంది. మిగిలిన మొత్తంలో అమృత్ 2.0 నుంచి రూ.45.64 కోట్లు, జీవీఎంసీ సొంత నిధులు రూ.9.36కోట్లు వినియోగించనుంది. జీవీఎంసీ తన సొంత ఆదాయ వనరుల ద్వారా ఈ రుణాన్ని తిరిగి ఐఎఫ్‌సీకి చెల్లించనుంది. 15 సంవత్సరాల కాలపరిమితి కలిగిన ఈ రుణానికి వడ్డీ రేటు 8.15 శాతం (ఫ్లోటింగ్)గా నిర్ణయించారు. త్వరలో మొదలయ్యే మధురవాడ మురుగునీటి ప్రాజెక్టుతో 100 శాతం అండర్‌గ్రౌండ్ మురుగునీటి నెట్‌వర్క్, ఆధునిక పంపింగ్ - లిఫ్టింగ్ స్టేషన్లు, అత్యాధునిక శుద్ధి కేంద్రం - నీటి పునర్వినియోగం, రీసైక్లింగ్ చేయనున్నారు. 30 ఏళ్ల జనాభా వృద్ధి అవసరాలను దృష్టిలో పెట్టుకొని దీనిని డిజైన్ చేశారు. మధురవాడ ప్రాజెక్ట్ వల్ల పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్య మెరుగుదల, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది, భూగర్భ జలాలు శుభ్రపడతాయి. వరద నీటి నిర్వహణ సాధ్యమవుతుంది. ఈ ప్రాజెక్టు పరిధిలో నివసిస్తున్న రెండున్నర కోట్ల మందికి ఉపయోగకారిగా ఉంటుంది. నిర్మాణం, నిర్వహణ సమయంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయి. ఈ ఒప్పందం ద్వారా భారతదేశంలో నగరాల ఆర్థిక స్వయం ప్రతిపత్తికి కొత్త దారి చూపినట్టయ్యింది.

## మన ఎదుగుదలతో పాటు సమాజాభివృద్ధికీ దోహదపడాలి

**- సీఎం చంద్రబాబు**

అమరావతి (చైతన్యరథం): నేటి కాలంలో అక్షరాస్యత అంటే కేవలం చదవడం, రాయడం మాత్రమే కాదనే విషయాన్ని అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం మనకు గుర్తుచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. నిరంతరం నేర్చుకుంటూనే ఉండటం, విభిన్న అనుభవాల ద్వారా ఎదగడం, ఆ జ్ఞానాన్ని ఉపయోగించి మన జీవితాలను, మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మెరుగు పరుచుకునే సామర్థ్యం.. దానికి కొత్త నిర్వచనం అన్నారు. మనం మరింత నేర్చుకున్నప్పుడు, మనం మరింత సంపాదించవచ్చు, సమాజాభివృద్ధికి మరింత అర్థవంతంగా దోహద పడవచ్చునన్నారు. మీరు ఏమి చేసినా, నేర్చుకుంటూనే ఉండండి, ఎదుగుతూ ఉండండి, ఏ రంగంలో ఉన్నా అత్యుత్తమ స్థానంలో ఉండేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు సీఎం చంద్రబాబు పిలుపు ఇచ్చారు.

## పరిశ్రమలను రప్పించేందుకే...

# మెరుగైన ప్రోత్సాహకాలు

- చంద్రబాబు బ్రాండ్‌తోనే ఏపీకి దిగ్గజ సంస్థలు
- పెట్టుబడుల ఆకర్షణకే 99 పైసలకు ఎకరా భూమి
- టీసీఎస్ ద్వారా 25వేల ఉద్యోగాలు
- ట్రంప్ సుంకాల నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్కెట్ల అన్వేషణ
- ప్రతీకార రాజకీయాలు చేయం... తప్పుచేస్తే నన్నయినా చంద్రబాబు వదలరు
- భారత్ ఫస్ట్ మా నినాదం.. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏకే మా మద్దతు
- 2029 తరువాతా ప్రధాని మోదీ నేతృత్వంలో ఎన్డీఏతోనే మా ప్రయాణం
- ఇండియా టుడే కాంక్లేవ్‌లో మంత్రి లోకేష్




కోయంబత్తూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు నాయుడు అనే బ్రాండ్ అంబాసిడర్ ఉన్నారు.. ఆ బ్రాండ్‌తోనే దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి.. ఏపీలోని పరిశ్రమల అనుకూలమైన వాతావరణం కూడా పెద్దఎత్తున పెట్టుబడుల రాకకు ప్రధాన కారణమని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కోయంబత్తూరులో "ఎట్రాక్టింగ్ ఇన్వెస్టిమెంట్ ఫర్ ద సన్ రైజ్ స్టేట్" అనే అంశంపై ప్రముఖ మీడియా సంస్థ ఇండియా టుడే సోమవారం నిర్వహించిన కాంక్లేవ్‌లో మంత్రి లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు గత 15నెలలుగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. ప్రముఖ సీనియర్ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ సంధానకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... గత ఎన్నికల్లో మేం ఇచ్చిన సూపర్ -6 హామీల్లో ప్రధానమైనది యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పన అన్నారు. ఆ లక్ష్యసాధన కోసం మేం ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నాం. టీసీఎస్ సంస్థ 25వేల ఉద్యోగాలు కల్పిస్తుంది... ఆ సంస్థకు 99పైసలకే భూమి కేటాయిస్తే తప్పేమిటి? కర్నాటక, తమిళనాడు, కేరళ, యుపీ వంటి రాష్ట్రాలతో పోటీపడి పరిశ్రమలను రప్పించడానికే తక్కువ ధరకు భూమి, ఇతర రాష్ట్రాల కంటే మెరుగైన ప్రోత్సాహకాలు అందిస్తున్నామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

### ఆక్వాకు ప్రత్యామ్నాయ మార్కెట్ వెదుక్కుంటాం

హైదరాబాద్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 5వేల ఎకరాలు ఎందుకని అప్పట్లో ఉమ్మడి రాష్ట్రంలోని చాలామంది రాజకీయ ప్రత్యర్థులు విమర్శలు చేశారు, ఈ రోజు శంషాబాద్ ఎయిర్ పోర్టు దేశంలోనే అత్యుత్తమ పోర్టుల్లో ఒకటిగా ఉంది. తెలంగాణా రాష్ట్రానికి ప్రధాన ఆదాయవనరుగా మారింది. విజనరీ లీడర్ చంద్రబాబునాయుడు ముందుచూపు వల్లే ఇది సాధ్యమైంది. ఎయిర్ ట్రాఫిక్ రద్దీని తట్టుకునేందుకు ఇప్పుడు బెంగళూరులో రెండో ఎయిర్‌పోర్టు నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు సువిశాలంగా ఎయిర్ పోర్టు నిర్మాణం చేపట్టారని మంత్రి లోకేష్ గుర్తుచేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఆక్వా మార్కెట్‌ను కాపాడుకునేందుకు ప్రభుత్వం తరపున మద్దతు ఇవ్వడమేగాక రష్యా, చైనా, యూరప్‌ల్లో ప్రత్యామ్నాయ మార్కెట్‌లు వెదుక్కుంటాం, సవాళ్లను అవకాశంగా తీసుకుంటామని చెప్పారు. స్టాన్ ఫోర్డ్‌లో చదువుతోపాటు యువగళం పాదయాత్ర తనకు సవాళ్లను ఎదుర్కొనే మార్గాలను నేర్పించిందని లోకేష్ తెలిపారు.

### రాధాకృష్ణన్‌కే మా మద్దతు

ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి భారత్ ఫస్ట్ అనే నినాదానికే మేం కట్టుబడి ఉన్నాం. దేశాన్ని ముందుండి నడిపించే నాయకత్వానికే మేం మద్దతు ఇవ్వాలని నిర్ణయించాం. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎన్‌డీఏ అభ్యర్థికి టీడీపీ మద్దతు నిస్తుంది. ఎన్‌డీఏ అభ్యర్థిగా రాధాకృష్ణన్‌ను ప్రకటించగానే ఢిల్లీలో ఆయనను కలసి అభినందించాం. ప్రధాని మోదీ నేతృత్వాన 2029 ఎన్నికల తర్వాత కూడా మా ప్రయాణం కొనసాగుతుందని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

### తప్పుచేస్తే ఎవరినీ క్షమించరు

భారత్ మల్టీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఆవిష్కృతమవున్న తరుణంలో పారదర్శకమైన రాజకీయాలు అవసరమని మేం బలంగా విశ్వసిస్తున్నాం. రాజకీయనాయకులపై ఉన్న కేసులకు సంబంధించి ఏడాదిలోగా విచారణ పూర్తిచేసి, తీర్పు ఇవ్వాలని సుప్రీంకోర్టు గతంలో మార్గదర్శకాలు ఇచ్చింది. దురదృష్టవశాత్తు అది అమలు కావడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో ఎవరినీ ఉద్దేశపూర్వకంగా జైలులో పెట్టాలని భావించడం లేదు. ఇదే సమయంలో తప్పుచేసిన శిక్ష అనుభవించక తప్పదు. చంద్రబాబుని అక్రమంగా అరెస్టు చేశారని మేం ప్రతీకార రాజకీయాలు చేయబోం. నేను తప్పుచేసినా చంద్రబాబు నన్ను జైలుకు పంపుతారని మంత్రి లోకేష్ ఉద్ఘాటించారు.

### మాకు ఏపీ ప్రయోజనాలే ముఖ్యం

మాకు ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రయోజనాలే ముఖ్యం. వారిపట్ల మాకున్న నిబద్ధత వల్లే గత 40ఏళ్లుగా వారిహృదయాల్లో చోటు కల్పించారు. తెలుగుదేశం పార్టీ మిగిలిన ప్రాంతీయ పార్టీల కంటే భిన్నమైంది. తరాలు మారినా మేమంతా కలసికట్టుగా ముందుకుసాగుతున్నాం.గత ఏడాది జరిగిన ఎన్నికల్లో విజేతలైన వారిలో 50శాతం మంది తొలిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలే. 25మంది మంత్రుల్లో 17మంది కొత్తవారు. మేము అంకిత భావం కలిగిన కొత్తతరాన్ని రాజ కీయాల్లోకి తెస్తున్నామని మంత్రి లోకేష్ వివరించారు.

### వారు తిరస్కరించాకే మేం ఆహ్వానించాం

మేము కొత్తగా ఏర్పడిన రాష్ట్రమైనప్పటికీ పెట్టుబడుల ఆకర్షణలో ఇతర అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోటీపడుతున్నాం. ఫార్చ్యూన్ 500 కంపెనీలతోపాటు ఇతర ప్రముఖ సంస్థలు ఏపీ వైపు చూస్తున్నాయి. స్పేస్ సెక్టార్ అభివృద్ధికి ఇటీవల 200 ఎకరాల భూమి కేటాయించాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఇది దోహద పడు తుంది. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ సంస్థను కర్నాటక తిరస్కరించాకే మేం ఆహ్వానం పలికాం. ఎంఎస్ఎంఇ ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేసేందు కు మా మంత్రి దావోస్‌లో పర్యటిస్తున్నారు. హ్యాండ్లూమ్స్, టెక్స్టైల్ రంగాలపై కూడా దృష్టిసారించామని మంత్రి లోకేష్ తెలిపారు.

### రైతుల అంగీకారంతోనే భూసమీకరణ

అమరావతి నిర్మాణానికి రైతుల అంగీకారంతో 35వేల ఎకరాలను సమీకరించాం. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో రాజధాని అమరావతి నిర్మాణం చేపట్టాం. భారతదేశం అభివృద్ధికి అమరావతిలాంటిమరో వందనగరాల నిర్మాణం జరగాలి. 30ఏళ్ల క్రితం హైదరాబాద్, సికింద్రాబాద్‌తోపాటు సైబరాబాద్ నగరనిర్మాణం జరిగింది. అప్పట్లో కొందరు కంప్యూటర్ అన్నం పెడుతుందా అని హేళనగా మాట్లాడారు.ఇప్పుడు ఐటీలో ఉద్యోగాలు చేస్తున్న లక్షలాది మంది బిడ్డలను చూస్తే కంప్యూటర్ జీవనోపాధికి ఎలా ఉపయోగపడుతుందో తెలుస్తోంది. అటువంటి సాహసోపేతమైన నిర్ణయంతీసుకోవడం చంద్ర బాబు లాంటి విజనరీ లీడర్‌కే సాధ్యమవుతుంది. జనవరిలో అమరావతికి దేశంలోనే మొట్టమొదటి 158 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ రాబోతోంది. త్వరలో నైపుణ్యం పోర్టల్ ప్రారంభించబోతున్నాం, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి వర్టికల్, హారిజాంటల్‌గా చర్యలు చేపడతున్నామని మంత్రి లోకేష్ చెప్పారు.

---

## తమిళనాడు బీజేపీ మాజీ చీఫ్ అన్నామలైతో మంత్రి లోకేష్ భేటీ

కోయంబత్తూరు (చైతన్యరథం): తమిళనాడు రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలైని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ కోయంబత్తూరులో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. డబుల్ ఇంజన్ సర్కారు అధికారంలో ఉన్నందున ఏపీ వేగవంతంగా అభివృద్ధి సాధిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, విద్యారంగంలో తాము చేపడుతున్న సంస్కరణలు దేశంలోనే రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయని చెప్పారు. ఒకసారి ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించాల్సింగా అన్నామలైని మంత్రి లోకేష్ ఆహ్వానించారు.



---

## కళాశాలల్లో హింసాత్మక ధోరణులు సహించం

- మంత్రి లోకేష్ స్పష్టీకరణ
- ఆర్జేయుకేటీ ప్రొఫెసర్ గోపాలరాజుపై విద్యార్థి దాడికి ఖండన

అమరావతి (చైతన్యరథం): నూజివీడు ఆర్జెయుకేటీ ప్రొఫెసర్ గోపాలరాజుపై ఎం.టెక్ విద్యార్థి వినయ్ పురుషోత్తం దాడికి పాల్పడటాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణా రాహిత్యాన్ని, హింసాప్రవృత్తిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎం.టెక్ (ట్రాన్స్‌పోర్ట్) ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి వినయ్‌కి ఫస్ట్ సెమిస్టర్ లో సరిపడినంత హాజరు లేని కారణంగా.. నిబంధనల మేరకే అతడిని ప్రాక్టికల్ పరీక్షలకు అనుమతించలేదు. దీంతో ఆగ్రహించిన వినయ్.. ప్రొఫెసర్ గోపాలరాజుపై కత్తితో దాడి చేసి పారిపోయాడు. ఈ ఘటనపై మంత్రి లోకేష్ స్పందిస్తూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో గురువులది కీలక స్థానం అన్నారు. విద్యార్థి జీవితాన్ని పాడుచేయాలని ఏ అధ్యాపకుడూ భావించరన్నారు. ప్రస్తుతం నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోపాలరాజు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ప్రొఫెసర్‌పై దాడికి పాల్పడిన వినయ్ పై కేసు నమోదు చేసి,



అదుపులోకి తీసుకున్నారని మంత్రి లోకేష్ తెలిపారు. కళాశాలల్లో ఇలాంటి హింసాత్మక ధోరణులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు.

# క్షేత్రస్థాయిలో తిరగండి

- యూరియా నిల్వలపై రైతుల్లో నమ్మకం కలిగించండి
- అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు ఆదేశం
- యూరియాతో పాటు వివిధ అంశాలపై 5 గంటల పాటు సీఎం సమీక్ష

అమరావతి (చైతన్యరథం): వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి యూరియా సరఫరా, లభ్యతపై రైతులకు నమ్మకాన్ని కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఆర్టీజీఎస్ నుంచి సోమవారం రాష్ట్రంలో ఎరువుల సరఫరా, ఉల్లి కొనుగోళ్లు, తురకపాలెం గ్రామంలో ఆరోగ్య పరిస్థితులు,కాఫీ పంటలకు సోకిన తెగులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహిస్తూనే.. జిల్లా కలెక్టర్లు,వ్యవసాయశాఖ అధికారులతో మరోమారు సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో యూరియా లభ్యత సమృద్ధిగానే ఉందని దానిని సక్రమంగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తే భూసారం కూడా దెబ్బతింటుందన్న అంశంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొందరు రైతులు రబీ కోసం కూడా ఇప్పుడే కొనుగోలు చేయకుండా చూడాలన్నారు. రబీ పంట కోసం ముందస్తుగానే ఎరువులను నిల్వ చేసుకుంటున్నట్టు సీఎం పేర్కొన్నారు. కొందరు రాజకీయ ముసుగులో క్రిమినల్స్ తరహాలో ఆలోచిస్తూ ఎరువులు లభ్యత ఉండదన్న అభద్రతా భావాన్ని కల్పిస్తున్నారని దీన్ని నియంత్రించాలన్నారు. ఎక్కడా రైతుల్లో ఆందోళన లేకుండా భరోసా కల్పించాలని స్పష్టం చేశారు. సీజన్‌లో సాగునీరు ముందుగానే ఇవ్వటం వల్ల పంటల సాగుకూడా ఎక్కువ చేశారని.. వాణిజ్య పంటలైన ఉల్లి, మామిడి, టమాటో, చీని కాయల ఉత్పత్తి ఎక్కువ వచ్చే అవకాశం ఉందని .. దీనికి స్వల్ప, మధ్య, ధీర్ఘ కాలిక ప్రణాళికలు ఉండాలని సూచించారు. మరోవైపు ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా సహా విష జ్వరాలు సోకకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లకు సీఎం సూచనలు జారీ చేశారు. టెలికాన్ఫరెన్సు ద్వారా నిర్వహించిన సమీక్షకు మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ అధికారులు హాజరయ్యారు. అంతకుముందు ఆర్టీజీఎస్ సమీక్షతో పాటు టెలికాన్ఫరెన్సు ద్వారా దాదాపు 5 గంటల పాటు సీఎం చంద్రబాబు యూరియా సహా వివిధ అంశాలపై సమీక్షించారు.

# దేశం గర్వించదగ్గ విజయం

**- భారత హాకీ జట్టుకు సీఎం చంద్రబాబు అభినందనలు**

అమరావతి (చైతన్యరథం): ఆసియా కప్ సాధించిన భారత పురుషుల హాకీ జట్టుకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆసియా కప్– 2025లో అత్యుత్తమ విజయం సాధించారని కొనియాడారు. దక్షిణ కొరియాపై విజయం సాధించి 8ఏళ్ల తర్వాత భారత్ టైటిల్ సాధించిందని పేర్కొన్నారు. ఈ విజయం భారత క్రీడలో గర్వించదగ్గ మైలురాయి అని చెప్పారు.యువ అథ్లెట్ల ధైర్యం,పట్టుదలకు ఉదాహరణ అన్నారు.భారతదేశ హాకీ వారసత్వాన్ని ఇకపైనా ముందుకు తీసుకెళతారని ఆకాంక్షించారు. ప్రపంచ వేదికపై మరిన్ని చిరస్మణీయ ప్రదర్శనలు ఇస్తారని విశ్వసిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు.

### మంత్రి మండిపల్లి అభినందనలు

భారత పురుషుల హాకీ జట్టుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభినందనలు తెలిపారు. మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో జట్టు సభ్యులు ముందుకు సాగాలన్నారు. ఎనిమిదేళ్ల తర్వాత టైటిల్ సాధించి జాతిని గర్వపడేలా చేశారని పేర్కొన్నారు. ఈ విజయం యువ అథ్లెట్లకు స్ఫూర్తినిచ్చే మైలురాయి అని వివరించారు. ప్రపంచ వేదికపై మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

### మరిన్ని విజయాలు సాధించాలి: శాప్ చైర్మన్

ఎనిమిదేళ్ల తర్వాత ఆసియా హాకీ కప్‌ను కైవసం చేసుకున్న భారత హాకీ జట్టుకు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అభినందనలు తెలిపారు. హాకీ జట్టు టైటిల్ సాధించి దేశం గర్వపడేలా చేసిందన్నారు. దేశంలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేలా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# బాలయ్య మరో ఘనత

- ముంబై స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో బెల్ మోగించిన తొలి దక్షిణాది నటుడిగా గుర్తింపు
- ఇదో చిరస్మరణీయ, మరపురాని ఘట్టం: బాలకృష్ణ
- మనందరి ఆత్మ గౌరవానికి ప్రతీక
- తెలుగు ప్రజల ప్రేమ, ఆశీర్వాదాల ఫలితమే




ముంబై: అగ్రనటుడు, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మరో అరుదైన గుర్తింపు సొంతం చేసుకున్నారు. దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లో ట్రేడింగ్ ప్రారంభానికి సూచికగా మోగించే గంటను ఆయన మోగించారు. ఈ బెల్ మోగించిన తొలి దక్షిణాది నటుడిగా అరుదైన గౌరవం పొందారు. ఎన్ఎస్ఈ అధికారుల ఆహ్వానం మేరకు సోమవారం ముంబై స్టాక్ ఎక్స్ఛేంజ్‌ని సందర్శించిన బాలకృష్ణ వారి విజ్ఞప్తి మేరకు అక్కడ ఏర్పాటు చేసిన గంటను మోగించారు. ఈ గౌరవంపై బాలకృష్ణ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా 50 సంవత్సరాలుగా హీరోగా నటిస్తున్నందుకు గుర్తింపుగా ఇటీవలే ఆయనకు 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కిన సంగతి తెలిసిందే.

దీనిపై బాలకృష్ణ స్పందిస్తూ.. బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి ప్రతినిధులతో ముంబై పర్యటనలో భాగంగా సోమవారం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ను సందర్శించామన్నారు. ఆ సందర్భంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ అధికారులు చూపిన ఆత్మీయత, ఇచ్చిన గౌరవం తన హృదయాన్ని తాకిందన్నారు. ప్రత్యేక ఆహ్వానం ఇచ్చి స్టాక్ ఎక్స్ఛేంజ్ బెల్ మోగించే అవకాశాన్ని ఇచ్చారు. దక్షిణాది భారతీయ నటుల్లో ఈ వేదికపై బెల్ మోగించిన మొదటి వ్యక్తిగా నిలవడం నాకు గర్వకారణం మాత్రమే కాదు.. ఇది నా తెలుగు ప్రజల ప్రేమ, ఆదరణ, ఆశీర్వాదాల ప్రతిఫలంగా అభివర్ణించారు. ఈ క్షణం నాకు మరపురానిది. ఇది వ్యక్తిగత ఘనత కాదు. మనందరి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని బాలకృష్ణ ఉద్ఘాటించారు.

బాలకృష్ణకు ఈ అరుదైన గౌరవం దక్కడంపై ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్ఎస్ఈలో ప్రత్యేక కార్యక్రమాలు, వేడుకల సందర్భంగా అతిథులు ఈ గంటను మోగించడం ఆనవాయితీగా వస్తోంది. ఎన్ఎస్ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బెల్ మోగించారు. ఐపీఓ ద్వారా తొలిసారి స్టాక్ మార్కెట్‌లో కాలుపెట్టే కంపెనీలు కూడా బెల్ మోగించి నిధుల సమీకరణ ప్రారంభించడం సంప్రదాయంగా కొనసాగుతోంది.



మంత్రి నారా లోకేష్ అధ్యక్షతన న్యూఢిల్లీలో సోమవారం తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ పార్టీ (టీడీపీపీ) సమావేశం జరిగింది. మంగళవారం జరగబోయే ఉపరాష్ట్రపతి ఎన్నికపై ఈ సమావేశంలో చర్చించారు. ఓటింగ్ ప్రక్రియపై ఎంపీలకు మంత్రి లోకేష్ పలు సూచనలు చేశారు.

## మరో నాలుగు కార్పొరేషన్లకు
# డైరెక్టర్ల నియామకం

అమరావతి(చైతన్యరథం):రాష్ట్రంలో మరో నాలుగు కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు 16మంది, ఏపీ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు ఐదుగురు, ఏపీ కమ్మ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు 15మంది, ఏపీ స్టేట్ నూర్‌బాషా/ దూదేకుల కార్పొరేషన్‌కు 15 మంది చొప్పున మొత్తం నాలుగు కార్పొరేషన్లకు 51 మంది డైరెక్టర్లను నియమించారు.

### 1.ఏపీ రోడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్(APRDC)

| పేరు | నియోజకవర్గం | పార్టీ |
|---|---|---|
| 1. బత్తుల హరిదాసు | మంగళగిరి | టిడిపి |
| 2. బొండాల శ్యామ్ | యలమంచిలి | జనసేన |
| 3. ద్వారపురెడ్డి శ్రీనివాసరావు | పార్వతీపురం | బిజెపి |
| 4. జి. చంద్రమోహన్ యాదవ్ | హిందూపురం | టిడిపి |
| 5. గరికపాటి శివశంకర్ | గన్నవరం | జనసేన |
| 6. కనవత్ హేమలత | ధర్మవరం | టిడిపి |
| 7. కెల్లా అప్పలనాయుడు | విజయనగరం | టిడిపి |
| 8. ఖాజా రహమత్తుల్లా | బద్వేల్ | టిడిపి |
| 9. నక్కా శ్రీను | యర్రగొండపాలెం | టిడిపి |
| 10. సాయిలక్ష్మి బండారు | గజపతినగరం | టిడిపి |
| 11. సునీత్ ఆచంట | జగ్గయ్యపేట | టిడిపి |
| 12. వీరవల్లివంశీ ప్రసన్నకుమార్ | నర్సరావుపేట | జనసేన |
| 13. వెంకట కృష్ణారావు కారుమంచి | పర్చూరు | టిడిపి |
| 14. వెంకటరత్నం చోడే | ఏలూరు | టిడిపి |
| 15. వెన్నా ఈశ్వరుడు | ప్రత్తిపాడు | టిడిపి |
| 16. వేణుగోపాలకృష్ణరాజుముదునూరి | రాజోలు | టిడిపి |

### 2.ఏపీ బ్యాక్ వర్డ్ క్లాసెస్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్

| | | |
|---|---|---|
| 1. దేవళ్ల వెంకటరాముడు | ఎమ్మిగనూరు | టిడిపి |
| 2. జి. అమరనాథ్ | పుంగనూరు | టిడిపి |
| 3. గుబ్బల ఫణి కుమార్ | రాజోలు | జనసేన |
| 4. రంగనాథ్ అంగర | పెడన | టిడిపి |
| 5. తాతారావు దాసరి | పలాస | టిడిపి |

### 3.ఏపీ కమ్మ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్

| | | |
|---|---|---|
| 1. అడుసుమిల్లి శ్రీనివాస వెంకట రామారావు చౌదరి | రాజానగరం | టిడిపి |
| 2. అజయ్ సజ్జా | నందిగామ | టిడిపి |
| 3. చిటేని శివరామకృష్ణ | నూజివీడు | టిడిపి |
| 4. గరికపాటి సుదర్శన్ నాయుడు | శింగనమల | టిడిపి |
| 5. కె.ఎల్. కృష్ణప్రసాద్ | ఏలూరు | బిజెపి |
| 6. కావూరి వాణిశ్రీ | ఏలూరు | జనసేన |
| 7. మనోహరనాయుడు | కదిరి | టిడిపి |
| 8. మేక సూర్య భాస్కరరావు | మండపేట | జనసేన |
| 9. మోతురుపుణ్యశ్రీనివాస కుమార్ | వేమూరు | టిడిపి |
| 10. పోతుల వెంకన్న చౌదరి (మోహనరావు) | జగ్గంపేట | టిడిపి |
| 11. పుచ్చనూతల గోపీనాథ్ చౌదరి | మార్కాపురం | టిడిపి |
| 12. సత్యనారాయణ లంక | గోపాలపురం | టిడిపి |
| 13. సూర్యనారాయణప్రసాద్చిరుమామిళ్ల | గన్నవరం(కృష్ణా) | టిడిపి |
| 14. వెంకటసుబ్బారావు ధనేకుల | తాడికొండ | టిడిపి |
| 15. వెంకటేశ్వరరావు కుదరవల్లి | రేపల్లె | టిడిపి |

### 4.ఏపీ స్టేట్ నూర్ బాషా/దూదేకుల కార్పొరేషన్

| | | |
|---|---|---|
| 1. షేక్ బాషా లిమ్రా | రాజమండ్రి | జనసేన |
| 2. కమతలాం ఇమామ్ హుస్సేన్ | అనంతపురం | జనసేన |
| 3. దూదేకుల దస్తగిరి | నంద్యాల | టిడిపి |
| 4. దూదేకుల మహబూబ్ కరీం సాబ్ | బనగానపల్లె | టిడిపి |
| 5. పెద్ద పీరు బాబు మైలమూరి | విజయవాడ ఈస్ట్ | టిడిపి |
| 6. ఎస్. బర్దివలి | గుంతకల్ | టిడిపి |
| 7. షేక్ అల్తాఫ్ | సర్వేపల్లి | టిడిపి |
| 8. షేక్ హుస్సైన్ | పర్చూరు | టిడిపి |
| 9. షేక్ ఇబ్రాహీం బాషా | అనకాపల్లి | బిజెపి |
| 10. షేక్ సుబాన్ | రంపచోడవరం (ఎస్టీ) | టిడిపి |
| 11. షరీఫ్ రాళ్లపల్లి | ధర్మవరం | టిడిపి |
| 12. షేక్ సయ్యద్ అలీ జిన్నా | ఆచంట | టిడిపి |
| 13. షూకూర్ షేక్ | ప్రత్తిపాడు | టిడిపి |
| 14. సిద్ధయ్య షేక్ | వినుకొండ | టిడిపి |
| 15. వీరభద్రుడు నాగూరి | రాజంపేట | టిడిపి |

చైతన్యరథం

# రాజకీయ లబ్ధికోసమే దుష్ప్రచారం

- రైతులకు అందుబాటులోనే యూరియా
- ఐదేళ్లూ రైతుల కోసం ఏమి చేశారు?
- అబద్ధాలు పదిసార్లు చెబితే నిజం కావు
- వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలి
- పదవుల్లో ఉండి రాకపోవడం నేరమే
- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం(చైతన్యరథం): స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. తాండవ రిజర్వాయర్ చైర్మన్ కరక సత్యనారాయణ, గొలుగొండ మండలం పార్టీ సీనియర్ నాయకు లు అడిగర్ల నానిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ కొంతమంది రైతులను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవసాయం గురించి తెలియని వారు కూడా వ్యవసా యం గురిం చి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నర్సీపట్నం నియోజకవర్గం లోని నాలుగు మండలాల్లో 10,274 హెక్టార్లలో పంటలు సాగుతున్నాయని, వాటికి 25,685 ఎకరాల మేరకు యూరియా అవసరమని వివరించారు. ఒక ఎకరానికి సగటు 75 కిలోల యూరియా అవసరం ఉంటుందని, నిర్ణీత స్థాయిలో మూడు విడతలుగా రైతులకు పంపిణీ చేస్తామని చెప్పారు. విత్తనం వేసిన 15 రోజులకు 25 కిలోలు, గడ్డి నివృత్తి చేసిన తర్వాత మరో 25 కిలోలు, పంట పండి న సమయంలో మూడో విడతగా 25 కేజీలు ఇవ్వబడతాయని తెలిపారు. మొత్తం 25,685 ఎకరాల కోసం 1,926 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని చెప్పారు. ఇప్పటివరకు రైతు భరోసా కేంద్రాలు, సొసైటీలకు 1,055 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశాం. అందులో 902 మెట్రిక్ టన్నులను రైతులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం స్టాక్‌గా 152 మెట్రిక్ టన్నులు ఉండగా మరో 15 రోజుల్లో అదనంగా 270 మెట్రిక్ టన్నులు పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. యూరియా అందుబాటులో ఉన్న కేంద్రాల వివరా లను కూడా వెల్లడించారు. నాతవరం మండలంలో శృంగవరం, గునుపూడి, గొలుగొండపేట, మన్యపు ఊరట్ల, గుమ్మడిగొండ, సరుగుడు, నాతవరం వైడిపేట, చార్లోపాలెం, ఎంబి పట్నం, నర్సీ పట్నం మండలంలో అమలాపురం, వేములపూడి-1, వేముల పూడి-2, చెట్టుపల్లి, ధర్మసాగరం, గురందరపాలెం, యెరకన్న పాలెం, గొలుగొండ మండలంలో చోద్యం, కొత్త మల్లంపేట, పాత మల్లంపేట, కొత్త ఎల్లవరం, మాకవరపాలెం మండలంలో బూరు గుపాలెం, కొండల అగ్రహారం, గిడుతూరు, మాకవరపాలెం, తామరం, జి.కోడూరు గ్రామాలలో యూరియా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

**ఐదేళ్లూ ఏమి చేశారు?**

ప్రభుత్వం రైతుల కోసం ఇన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ, రాజకీయ లబ్ధి కోసం కొందరు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. గత ఐదేళ్లలో రైతుల కోసం ఏమి చేశారో వైసీపీ నాయకులు చెప్పాలని ప్రశ్నించారు. రైతుల వద్ద ధాన్యం కొనుగో లు చేసిన బకాయిలు కూడా ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు. వైసీపీ నాయకులు మాట్లాడే మాటలు దెయ్యాలు వేదాలు వల్లించేలా ఉన్నాయి. రాష్ట్రం బాగు కోసం, ప్రజల బాగు కోసం అన్ని వర్గాలు సహకరించవలసిన అవసరం ఎంతో ఉంది. అబద్ధాన్ని పది సార్లు చెబితే అది నిజం కాదని ప్రజలు గ్రహించాలని అన్నారు.

**వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలి**

వైసీపీ ఇచ్చిన వాగ్దానాలు, విఫలమైన హామీలు, ప్రజలను మోసగించిన అంశాలను స్పీకర్ ఒక్కొక్కటిగా ప్రస్తావించారు. ప్రత్యేక హోదా, సీపీఎస్ రద్దు, మామిడి గిట్టుబాటు ధర, మద్యం, మూడు రాజధానులు, మెగా డీఎస్సీ, పోలీసు నియామకాలు, పెన్షన్లు, టిడ్కో ఇళ్లు, సన్న బియ్యం, అమ్మఒడి వంటి అంశాలపై వైసీపీ వైఫల్యాలను వివరించారు. సజ్జల ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని చెబుతున్నారు.. కానీ రాజ్యాంగబద్ధంగా ప్రజల సమస్యల కోసం అసెంబ్లీకి రావాలని సూచించారు. ఎమ్మెల్యే జీతం తీసుకుంటూ అసెంబ్లీకి రాకపోవడం నేరమని తెలిపారు. 18న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలని జగన్‌రె డ్డికి సలహా ఇచ్చారు.

# మెడికల్ కాలేజీలపై చర్చకు సిద్ధమా?

- అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక తప్పుడు ప్రచారమా?
- పీపీపీ మోడల్, ప్రైవేటుపరం అంటే తెలుసా?
- ఐదేళ్లలో మచిలీపట్నం కాలేజీకి ఏమి చేశారు?
- జగన్‌రెడ్డి వైద్య విద్యను భ్రష్టు పట్టించాడు
- ప్రజలకు మేలు చేయడమే కూటమి లక్ష్యం
- గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్యరథం): పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయడానికి, ప్రైవేటు పరం చేయడానికి మధ్య తేడా తెలియని అజ్ఞానులు వైసీపీ నేతలు అని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో తక్కువ ఖర్చుతో అభివృద్ధి చేస్తుంటే.. చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మచిలీపట్నంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అధ్వాన్నంగా తయారైన వ్యవస్థలను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా గాడిలో పెడుతున్నాం. ప్రజలకు మెరుగైన ప్రయోజనాలు అందించేందుకు చిత్తశుద్ధితో శ్రమిస్తున్నాం. కూటమి హయాంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, ప్రజలకు జరుగుతున్న మంచిని చూసి ఓర్వలేక జగన్‌రెడ్డి అండ్ బ్లూ మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మెడికల్ కాలేజీలను ఎక్కడా ప్రైవేటీకరణ చేయడం లేదని, పీపీపీ పద్ధతిలో తక్కువ ఖర్చుతో అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. దాతల సహకారంతో మెడికల్ కాలేజీల నిర్మాణం గురించి మాట్లాడే వైసీపీ నేతలు.. గత ఐదేళ్లలో ఏం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**మచిలీపట్నం మెడికల్ కాలేజీకి ఏమి చేశారు**

మచిలీపట్నం మెడికల్ కాలేజీని వైసీపీ హయాంలో కేవలం 30 శాతం పనులు చేస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చాక 55 శాతం పనులు పూర్తి చేశాం. జగన్‌రెడ్డి నామమాత్రంగా క్లాసులు ప్రారంభించగా.. మేము పూర్తిస్థాయిలో తరగతులు ప్రారంభించాం. వైసీపీ పాలనలో పీజీ కోర్సులకు నిధులు కూడా దారి మళ్లించా రు. మచిలీపట్నం ప్రజలకు ఉన్నత వైద్య విద్య అందించడం మాకే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. టీడీపీ పాలనలోనే 1986లో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీని స్థాపించాం. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 22 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే.. జగన్‌రెడ్డి ఎన్ని ఏర్పాటు చేశారో సమాధానం చెప్పగలరా అని ప్రశ్నించారు. 17 కాలేజీలు అంటూ హడావుడి చేస్తున్న వైసీపీ నేతలు వాటిపై చర్చ కు సిద్ధమా అని సవాల్ విసిరారు. సామాజిక సంక్షేమం గురించి వైసీపీ నేతలకు జగన్‌రెడ్డికి మాట్లాడే కనీస అర్హత కూడా లేదని మండిపడ్డారు.

**సంక్షేమం గురించి మాట్లాడే అర్హత వారికి లేదు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 64 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేశాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ నుండే పెంచిన పెన్షన్లను అమలు చేస్తూ..జులైలో ఒక్కొక్కరికి రూ.7000 అందించాం. దివ్యాంగులకు రూ.6000, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు చొప్పున అందించాం. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 48 లక్షల మంది కి, తల్లికి వందనం పథకాన్ని 67 లక్షల మందికి అందించాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథ కాలను పక్కాగా అమలు చేశాం. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని పకడ్బందీగా అమలు చేస్తుంటే.. మాట తప్పి మడమ తిప్పిన జగన్‌రెడ్డి విమర్శలు చేస్తున్నాడు. అసలు సంక్షేమం గురించి మాట్లాడే అర్హతే ఆయనకు లేదని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రజలకు ఎలా మేలు చేయాలా అని కూటమి ఆలోచిస్తుంటే.. ప్రజల్ని తప్పు దోవ పట్టించడం, దుష్ప్రచారం చేయడంపై వైసీపీ నేతలు దృష్టి సారించినట్లున్నారన్నారు. వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం మొత్తం బయటకు వస్తుండడంతో దిక్కుతోచని స్థితిలో ప్రభుత్వంపై నిందలేస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డా రు. ఈ కార్యక్రమంలో టౌన్ పార్టీ ప్రెసిడెంట్ లోగిశెట్టి స్వామి, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కార్పొరేటర్లు అన్నం ఆనంద్, దేవరపల్లి అనిత, మరకాని సమత కీర్తి, చిత్తజల్లు నాగరాము, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచె నాని, జనసేన నాయకుడు మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌రెడ్డి మెడికల్ కాలేజీలను గాలికొదిలారు

- పీపీపీ మోడల్‌లో నిర్మిస్తుంటే విమర్శలా?
- మార్కాపురం కాలేజీని వారు పూర్తిచేయలేదు
- పూర్తిచేసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభిస్తాం
- వెలుగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితం చేసి జగన్‌రెడ్డి జిల్లా ప్రజలను మోసం చేశారు
- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి



మార్కాపురం (చైతన్యరథం): నాడు వైసీపీ ప్రభుత్వం మెడి కల్ కాలేజీలను ఆర్భాటంగా ప్రకటించి నిర్మాణాలను గాలికొదిలేసిందని, అసంపూర్తిగా ఉన్న మెడికల్ కాలేజీలను పీపీపీ మోడల్‌లో పూర్తి చేస్తామని మంత్రి డోలా బాల వీరాంజ నేయస్వామి పేర్కొన్నారు. సోమవారం ప్రకాశం జిల్లా మార్కా పురం రాయవరంలో మెడికల్ కాలేజ్ నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబుతో కలిసి పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ఆర్భాటంగా ప్రకటించి నిర్మా ణాలను గాలికొదిలేసిందని మండిపడ్డారు. అసంపూర్తిగా ఉన్న మెడికల్ కాలేజీలను పీపీపీ మోడల్‌లో పూర్తి చేసేందుకు కూట మి ప్రభుత్వం క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంది. మెడిసిన్ విద్యను ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తుందంటూ దీనిపై వైసీపీ ప్రజల్లో తప్పుడు ప్రచారాలు చేస్తోంది. మార్కాపురంలో మెడికల్ కాలేజ్ పనులు 18.8 శాతం మాత్రమే పూర్తయ్యాయి. కానీ 80 శాతం పూర్తి చేశామని వైసీపీ అబద్ధాలు చెప్పుకోవడం సిగ్గు చేటు. గత వైసీపీ ప్రభుత్వం కనీసం ఒక్క భవనం కూడా పూర్తి చేయలేదు. మార్కాపురం మెడికల్ కాలేజ్ పూర్తిచేసి 2026 - 2027 విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, అరకు మెడికల్ కాలేజీలను మొదట విడతగా పూర్తి చేస్తాం. రాష్ట్రంలో మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీలను ప్రోత్సహించి పేద విద్యార్థులకు మెడిసిన్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే అవకా శం కల్పించింది ఎన్డీఏ ప్రభుత్వమే. వెలుగొండ పూర్తి చేయ కుండానే జాతికి అంకితం చేసి జగన్ జిల్లా ప్రజలను మోసం చేశారు. మేము ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తాం, వెలిగొండ పూర్తి చేసి జిల్లాను సస్యశ్యా మలం చేస్తామని స్పష్టం చేశారు.

# అన్నదాతలను దగా చేసి మొసలి కన్నీరా?

- యూరియా కొరత లేకున్నా అపోహలు సృష్టిస్తున్నారు
- గత ప్రభుత్వంలో 5 లక్షల మెట్రిక్ టన్నులే సరఫరా
- మేం 7 లక్షల మెట్రిక్ టన్నులు అందజేస్తున్నాం
- వ్యవసాయాన్ని నాశనం చేసి రైతులను నట్టేట ముంచి నేడు అన్నదాత పోరుతో కొత్త డ్రామాకు తెరలేపారు
- వ్యవసాయం, ఇరిగేషన్ అంశాలపై చర్చకు సిద్ధమా?
- కూటమికి మంచి పేరు వస్తుందనే విష ప్రచారం
- మామిడి, పొగాకు, కోకో, ఉల్లికి మద్దతు ధర కల్పించాం
- గృహ నిర్మాణ, సమాచార మంత్రి కొలుసు పార్థసారథి



మంగళగిరి (చైతన్యరథం): న్నదాతలపై వైసీపీ మొసలి కన్నీరు కారుస్తూ.. యూరియా కొరత లేకున్నా అపోహలు సృష్టిస్తున్నారని గృహ నిర్మాణ, సమాచార మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను విజయవంతం గా అమలు చేస్తుంటే తట్టుకోలేక వారు విష ప్రచారానికి పూనుకు న్నారని మండిపడ్డారు. సోమవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో వైసీపీ నేతల దుష్ప్రచా రాన్ని ఎండగట్టారు. కూటమి ప్రభుత్వ 15 నెలల పాలనలో సంక్షే మ పథకాలు, సూపర్‌సిక్స్ హామీలు విజయవంతంగా అమలు చేశాం. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 10న అనంత పురంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నాం. విద్య, వైద్యం, వ్యవసాయం ఇతర అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ.. సంక్షేమ పథ కాలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి మంచిపేరు వస్తుం దని వైసీపీ ఫేక్ ప్రచారానికి తెర లేపిందని ధ్వజమెత్తారు. ప్రజల్లో ఆందోళనలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం జగన్ రెడ్డి దిగజారుడు తననానికి నిదర్శనం. సమస్యలు ఉంటే ప్రతిపక్ష పార్టీగా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే ప్రజలు హర్షిస్తారు. కానీ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా వారిలో అపోహలు సృష్టిస్తూ ప్రభుత్వంపై బురద జల్లే విధంగా నీలి పత్రికలు తప్పుడు రాతలతో భయాందోళనలకు గురిచేయడం సిగ్గుచేటని మండిప డ్డారు.

**ఐదేళ్లలో ఒక్క ప్రాజెక్టునైనా పూర్తిచేశారా?**

ప్రతి ఏటా రైతులకు యూరియా అందజేయడం, సాగునీటి సరఫరా ప్రభుత్వ పని. గత ఐదేళ్ల పాలనలో ఒక్క కాలువ పనులై నా చేశారా? ఒక్క ప్రాజెక్ట్‌ను అయినా పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించారా? ఇవేం చేయకుండా రైతులను నట్టేట ముంచి నేడు కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు. హంద్రీనీవా తో కూటమి ప్రభుత్వ పాలనలో ఆయకట్టు విస్తీర్ణం పెరిగింది. ఒక్క రూపాయి కూడా హంద్రీనీవా కోసం జగన్ ఖర్చు చేయలేదు. రాయలసీమ జిల్లాలకు హంద్రీనీవా ద్వారా మేలు జరిగిన విష యం వాస్తవమని పేర్కొన్నారు.

**యూరియా కొరత అంటూ వైసీపీ తప్పుడు ప్రచారం:**

జగన్ తన హయాంలో 5 లక్షల టన్నుల యూరియా మాత్రమే తీసుకొచ్చారు. మేం 7 లక్షల యూరియా అందుబాటులో ఉం చాం. లేనిది ఉన్నట్టు చూపించి రైతుల్లో భయాందోళనలు సృష్టించి కృతిమ కొరత తెస్తున్నారు. 2025 ఆగస్టుకే 5,69,712 టన్నులు రైతులకు సరఫరా చేసేశాం. ప్రస్తుతం 94,482 వేల టన్నులు సరఫరా చేశాం. ఈ నెలలో 10 లోపు మరో 40 వేల మెట్రిక్ టన్నులతో కలిపి 7 లక్షల టన్నులు యూరియా సరఫరా చేస్తున్నాం. వైసీపీ విధానమే ఫేక్ ప్రచారం.. పోలవరం ప్రాజెక్ట్‌ను జగన్‌రెడ్డి సర్వనాశనం చేశారు. 2027కి పోలవరం పూర్తి చేసేలా చంద్రబాబు పని చేస్తున్నారని స్పష్టం చేస్తున్నారు.

**ధాన్యం సొమ్ము 24 గంటల్లో జమ చేస్తున్నాం**

ధాన్యం ప్రతి గింజా మేమే కొంటామని చెప్పిన జగన్‌రెడ్డి.. అరకొరగా కొనుగోలు చేసి ధాన్యం సొమ్మును మూడు నెలల తర్వా త కూడా రైతుల ఖాతాల్లో జమ చేయలేదు. జగన్‌రెడ్డి రైతుల ధాన్యం సొమ్ము రూ.1,624 కోట్లు ఎగ్గొట్టింది. ఆర్థిక పరిస్థితుల్లో ఉన్నా కూడా రూ.1624 కోట్లు ఒక్క నెలలో మొత్తం రైతులకు చెల్లించిన ఘనత కూటమి ప్రభుత్వానిది. 42 లక్షల టన్నుల ధాన్యం మీరు కొంటే.. 68 లక్షల టన్నుల ధాన్యం కొని 24 గంట ల్లో డబ్బులను రైతులకు చెల్లించాం. అది చంద్రబాబు ప్రభుత్వం గొప్పతనం. 15 నెలల్లో రూ.18,000 కోట్లు రైతులు పండించిన పంటలకు చెల్లించాం. ఐదేళ్ల పాలనలో మామిడి, పొగాకు, కో కో రైతులకు సంబంధించి ధరలు లేకపోతే ఎప్పుడైనా కొన్నారా? ఉల్లి పంటలకు వైసీపీ హయాంలో ధర కూడా ప్రకటించలేదు. రూ. 1200తో కొనుగోలు చేసేందుకు కూటమి ప్రభుత్వం ముందు కొచ్చింది. రప్పా రప్పా నరికేస్తాం..అడ్డొస్తే తొక్కేస్తామని రైతుల పేరుతో వైసీపీ నాయకులు డ్రామాలు ఆడారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర అందించాం. బ్లాక్ బెర్రి కంపెనీ ధర కల్పించలే మని ముఖం చాటేస్తే రైతు సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కోకూ పంట రకాలను బట్టి రూ.12 వేలకు, రూ.9 వేలకు, రూ.6 వేలకు కొన్న ప్రభుత్వం మాది. రైతు సమస్యలపై వైసీపీ నాయకు లు మొసలి కన్నీరు కారుస్తున్నారు. రైతులకు ఉపయోగపడే పని ముట్లు కూడా అందించలేదు, రాయలసీమ బిడ్డను అని చెప్పుకునే జగన్‌రెడ్డి డ్రిప్ ఇరిగేషన్‌ను రద్దు చేశాడు. రాయలసీమ రైతులను నిండా ముంచాడు. చంద్రబాబు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేసి వారికి మేలు చేశారని గుర్తుచేశారు.

**2024-29లో సాగునీటి రంగానికి లక్షన్నర కోట్లు ఖర్చు**

నీటిపారుదల రంగానికి మేం రూ.75 వేల కోట్లు ఖర్చు చేస్తే... మీరు కేవలం రూ.30 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. డ్రైయి న్లు, ఇతర నీటి ప్రాజెక్టులకు ఎందుకు ఖర్చు చేయలేకపోయారు. 2024 -29 సాగునీటి రంగానికి లక్ష నుంచి లక్షన్నర కోట్లు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పులివెందులలో ఒక చెరు వు ఉంది. ఆ చెరువు నింపితే మొత్తం పులివెందుల రైతులు బాగుపడతారు. అది జరగాలంటే హంద్రీనీవా ద్వారా నీరు రావా లి. అది చేసేందుకు కూడా జగన్‌రెడ్డికి మనసు రాలేదు. రైతు సమస్యలపై ఒక్క రోజు కూడా సమీక్ష చేయలేదు. కానీ ఈ రోజు వ్యవసాయం, సాగునీటి రంగాలపై సీఎం చంద్రబాబు సమీక్షలు చేస్తూ రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎరువులన్నీ అందుబా టులో ఉన్నాయని తెలిపారు. అన్నదాతకు జగన్‌రెడ్డి రూ.7,500 ఇస్తే కేంద్రం నిధులతో కలిపి చంద్రబాబు రూ.20 వేలు ఇస్తు న్నారు. జగన్‌రెడ్డి పాలనలో కౌలు రైతులకు రైతు భరోసా ఇచ్చా రా? కేంద్రం కౌలు రైతులకు ఇవ్వకపోయినా.. కూటమి ప్రభు త్వం భారం పడినా కౌలు రైతులు బాగుండాలని రూ.20 వేలు ఇచ్చే కార్యక్రమం చేస్తుంది. రైతు సమస్యను పరిష్కరించడం మాకు అత్యంత ప్రాధాన్యమైన అంశం. ఏ ఇన్‌ఛార్జ్ మంత్రి జిల్లాల్లో పర్యటనలకు వెళ్లినా రైతుల సమస్యలపై దృష్టి పెట్టండి. ప్రభుత్వం దృష్టికి తీసుకురండని సీఎం చంద్రబాబు తమకు చెప్పారు. రైతులపై చంద్రబాబుకు ఉన్న నిబద్ధత అది అని గుర్తుచేశారు.

**వైసీపీ దమ్ముంటే చర్చకు రావాలి**

రైతులు క్యూలో నిలబడాల్సిన పరిస్థితి తీసుకొచ్చింది వైసీపీ నే. దాదాపు 1500 టన్నులు బ్లాక్ మార్కెట్‌లో అమ్మేశారు. దమ్ముంటే రైతు సమస్యలపై చర్చకు వైసీపీ రావాలి. మీరు ఎంత యూరియా రైతులకు ఇచ్చారు, వ్యవసాయం, ఇరిగేషన్ కోసం మీరు ఏం చేశారో చర్చించేందుకు సిద్ధమా? అని సవాల్ విసిరా రు. కేవలం విష ప్రచారం చేయడమే పనిగా వైసీపీ పెట్టుకుంది. ఎవరినైనా విడుదల చేయాలన్న, శిక్షించాలన్నా అది కోర్టు రూల్స్ ప్రకారం ఉంటుంది. సీనియర్ ఐఏఎస్ అధికారులు, సీనియర్ రాజకీయ నాయకులు జైల్లో అరుపులు చూస్తే అంతా విచిత్రంగా ఉంది. ఒక భయాందోళన సృష్టించి రాజకీయ లబ్ధిపొందే ప్రయత్నం చేయడం వైసీపీ దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు.

# చంద్రబాబు పాలనలోనే వైద్యకళాశాలలు

- వాటిని అభివృద్ధి చేసిన ఘనత టీడీపీదే
- జగన్‌రెడ్డి వైద్యరంగాన్ని భ్రష్టు పట్టించారు
- అబద్ధాలతో బతుకుతున్న పార్టీ అది
- ఫేక్‌ను ప్రజలు గ్రహించారు..ఇక మోసపోరు
- వారి హయాంలో కేంద్ర నిధులు ఖర్చు చేయలేదు
- నిధులను వైసీపీ నేతలు జలగల్లా దోచుకుతిన్నారు
- మోసగించడం వారికి వెన్నతో పెట్టిన విద్య
- ఎన్ని కాలేజీలు పూర్తి చేశారో ప్రజలకు చెప్పాలి
- మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు



మంగళగిరి (చైతన్యరథం): సాక్షి పత్రికలో మెడికల్ కాలేజీలపై వచ్చిన తప్పుడు కథనాన్ని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాల య కార్యదర్శి పర్చూరి అశోక్‌బాబు ఖండించారు. సోమవారం మంగళగిరి ఎన్టీఆర్ భవన్ మీడియా సమావేశంలో ఆయన వాస్తవాలు వివరిస్తూ మెడికల్ కాలేజీల స్థాపన, చేసిన వ్యయం గురించి బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. సాక్షి పత్రికలో 15 ఏళ్లలో చంద్రబాబు ఒక్క మెడికల్ కాలేజీ కూడా తేలే దని తప్పుడు కథనంతో ప్రజలను మోసం చేసే అబద్ధంగా ఎండ గట్టారు. "ఈరోజు సూర్యోదయం లేదు అని రాస్తే ఎవరూ నమ్మర ని వైసీపీ నేతలకు హితవు పలికారు. ప్రజలు వాస్తవాలు తెలు సుకునే మేధావులు..పత్రిక ఉందని బురదజల్లొచ్చు..ఏదైనా రాసే యొచ్చని అనుకుంటున్నారు.. కానీ వాస్తవాన్ని మాత్రం దాచలేరని స్పష్టం చేశారు.

**చంద్రబాబు పాలనలో వైద్యరంగ అభివృద్ధి**

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో 27 మెడికల్ కాలేజీలు ఏర్పాటయ్యాయి. 2014-19 లోనే 11 కొత్త కాలేజీలు (6 ప్రైవేట్, 5 ప్రభుత్వ రంగం) ప్రారం భమయ్యాయి. మెడికల్ కాలేజీ అంటే కేవలం బోర్డు కాదు.. హాస్పిటల్స్, బెడ్స్, ల్యాబ్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అన్నీ ఉండాలి. వాటిపై అవగాహన వైసీపీకి లేదు. వైద్యరంగాన్ని బలోపేతం చేయ డం, ప్రజలకు నాణ్యమైన వైద్యసదుపాయాలు అందించడం టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

**వైసీపీ తప్పుడు ప్రచారం..వాస్తవాలు ఇవే**

కేంద్రం ఆమోదించిన 17 మెడికల్ కాలేజీలలో ప్రస్తుతం విద్యార్థులు చదువుతున్నది కేవలం 5 కాలేజీల్లో మాత్రమే. ఆ 17 కాలేజీలకు కేంద్ర ప్రభుత్వం రూ.8,480 కోట్ల అంచనా వేసింది. అందులో రూ.5,000 కోట్లు నాబార్డ్ రుణం, మిగతా నిధులు రాష్ట్రం చూడాలని చెప్పింది. కేంద్రం అప్పటికే రూ.975 కోట్లు విడుదల చేసింది. కానీ జగన్ ప్రభుత్వం ఖర్చు చేసింది కేవలం రూ.465 కోట్లు మాత్రమే. మొత్తంగా ఇప్పటివరకు ఖర్చయింది రూ.1,451 కోట్లు మాత్రమే అని లెక్కలతో సహా వివరించారు. ఈ నిధుల్లో 84 శాతం మొత్తాన్ని పులివెందుల కాలేజీకే మళ్లించారని విమర్శించారు. మిగతా కాలేజీలు అసంపూర్ణంగా వదిలేశారని ఎండగట్టారు.

**జగన్ పాలనలో వైఫల్యాలు**

ఒక్కో కాలేజీకి రూ.300-350 కోట్లు అవసరం..కానీ పెట్టింది కేవలం రూ.150-170 కోట్లు మాత్రమే. ఫ్యాకల్టీ లేకపోవడంతో మార్కాపురం, ఆదోని, మదనపల్లె, పాడేరు కాలేజీలను మెడికల్ కౌన్సిల్ తిరస్కరించింది. పాడేరు కాలేజీకి రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. రాళ్లు వేసి.. బోర్డులు పెట్టి ప్రజలను మోసం చేయడం వైసీపీ అలవాటేనని మండిపడ్డారు. జగన్ కొత్తగా ఏ ప్రాజెక్ట్ పూర్తిచేయకుండా టీడీపీ ప్రారంభించిన వాటినే తాము చేశామని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. రాష్ట్రం లో మెడికల్ కాలేజీలు కట్టిన ఘనత చంద్రబాబుదే అని స్పష్టం చేశారు. జగన్ పాలనలో ఆరోగ్యరంగం శూన్యం..అవినీతి, అబద్ధాలు మాత్రమే మిగిలాయియని విమర్శించారు. వైసీపీ విష ప్రచారం ఎప్పటికీ నిలబడదు.. ప్రజలు వారి తీరును గమనిస్తున్నా రు.. వాస్తవాలు తెలుసుకుంటారని తేల్చి చెప్పారు. జగన్‌రెడ్డి ఎన్ని కాలేజీలు పూర్తి చేశారో, ఎంత ఖర్చు చేశారో దమ్ముంటే లెక్కలు చెప్పాలి..ప్రజలకు చూపాలని సవాల్ విసిరారు. ప్రజలకు నాణ్య మైన వైద్య సదుపాయాలు చంద్రబాబు పాలనలోనే సాధ్యమని, వైసీపీ పాలనలో ఆరోగ్యరంగం పూర్తిగా కూలిపోయిందని స్పష్టం చేశారు.

# వైసీపీ ప్రతిపక్షం కాదు.. విష వృక్షం

- **నాడు రైతులను మోసగించి నేడు నీతులా?**
- **రెచ్చగొట్టేందుకే జగన్‌రెడ్డి సరికొత్త నాటకాలు**
- **వైసీపీ అన్నదాత పోరు కాదు..దగా పోరు**
- **కూటమి ప్రభుత్వం 15 నెలల పాలన..**
- **15 ఏళ్ల భవితకు పునాది వేసింది**
- **ఆర్థిక కష్టాలు దాటి సూపర్‌సిక్స్ సూపర్ హిట్**
- **అనంత సభను విజయవంతం చేయాలి**
- **ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి**



అమరావతి/నంద్యాల (చైతన్యరథం): నేడు ప్రజలకు సంక్షేమం - అభివృద్ధితో కూడిన సుపరిపాలన అందించడంలో గత 15 నెలల్లో కూటమి ప్రభుత్వం సూపర్ సక్సస్ అయిందని రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి సూపర్ 6 ను సూపర్ సక్సస్ చేసిన ఘనత చంద్రబా బుదేనని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటూ ముం దుకు సాగుతుంటే.. వైసీపీ నేతల్లో నేడు గుబులు మొదలైంద న్నారు. వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మే పరిస్థితిలో లేరని హితవుపలికారు. కేవలం తన ఉనికి కాపాడుకోవడం, స్వార్ధ రాజ కీయాల కోసం పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలను సైతం వైసీపీ మార్కు బ్లాక్ మెయిల్ రాజకీయాలతో అడ్డుకుంటుందని మండిపడ్డారు.

**ప్రతిపక్షం కాదు.. ఒక విష వృక్షం**

కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలుతో దేశంలో మరే రాష్ట్రంలో అమలు కాని స్థాయిలో రెట్టింపు సంక్షేమం నేడు రాష్ట్రంలో ప్రజలకు అందుతోంది. అయినప్పటికీ అధికారం చేపట్టి న తొలి రోజు నుంచే ప్రతిపక్ష వైసీపీ తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలు, కుట్ర రాజకీయాలకు పాల్పడుతూనే ఉంది. రాష్ట్రం లో 63 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ప్రతీ నెలా ఇంటి వద్దే పంపిణీ చేస్తూ సంక్షేమ రాజ్యానికి కొత్త అర్థం తీసుకొచ్చాం.. మరే రాష్ట్రంలోనూ లేని విధంగా కేవలం ఒక్క పెన్షన్‌లకే మన రాష్ట్రంలో ఒక్క ఏడాదిలోనే రూ.33,000 కోట్లు ఖర్చు చేశాం. తల్లికి వందనం పథకంతో రూ.10 వేల కోట్లతో ఒక్కో విద్యార్థికి రూ.15 వేల చొప్పున మొత్తం 67 లక్షల మంది తల్లుల ఖాతాల్లో జమ చేసి.. కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా వారందరికీ వర్తింప చేశాం.. దీపం-2 పథకం ద్వారా ఉచిత సిలిండర్లు ఇచ్చి వంటింటి ఖర్చు తగ్గించాం.

ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం ద్వారా రూ.2,684 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఇప్పటికి 2 కోట్ల రాయితీ సిలిండర్లు దీపం పథకం కింద ఇవ్వడం జరిగింది. 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించి, త్వరలో నియామ కాలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

**వైసీపీ అన్నదాత పోరుకుకు స్పందన కరువు..**

కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్లుగా నేడు వైసీపీ నేతలు.. అన్నదాత పోరు పేరుతో రైతులను రెచ్చగొట్టేందుకు సరికొత్త నాట కానికి తెరతీశారు... అయితే ఈ కార్యక్రమానికి క్షేత్రస్థాయిలో రైతన్నల నుంచి స్పందన కరువైంది.. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని భావించే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నేడు కూటమి ప్రభుత్వం రైతన్నల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతిస్తోంది.. ఇప్పటికే కూటమి ప్రభుత్వం సూపర్ 6 హామీ ల్లో అమలులో భాగంగా అన్నదాత సుఖీభవను విజయవంతంగా అమలు చేసి చూపింది.. ప్రతీ రైతుకు మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్రం రూ.2 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు... 47 లక్షల మంది రైతులకు రూ.3,173 కోట్లు అందించ డం జరిగింది. నేడు అన్నదాత పోరంటూ కపట నాటకం ఆడుతు న్న వైసీపీ ప్రభుత్వం.. అధికారంలో ఉన్న ఐదేళ్లలో మూడేళ్ల పాటు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు రైతు వాటా కింద నయా పైసా చెల్లించకుండా రైతుల పంట బీమాకు ఎగనామం పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు.

**రైతులు ఆందోళన వద్దు..ప్రభుత్వం ఆదుకుంటుంది..**

రాష్ట్రంలో యూరియా కొరత, ఉల్లి ధరలు తగ్గడం వంటి అంశాలపై ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికా రులు.. ఎప్పటికప్పుడు స్పందిస్తూ క్షేత్రస్థాయిలో రైతుల ఇబ్బందులను గుర్తిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్లు వ్యవసాయ శాఖ అధికారులు, మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ సక్రమంగా సాగుతోంది.. వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి మరిన్ని యూరియా నిల్వలు రానున్న నేపథ్యం లో రైతులు ఆందోళన చెందొద్దని మంత్రి భరోసా వ్యక్తం చేశారు. ఉల్లి రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలు గా రైతులకు సహకరిస్తుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వమే రూ. 1200కు క్వింటాళ్లు ఉల్లిని కొనుగోలు చేస్తుందన్నారు. అంతకు మించి ఉల్లి ధర తగ్గకుండా చూడాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించడం జరిగింది. వరుస వర్షాలతో ఉల్లి పంట దెబ్బతినడం, నాణ్యతా ప్రమాణాలు తగ్గడం కూడా ఉల్లి ధరల పతనానికి కార ణమని, అయినప్పటికీ పూర్తి స్థాయిలో ఉల్లి రైతులను ఆదు కుంటామని మంత్రి తెలిపారు.

**వైద్య కళాశాలలపై దుష్ప్రచారం సరికాదు**

రాష్ట్రంలో వైద్యకళాశాలను ప్రైవేటీకరిస్తున్నట్లు వైసీపీ తన అసత్య ఆరోపణలను ఖండిస్తూ అందులో ఎంతమాత్రం వాస్తవం లేదని మంత్రి మండిపడ్డారు. మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రజలకు మరింత సమర్థవంతమైన వైద్య సేవలు అందించేందుకు మాత్రమే పీపీపీ విధానాన్ని ప్రభుత్వం తీసుకు రావడం జరుగుతోందన్నారు. ఈ చర్యల కారణంగా రాష్ట్రంలో మెడికల్ కాలేజీల్లో అదనంగా సీట్లు పెరిగేందుకు కూడా ఈ నిర్ణయం సానుకూలంగా మారుతుందన్నారు.

14 ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 4 శాతం నిధులు ఆరోగ్య శాఖకు కేటాయిం చాల్సి ఉండగా గత ఐదేళ్లలో కేవలం 1 శాతం నిధులు కేటా యిం చిన జగన్ పేదలకు వైద్య సేవలు, మెడికల్ సీట్ల గురించి మాట్లాడుతుండటం చూస్తే, దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉందన్నారు.. 17 మెడికల్ కాలేజీలు రాష్ట్రానికి తెచ్చానని చెప్పు కుంటున్న జగన్‌రెడ్డి గత ఐదేళ్లలో ఒక్క మెడికల్ కాలేజీ నిర్మా ణం కూడా పూర్తి చేసిన పాపాన పోలేదన్నారు.. మెడికల్ కాలేజీల నిర్మాణానికి ఐదేళ్లలో 17 శాతం నిధులు కూడా ఖర్చు పెట్టని జగన్ 17 మెడికల్ కాలేజీలు రాష్ట్రానికి తెచ్చానని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అనంతపురంలో ఈ నెల 10న జరగనున్న సూపర్ సిక్స్- సూపర్ హిట్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

# రాష్ట్రంలో చెత్తను క్లియర్ చేస్తాం

- **గత ప్రభుత్వం 85 లక్షల టన్నులు పెట్టి వెళ్లింది**
- **అనంతపురం డంపింగ్ యార్డ్ స్థానంలో పార్కు**
- **30 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపిస్తున్నాం**
- **పురపాలక మంత్రి పొంగూరు నారాయణ**
- **బయోమైనింగ్ పనుల ఆకస్మిక తనిఖీ**
- **ఏపీలో 6 క్రష్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు: పట్టాభిరామ్**



అనంతపురం (చైతన్యరథం): రాష్ట్రంలో 123 మున్సిపాలిటీల్లో చెత్త పన్ను వేసి వైసీపీ ప్రభుత్వం 85 లక్షల టన్నులు చెత్త పెట్టి పోయారని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ మండిపడ్డారు. అనంతపురం డంపింగ్ యార్డ్‌లో జరుగుతున్న బయోమైనింగ్ పనులను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ ఆయన వెంట ఉన్నారు. రోజుకి ఎంత చెత్త తరలి స్తున్నారు.. ఇప్పటివరకు ఎంత పూర్తయింది, మిగిలిన వాటిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారని మంత్రి నారాయణ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్నటివరకు 78 వేల టన్నుల చెత్తను క్లియర్ చేశారని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దీనిని తరలిస్తున్నట్లు చెప్పారు. ఈ డంపింగ్ యార్డ్ స్థానంలో పార్క్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి అడిగా రని.. కచ్చితంగా ఇక్కడ ఒక అద్భుతమైన పార్క్ ఏర్పాటు చేస్తామ న్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి.. కలెక్టర్ ఇతర అధికారు లకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో అమృత్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కింద కేంద్రం నుంచి పెద్దఎత్తున నిధులు వచ్చినప్పటికీ దానిని రాష్ట్ర ప్రభుత్వం తరపున నిధులు ఇవ్వకుం డా అభివృద్ధికి ఆటంకంగా మార్చారన్నారు. ప్రస్తుతం ఈ రెండు ప్రాజెక్టుల కింద పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యం కింద నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. 10 లక్షల కోట్ల రూపాయలు అప్పులు పెట్టి.. ఖజానా ఖాళీ చేసి వెళ్లినా.. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేసి సూపర్ హిట్ చేశా మన్నారు. మిగిలిన హామీలు కూడా కొద్దిరోజుల్లోనే అమలు చేస్తా మని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా సమస్యగా ఉన్న డంపింగ్ యార్డ్‌లో చెత్తను పూర్తి గా తరలిస్తున్నట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో రెండు లక్షల టన్నుల మేర చెత్త ఉంటే.. దానిని తరలించామని రికార్డుల్లో చూపి డబ్బులు కాజేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాయణ చొరవతో ఇక్కడ బయో మైనింగ్ పనులు మొదలు పెట్టమ న్నారు. ప్రస్తుతం నాలుగు మిషన్లతో పనులు జరుగుతున్నాయన్నా రు. ఇప్పటికే 60 శాతం చెత్త తరలించినట్లు చెప్పారు. 85 లక్షల టన్నుల చెత్తను అక్టోబర్ 2 నాటికి తరలించి డంపింగ్ యార్డ్ స్థానంలో పార్కు తీసుకొస్తామన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పేరుకుపోయిన చెత్తను తరలిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం మంత్రి నారాయణ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఇప్పటికే 90 శాతం చెత్తను ప్రాసెస్ చేసి సాలిడ్ వేస్ట్‌ను సిమెంట్ ఫ్యాక్టరీలు ఇతర వాటికి తరలిస్తున్నట్లు చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కింద రాష్ట్రంలో ఆరు వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లను తీసుకొస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా క్లస్టర్ల పరిధిలో ఎక్కడా చెత్త లేకుండా చేసి దేశంలోనే ఏపీని రోల్ మోడల్‌గా నిలబెడుతామన్నారు. రాష్ట్రంలో ప్రతి పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మారుస్తామని స్పష్టం చేశారు.

# చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటారా?

- **పోలీసులు, జైలు అధికారులను దూషిస్తారా?**
- **శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే జాగ్రత్త**
- **బాధ్యులను తక్షణమే అరెస్టు చేయాలి**
- **పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య**



మంగళగిరి(చైతన్యరథం): జగన్‌రెడ్డి అండ్ కోపై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ధ్వజమెత్తారు. మద్యం కుంభ కోణంలో ప్రధాన ముద్దాయిలుగా ఉన్న మాజీ ఐఏఎస్ అధికారులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలు బెయిల్‌పై విడుదల కావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమ వారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ఆరాచక పార్టీలాగా కనిపిస్తుంది. ఇది రాజ కీయం కోసం.. ప్రజా సేవ కోసం ఏర్పడిన పార్టీ కాదు. అవినీతి సొమ్మును దాచుకోవడం కోసం, ప్రభుత్వ వ్యవస్థలను వాడుకోవ డం కోసమే రాజకీయ పార్టీ పెట్టారని ధ్వజమెత్తారు. మద్యం కుంభకోణంలో రూ.3,500 కోట్లు ప్రజా సొమ్ము కొట్టేశారని, సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) ప్రిలిమినరీ ఛార్జ్‌షీట్ వేసిందని చెప్పారు. ఈ కేసులో పెద్ద పెద్ద బడా తలలు ఇంకా అరెస్టు అయ్యే అవకాశం ఉందన్నారు. మాజీ ఐఏఎస్ అధికారులు, భారతీ సిమెంట్ డైరెక్టర్ 110-117 రోజులు జైలులో ఉన్న తర్వాత బెయిల్ పొందడంపై ప్రశ్నలు లేవనెత్తారు. రూ.100 కోట్ల మద్యం కుంభకోణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ 160 రోజులు జైలులో ఉన్నారు. డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా 530 రోజులు ఉన్నారు. ఎమ్మెల్సీ కవిత 160 రోజులు ఉన్నారు. కానీ ఇక్కడ రూ.3,500 కోట్ల కుంభకోణంలో 114-117 రోజు ల్లోనే బెయిల్ వచ్చిందన్నారు. ధనుంజయరెడ్డి డీఫ్యాక్టో ముఖ్యమం త్రిగా పనిచేశారని, జగన్ ఫైళ్లు చూడకుండా ఆయనే నిర్ణయాలు తీసుకునేవారని ప్రజావాక్కుగా చెప్పారు. విజయవాడ జైలు వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గుమికూడి, పోలీ సులపై దాడి చేయడం, బారికేడ్లు దాటడం వంటి ఆరాచకాలు సృష్టించారని ఆరోపించారు. జైలు అధికారులు, పోలీసులను దూషించడం, శాంతిభద్రతలకు భంగం కలిగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ పోలీస్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేస్తూ బాధ్యులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మద్యం కుంభకో ణంలో కల్తీ మద్యం తాగి 30 వేల మంది చనిపోయారు. 35 లక్షల మంది అనారోగ్యం పాలయ్యారు. దానికి జగన్ రెడ్డి బాధ్యు లు. విదేశాల్లో దాచిన సొమ్మును రికవరీ చేసి బాధితులకు చికిత్స అందించాలని సూచించారు. చెవిరెడ్డి వంటి వారి ఆగడాలను కట్టడి చేయాలని..అవసరమైతే ఇతర జైళ్లకు మార్చాలని కోరారు. జగన్ పార్టీ కార్యకర్తలను కంట్రోల్ చేసుకోవాలని.. చట్టాన్ని చేతు ల్లోకి తీసుకుంటే చంద్రబాబు ప్రభుత్వం తోలు తీస్తుందని హెచ్చ రించారు. ప్రతి శుక్రవారం కోర్టు పిలవడం లేదని జగన్ అనుకుం టున్నారెమో..ఏ ఒక్క కేసు కూడా మిమ్మల్ని వదిలి పోలేదు. మీ శేష జీవితం ప్రశ్నాకరంగా ఉందని ఆలోచన చేసు కోండి. జగన్‌రెడ్డి ఇప్పటికైనా ప్రతి అడుగు హుందాగా వేసి పార్టీ అధ్యక్షుడిగా వ్యహరించాలి గాని కిల్లర్‌గా వ్యవహరించరాదని హితవుపలికారు.

# ఏపీకి మరో 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా

- సీఎం చంద్రబాబు కృషితో కేటాయింపు
- రైతాంగం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): ఏపీకి మరో 50 వేల మెట్రిక్ టన్నుల యూరియాను అదనంగా కేటాయించినట్లు వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు యూరియా కొరతతో ప్రత్యక్షంగా కేంద్రంతో మాట్లాడినట్లు చెప్పారు. కేంద్ర ఎరువుల రసాయనిక మంత్రి నడ్డా తో జరిపిన చర్చలు సఫలమై ఈ కీలక సమయంలో 50000 మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి కేటాయింపు చేసినందు కు రైతుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ద్వారా కాకినాడ పోర్టుకు 17294 మెట్రిక్ టన్నులు, ఇండియన్ పొటాష్ లిమిటెడ్ మంగళూరుకు 5400 మెట్రిక్ టన్నులు, నర్మదా కంపెనీ నుంచి జైగర్ పోర్టుకు 10800 మెట్రిక్ టన్నులు, నేషనల్ ఫెర్టిలైజర్స్ నుంచి విశాఖకు 15874 మెట్రిక్ టన్నుల యూరియా రెండురోజుల్లో రాష్ట్రానికి చేరుకోను న్నాయని తెలిపారు. ఈ కేటాయించిన 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా ఆగస్టు నెలకు కేటాయించిన 82151 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయింపునకు అదనమని వివరించారు. 41183 మెట్రిక్ టన్నుల యూరియా ఇప్పటికే రైతుసేవ కేంద్రాలకు సరఫరా చేయటం జరిగిందని, మిగిలిన 40968 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు సిద్ధంగా ఉండి, రవాణాలో ఉందని తెలి పారు. రైతుల్లో ఆందోళన వద్దని సైజుచించారు. వ్యవసాయ అధికారుల నుంచి సిఫారసు మేరకు మాత్రమే యూరియా వాడా లని కోరారు.

# ఆర్టీఐ అప్పీళ్ల విచారణ ప్రత్యక్ష ప్రసారం

**ప్రారంభించిన గవర్నర్ అబ్దుల్ నజీర్ - సమాచార కమిషన్‌కు అభినందనలు**



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్ర సమాచార కమిషన్ రెండవ అప్పీళ్లు, ఫిర్యాదుల విచారణల ప్రత్యక్ష ప్రసారాన్ని గవర్నర్ అబ్దుల్ నజీర్ సోమవారం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార కమిషన్ విచారణల ప్రత్యక్ష ప్రసారం కమిషన్ పనితీరులో మరింత పారదర్శకంగా నిర్వహించడానికి చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. రాష్ట్ర సమాచార కమిషన్ కృషిని అభినందించా రు. కేంద్ర సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్ హీరాలాల్ సమారియా, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ రాష్ట్ర సమన్వయకర్త.శాస్త్రవేత్త ఆర్.కె.పాఠక్, గవర్నర్ ఈవో కార్యదర్శి ఎం.హరిజవహర్‌లాల్,రాష్ట్ర సమాచార కమిషనర్ ఆర్.మహబూబ్‌బాషా కమిషన్ కార్యాలయం నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా పాల్గొన్నారు.

# కార్పొరేట్‌కు దీటుగా ఎంజేపీ గురుకులాలు

- ఆరోగ్య భద్రతతో నాణ్యమైన విద్య
- టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు
- బీసీలు బాగుపడటం జగన్‌కు ఇష్టం లేదు
- వైసీపీ పాలనలో బీసీ హాస్టళ్లు, గురుకులాలు ఐదేళ్ల పాటు నిరాదరణకు గురయ్యాయి
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- పెనుకొండలో స్మార్ట్ పే ఫోన్ల ప్రారంభం




పెనుకొండ(చైతన్యరథం): రాష్ట్రంలో నాణ్యమైన విద్య అందిం చడంతో కార్పొరేట్ విద్యా సంస్థలతో జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలు పోటీపడుతున్నాయని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థల కంటే ఎంజేపీ స్కూళ్లకే డిమాండ్ ఎక్కువగా ఉందని వెల్లడించారు. బీసీ బిడ్డలకు ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టంచేశారు. పెనుకొండలోని రొద్దం-2 ఎంజేపీ స్కూల్‌లో స్మార్ట్ పే ఫోన్లను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుతో కలిసి మంత్రి సవిత సోమవారం ప్రారంభించారు. రాష్ట్రంలో ఉన్న 110 ఎంజేపీ స్కూళ్లో 700ల వరకూ స్మార్ట్ పే ఫోన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ఫోన్ల ద్వారా తమ తల్లిదండ్రులతో విద్యార్థులు రోజూ మాట్లాడుకునే అవకాశం కల్పించినట్లు చెప్పా రు. ఒక్కో గురుకుల పాఠశాలలో ఆరు చొప్పున పే ఫోన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థికీ స్మార్ట్ కార్డు అందజేస్తామని, ఆ కార్డులో తల్లిదండ్రులు సూచించిన నాలుగు నెంబర్లు పొందుప రుస్తామని తెలిపారు. ఆ నెంబర్లకే విద్యార్థులు తమకు కేటాయిం చిన సమయంలో మాట్లాడుకునే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులతో మాట్లాడాలంటే గురుకుల పాఠశాలలకొచ్చే విజిటర్లు, ఇతరులకు సెల్ ఫోన్లు అడిగే వారన్నారు. విద్యార్థులకు ఇపుడిక ఈ కష్టాలు ఉండబోవన్నారు. వారికిచ్చిన కార్డులతో తమ తల్లిదండ్రులు, బంధువులతో మాట్లా డుకోవచ్చునన్నారు. దీనివల్ల విద్యార్థులకు ఇంటిపై బెంగపోవ డంతో పాటు విద్యపై దృష్టి సారించడానికి అవకాశం కలుగుతుందన్నారు.

**ఎంజేపీలో నాణ్యమైన విద్య**

రాష్ట్రంలో పేరొందిన కార్పొరేట్ విద్యా సంస్థలతో దీటుగా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. టెన్త్, ఇంటర్‌లో కార్పొరే ట్ విద్యా సంస్థలకు దీటుగా మిగిలిన ప్రభుత్వ సంక్షేమ గురు కులాల కంటే ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. అందుకే బీసీ గురుకులాల రాష్ట్రంలో విపరీతమైన డిమాండ్ ఉందని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత బీసీ హాస్టళ్లు, ఎంజేపీ గురుకులాలపై ప్రత్యేకదృష్టి సారించామన్నారు. అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు.

**బీసీల చదువుకోవడం ఇష్టం లేని జగన్...**

బీసీ బిడ్డలు ఉన్నత విద్య అభ్యసించాలన్న లక్ష్యంతో అన్న ఎన్టీఆర్ రాష్ట్రంలో గురుకుల పాఠశాలలకు నాంది పలికారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు రాష్ట్రం లో బీసీ బిడ్డల చదువుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ఎంజేపీ స్కూళ్లను టీడీపీ ప్రభుత్వాలే ఏర్పాటు చేశాయి.2019-24 మధ్య జగన్ హయాంలో బీసీ హాస్టళ్లు, గురుకులాల నిరాదరణకు గురయ్యాయి. మరమ్మతులు పట్టించుకోలేదు..విద్యార్థుల డైట్ బకాయిలు కూడా చెల్లించ లేదని మండిపడ్డారు. 2014-19 మధ్య సీఎం చంద్రబాబు 28 గురుకులాల అనుమతులివ్వడంతో పాటు నిధులు మంజూరు కూడా చేశారు. తరువాత వచ్చిన జగన్ పట్టించుకోలేదన్నారు. బీసీ బిడ్డలు చదువు కోవడం జగన్‌కు ఇష్టం లేదని మండిప డ్డారు.

**విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్లో మాట్లాడిన మంత్రి**

స్మార్ట్ పే ఫోన్లను ప్రారంభించిన అనంతరం మంత్రి సవిత విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పే ఫోన్ ఏర్పాటుతో తమ పిల్లలతో మాట్లాడుకునే సౌకర్యం కల్పించినందుకు సీఎం చంద్రబాబుకు విద్యార్థుల తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు. నెలల తరబడి పిల్లల ముఖం చూడలేకపోతున్నామని, ఇప్పుడు ఫోన్ సౌకర్యం కల్పించడం వల్ల బిడ్డల గొంతు వినే అవకాశం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు మంత్రి సవిత స్మార్ట్ పే ఫోన్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో మార్కెఫెడ్ చైర్మన్ బంగారురాజు, నియోజకవర్గ పరిశీల కులు నరసింహారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ఎం జేపీ స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తిరుపతిలో వైసీపీ నేతల భూ కబ్జాలు

- అక్రమ రిజిస్ట్రేషన్లతో అమ్మకానికి యత్నం
- సంరక్షించాలని ప్రజావినతుల్లో ఫిర్యాదు
- డీకేటీ భూములపై ఆ పార్టీ నాయకుల దౌర్జన్యం
- పొలానికి వస్తే అంతు చూస్తామని బెదిరింపులు

మంగళగిరి (చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమ వారం ప్రజావినతుల్లో ఏపీ ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అర్జీలు స్వీకరించారు. తమ గ్రామంలో అనాధీన భూమి సర్వే నెం.134/25, 0.98 సెంట్లు, 135/18లో 0.24 సెంట్లు భూమిని వైసీపీ నాయకులు కబ్జా చేశారని తిరుపతి జిల్లా ఏర్పేడు గ్రామానికి కె.వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. అనాధీన భూములు, పోరంబోకు భూములు, బండిబాటలు, చెరువులు, కాలువలు, శ్మశానాలు ప్రభుత్వ ఆస్తు లేనని కలెక్టర్, రెవెన్యూ అధికారులు పలుమార్లు వారికి స్పష్టంగా చెప్పినప్పటికీ కోట్లది విలువ చేసే ఈ భూములు అక్రమ రిజిస్ట్రే షన్లతో అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరారు.

**డీకేటీ భూములు ఆక్రమించిన వైసీపీ నేతలు**

ఇరువూరు గ్రామం సోమశిల ప్రాజెక్టు ముంపు ప్రాంత వాసు లమైన మేడు నల్లాయపల్లె గ్రామంలో ఉంటున్నామని వైఎస్ఆర్ కడప జిల్లా అట్లూరు మండలం కొత్త నల్లాయపల్లె గ్రామానికి చెందిన యానదయ్య, ఈరయ్య తెలిపారు. సర్వే నెం. 41, 42, 43/2,44లలో ఆరుగురికి డీకేటీ పట్టాలు 1974,1979 సంవత్స రంలో మంజూరు చేశారు. గత ప్రభుత్వంలో బద్వేలు ప్రాంతా నికి చెందిన వైసీపీ పార్టీ నాయకులు మన్యం రవీంద్రారెడ్డి, ముసల్రెడ్డి, గాజులపల్లి కృష్ణారెడ్డిలు కలిసి దౌర్జన్యంగా తమ భూములను ఆక్రమించి ఫెన్సింగ్ వేసి జామాయిల్ చెట్లు నాటా రని ఫిర్యాదు చేశారు. పొలం దగ్గరికి వస్తే అంతు చూస్తామని ఇళ్ల దగ్గరికి వచ్చి బెదిరించారని తెలిపారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. తహసీల్దార్ కార్యాల యంలో సూపరింటెండెంట్ వైసీపీ నాయకులతో కుమ్మక్కై వారి పేర్లతో పట్టాలు సృష్టించి ఇబ్బంది పెడుతున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ భూములు తమకు ఇప్పించాలని కోరారు.

**అన్నదమ్ములు వారి పేరుపై భూమి మార్చుకున్నారు**

తమ కుటుంబ పూర్వార్జిత భూములు తేటగుంట సమీపంలో సర్వే నెంబరు 893లో 4 ఎకరాలు ఉన్నాయని కాకినాడ జిల్లా తుని మండలం టి.తిమ్మాపురం గ్రామానికి చెందిన పురుషోత్తం వెంకటలక్ష్మి తెలిపారు. తమ తల్లిదండ్రులకు ఐదుగురు సంతా నం. ఇద్దరు అన్నదమ్ములకు చెరో 12 ఎకరాలు, ఇద్దరు అక్కల కు చెరో 5 ఎకరాలు, తనకు 4 ఎకరాలు రావాల్సి ఉంది. అన్న దమ్ములు, అక్కలకు వాటా భూములు పట్టాదారు పాస్‌బుక్స్ ద్వారా ఇచ్చినా తన భూమి మాత్రం ఇప్పటివరకు ఇవ్వలేని తెలిపారు. తన వాటా భూమిని ఇద్దరు అన్నదమ్ములు కలిసి చెరో 2 ఎకరాలు చొప్పున తమ పేర్లకు మార్చుకున్నారని వివరిం చింది. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి ఇప్పించాలని అభ్యర్థించారు.

**పొలం కాజేయాలని కుట్రలు**

తన భర్త కోవి రామ్మూర్తి 16-03-2023 మరణించారని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొండాపురం మండలం కోవివారిపల్లి గ్రామానికి చెందిన కోవి రాధిక తెలిపింది. వారసత్వంగా పొందిన భూమి మొత్తం సర్వే నెం.143/1లో 9.30 సెంట్లు, అలాగే తన అత్త కోవి లింగమ్మ పేరుతో ఉన్న భూమి కలిపి 7.38 సెంట్లు ఉంది. ప్రభుత్వం అసైన్డ్‌మెంట్ పట్టా ప్రకారం సర్వే నెం.143/1లో 3.80 సెంట్లు, అలాగే సర్వే నెం. 217/3లో 0.32 సెంట్లు కూడా ఉంది.

2003 సంవత్సరంలో కుటుంబ అవసరాల నిమిత్తం తన భర్త కేవలం 1.30 సెంట్లు మాత్రమే మన్నం మాలతీలతకు అమ్మినట్లు పత్రాలు ఉన్నాయి. అయితే ఇటీవల మాజీ వీఆర్వో కోవి చెంచు కృష్ణ కుమార్తె మన్నం మాలతీలత, భర్త మన్నం యల్లమందరావుతో కలిసి ఆ 1.30 సెంట్ల ఒప్పందాన్ని మార్పులు చేసి 11.50 సెంట్లు రాసి ఇచ్చిన ట్లుగా కుదింపు కొట్టివేతలు జరిపి తప్పుడు పత్రాలు సృష్టించారు. అక్రమంగా తమ పొలం కాజేయాలని అగ్రిమెంట్ పేపరు మార్చివే శారు. తమ అత్త పొలం కూడా వారి పేర్లపై మార్చుకున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ పొలం తమకు ఇప్పించాలని కోరారు.

**అక్రమంగా భూమిని ఆన్‌లైన్ చేసుకున్నారు**

తమ గ్రామంలో వారసత్వంగా సక్రమించిన భూమిని తమ పక్క గ్రామానికి చెందిన వేదిక వసంత భర్త రమణయ్య ఫేక్ పత్రాలు సృష్టించుకుని ఆన్‌లైన్‌లో తమ పేర్లతో ఎక్కించుకున్నారని అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లి మండలం మడితాడు గ్రామానికి చెందిన కొమ్ము సిద్దమ్మ ఫిర్యాదు చేసింది. తమపై దౌర్జన్యాలు చేస్తూ పొలం చుట్టు కంచెను కాల్చివేసి పొలం దగ్గరకు వచ్చా రంటే చంపేస్తామని బెదిరిస్తున్నారని, తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

# ఏ అంశంపైనైనా చర్చిద్దాం.. అసెంబ్లీకి రా

- నీకు కావాల్సినంత సమయం ఇస్తాం
- జగన్‌కు మంత్రి సవిత ఆఫర్
- నీలి మీడియాలో తప్పుడు ప్రచారం మానుకో
- జగన్ హయాంలోనే దిగజారిన వైద్య, ఆరోగ్య ప్రమాణాలు
- 17 మెడికల్ కాలేజీల నిర్మాణమంటూ హడావుడి
- కేంద్ర, నాబార్డు నిధులతో నిర్మించింది ఐదు కాలేజీలే
- మిగిలిన కాలేజీలకు ఇటుక కూడా వేయలేదు



పెనుకొండ (చైతన్యరథం): యూరియా, ఉల్లి, మెడికల్ కాలేజీలు ఇలా ఏ అంశంపైనైనా అసెంబ్లీకి వచ్చి జగన్ మాట్లాడాలని, ఆయనకు కావాల్సినంత సమయం ఇస్తామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత ఆఫర్ ఇచ్చారు. ప్రజా సమస్యలపై చర్చించడానికి అసెంబ్లీకి రాకుండా తన నీలి మీడియాలో తప్పుడు రాతలు రాస్తే సహించేది లేదని హెచ్చరించారు. సీఎం చంద్రబాబు పాలనలోనే ఏపీలో వైద్య విద్యకు పెద్దపీట వేశారని, ప్రజారోగ్య రక్షణకు పటిష్ట చర్యలు తీసుకున్నారని తెలిపారు. అయిదేళ్ల జగన్ పాలనలో మెడికల్ కాలేజీల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూపాయి కూడా వినియోగించలేదన్నారు. కాంట్రాక్టర్లకు బకాయిలు కూడా చెల్లించలేదన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతో కలిసి ఆమె మాట్లాడారు. రూ.8,480 కోట్లతో 17 మెడికల్ కాలేజీలు పెడుతున్నానంటూ 2020లో జగన్ డబ్బా కొట్టాడన్నారు. వాస్తవంగా చూస్తే... నాబార్డు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.2,125 నిధులను మాత్రమే 5 మెడికల్ కాలేజీలకు ఖర్చు చేశాడన్నారు. ఆ 5 భవన నిర్మాణాలకు కూడా రూ.674 కోట్ల మేర కాంట్రాక్ట్ సంస్థలకు బకాయిలు పెట్టాడన్నారు. ప్రచార యావ కోసం అసంపూర్తిగా ఉన్న ఆ అయిదు కాలేజీలను ప్రారంభించేశాడన్నారు. అరకొర వసతులు, ఫ్యాకల్టీని కూడా పూర్తి స్థాయిలో నియమించకుండానే తరగతులు మొదలెట్టేశాడన్నారు. మిగిలిన కాలేజీల నిర్మాణానికి ఒక్క ఇటుక కూడా వేయలేదని, ఇది జగన్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శమని మంత్రి సవిత మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం పది మెడికల్ కాలేజీలను పీపీపీ మోడళ్లలో నిర్మించాలని నిర్ణయించిందని, దీనిపై జగన్ తప్పుడు ప్రచారం చేయడం దారుణమన్నారు.

***ప్రజారోగ్యానికి టీడీపీ పెద్దపీట***

రాష్ట్రంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేసింది టీడీపీ ప్రభుత్వాలేనని మంత్రి సవిత వెల్లడించారు. రాష్ట్రంలో హెల్త్ యూనివర్శిటీని ఏర్పాటు చేసిన ఘనత ఎన్టీఆర్ దేనన్నారు. ఆ యూనిర్శిటీకి ఉన్న ఎన్టీఆర్ పేరునే తీసేసి వైఎస్సార్ పేరు పెట్టుకున్న ఘనుడు జగన్ అని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు హయాంలో ఉమ్మడి ఆంధ్రాతో పాటు ప్రస్తుత నవ్యాంధ్రలో 27 మెడికల్ కళాశాలు ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రానికి 5,015 మెడికల్ సీట్లను సీఎం చంద్రబాబు సాధించారన్నారు. 2014-19 మధ్య అయిదేళ్లలో పేదల కోసం సీఎం చంద్రబాబు 33 హెల్త్ స్కీమ్‌లు అమలు చేశారన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం అనంతరం తల్లీ బిడ్డలను ఇంటికి చేర్చడానికి తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను తీసుకొచ్చారన్నారు.

***పేదలకు మేలు చేసే యూనివర్శల్ హెల్త్ పాలసీ***

అందరికీ ఆరోగ్యం అనే సంకల్పంతో సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. యూనివర్శల్ హెల్త్ పాలసీ తీసుకొస్తున్నారని, ఈ పాలసీ ద్వారా కోటీ 63 లక్షల కుటుంబాలకు మేలు జరగనుందని వెల్లడించారు. ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల వరకూ వైద్య సేవలు అందించేలా ఈ పాలసీని రూపొందిస్తున్నారు. ఇదీ సీఎం చంద్రబాబుకు ప్రజారోగ్యంపై నిబద్ధతకు నిదర్శనమని మంత్రి సవిత వెల్లడించారు.

***జగన్ హయాంలో దిగజారిన ప్రజారోగ్యం***

అయిదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో ప్రజారోగ్యం దిగజారిపోయిందని మంత్రి సవిత తెలిపారు. 2014-19 మధ్య కాలంలో నీతి అయోగ్ ర్యాంకింగ్ లో వైద్య ప్రమాణాల్లో ఏపీ 4వ స్థానంలో నిలిచిందన్నారు. జగన్ పాలనలో పదో స్థానానికి పడిపోయిందన్నారు. ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చాడన్నారు. ఆరోగ్యశ్రీకి రూ.3,500 కోట్లు బకాయిలు పెట్టాడని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.1900 కోట్ల బకాయిలు చెల్లించిందని వెల్లడించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా పెట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వైద్య విద్యను దూరం చేశాడని ఆగ్రహం వ్యక్తంచేవారు. జగన్ నిర్లక్ష్యం వల్ల కరోనా సమయంలో 50 వేల మందికి పైగా మరణించారన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ ఈవోగా ఏకే సింఘాల్

- రాష్ట్రంలో 11 మంది ఐఏఎస్‌ల బదిలీ



అమరావతి (చైతన్యరథం): ఏపీలో 11 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐఏఎస్‌ల బదిలీలపై ముఖ్యమంత్రి చంద్రబాబు గత కొన్ని రోజులుగా తీవ్ర కసరత్తు చేశారు. బాగా పని చేసిన వారిని ప్రోత్సహించేలా నిర్ణయం తీసుకోవాలని ఉన్నతాధికారులకు సూచించారు. ఈ మేరకు టీటీడీ ఈవోగా అనిల్ కుమార్ సింఘాల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రస్తుతం ఈవోగా ఉన్న శ్యామలరావును జీఏడీ ముఖ్యకార్యదర్శిగా నియమించింది. అంతేకాకుండా.. రోడ్లు భవనాలు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కృష్ణబాబు, రెవెన్యూ, ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ముఖేష్ కుమార్ మీనా, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా సీహెచ్ శ్రీధర్, ఆటవీ, పర్యావరణశాఖ కార్యదర్శిగా కాంతిలాల్ దండేను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అనంతరామ్, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శిగా సౌరభ్ గౌర్, ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా ప్రవీణ్ కుమార్, పరిశ్రమలు, కార్మికశాఖ కమిషనర్‌గా శేషగిరిబాబు, రెవెన్యూ (ఎండోమెంట్) కార్యదర్శిగా హరి జవహర్‌లాల్ నియమితులయ్యారు. ఈ బదిలీతో అనిల్ కుమార్ సింఘాల్ మరోసారి టీటీడీ ఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో సింఘాల్ టీటీడీ ఈవోగా పనిచేశారు.

### వెలుగొండ గురుకుల పాఠశాలలో

# రూ.4 కోట్లతో అదనపు డార్మెటరీ

- పేద విద్యార్థుల కోసం ఎంత ఖర్చునైనా భరిస్తాం
- విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



వెలుగొండ (చైతన్యరథం): పేద విద్యార్థుల కోసం కూటమి ప్రభుత్వం ఎంత ఖర్చునైనా భరిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఉద్ఘాటించారు. సోమవారం నాడు ప్రకాశం జిల్లా వెలుగొండలోని డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మంత్రి స్వామి ఆకస్మిక తనిఖీ చేశారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి. యర్రగొండపాలెం టీడీపీ ఇన్చార్జ్ గూడూరు ఎరిక్షన్ బాబుతో కలిసి మంత్రి పాఠశాల పరిసరాలు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి డా. స్వామి మాట్లాడుతూ.....కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాంఘిక సంక్షేమ శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. రూ.143 కోట్లతో గురుకులాలు, ఎస్సీ సంక్షేమ హాస్టళ్లకు మరమ్మతులు చేశామన్నారు. సాంత్వన పథకం ద్వారా అనారోగ్యంతో చనిపోయిన విద్యార్థి కుటుంబాలకు ప్రభుత్వం సాయం చేస్తోందన్నారు. వెలుగొండ పాఠశాలలో రూ.4 కోట్లతో విద్యార్థుల కోసం అదనపు డార్మెటరీ నిర్మించనున్నట్టు మంత్రి తెలిపారు. పేద విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యం అన్నారు. విద్యార్థుల కోసం తమ ప్రభుత్వం ఎంత ఖర్చు అయినా భరిస్తుందని విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని మంత్రి స్వామి ఆకాంక్షించారు.

### సృష్టి ఫెర్టిలిటీ కేసులో

# ముగ్గురు ఏపీ వైద్యుల సస్పెన్షన్



**మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో చర్యలు**

అమరావతి (చైతన్యరథం): హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా నడుస్తున్న సృష్టి సంతాన సాఫల్య కేంద్రంలో అక్రమాలకు సం బంధించిన కేసులో ప్రభుత్వ వైద్య కళాశాలలు/బోధనాసుపత్రు లకు చెందిన ముగ్గురు వైద్యులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ వ్యవహారంలో ఆంధ్ర మెడికల్ కాలేజి, విశాఖపట్నంలో అనస్తీషియా విభాగాధిపతి వాసుపల్లి రవి, గైనకాలజీ విభాగం లో అసోసియేట్ ప్రొఫెసర్ పి.ఉషాదేవి, శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలలో పిడియాట్రిక్స్ విభాగంలో పనిచేస్తున్న అసి స్టెంట్ ప్రొఫెసర్ ఎ.విద్యుల్లతలపై గత నెలలో ఆరోపణలు వచ్చాయి. వీరు ముగ్గురిపై హైదరాబాద్ పోలీసులు కేసు నమో దు చేశారు. సరోగమి చట్టం, జువెనైల్ జస్టిస్ చట్టంలోని పలు సెక్షన్ల కింద వీరిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురు వైద్యులపై నమోదైన ఆరోపణల తీవ్రత దృష్ట్యా వారిని పోలీసులు అరెస్ట్ చేసిన తేదీ నుంచి సస్పెండ్ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలిచ్చారు. వీరిని విధుల్లో కొనసాగిస్తే వ్యవస్థ పట్ల ప్రజా విశ్వాసం సన్నగిల్లుతుందని, కేసుల విచారణకు ఆటంకం కలి గించే అవకాశమున్నందున వారిని సస్పెండ్ చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ ముగ్గురు వైద్యులు సృష్టి అక్రమాల కేసులో అరెస్ట్ అయినట్లు గత నెల 9న వార్తలొచ్చాయని, వారిపై చర్య లు తీసుకొనటానికి ఆలస్యం ఎందుకు అయిందని మంత్రి వాకబు చేశారు. పత్రికల్లో వార్తల నేపథ్యంలో వెంటనే నిర్ధారణ కోసం సంప్రదించగా గత నెల 28న అరెస్ట్ అయిన తేదీలు, నిందితులు జ్యూడిషియల్ కస్టడీలో ఉన్న వ్యవధి వివరాలను హైదరాబాద్ పోలీసులు తెలిపారని అధికారులు వివరించారు. సృష్టి అక్రమాలు మీడియాలో వచ్చిన కొద్దిరోజుల ముందు నుంచి ఆ ముగ్గురు వైద్యులు విధుల్లో లేరని, వారిని సంప్ర దిం చడానికి ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని మంత్రికి అధికారులు వివరించారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే శిరీష దేవి విజయ్ భాస్కర్

**●నిత్యావసర సరుకులు పంపిణీలో లోపాలకు తావివ్వం**



రంపచోడవరం (చైతన్యరథం): రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీలో లోపాలు లేకుండా పారదర్శకంగా అమలు చేయాలన్న ద్యేయంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ ఎం. శిరీష దేవి విజయ్ భాస్కర్ అన్నారు. మండలంలోని స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద తహసీల్దార్ బాలాజీ అధ్యక్షతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా ఒకే రేషన్ ఒకే నేషన్ పేరుతో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా లబ్ధిదారులు ఎక్కడ ఏయే నిత్యావసర సరుకులు తీసుకున్నారో కూడా తెలుస్తుంద న్నారు. దీని ద్వారా పూర్తి పారదర్శకంగా లోపాలు లేకుండా డీలర్లు కూడా ఎలాంటి అక్రమాలు చేయకుండా ఉంటుందన్నారు. ప్రతీ లబ్ధిదారుడు లేదా వారి కుటుంబ సభ్యులు వేలిముద్ర ద్వారా మాత్రమే నిత్యావసర సరుకులు తీసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అలాగే గతంలో మన నియోజకవర్గంలో తీసుకున్న 13400 చిన్న గ్యాస్ బండలు ఉన్న లబ్ధిదారులు ప్రస్తుతం పెద్ద గ్యాస్ బండలు తీసుకునే వెసలుబాటు కల్పించినట్లు తెలిపారు. వీరికి రూ.2300 లు సబ్సిడీ కూడా ప్రభుత్వం చెల్లించి 14.2 కేజీల గ్యాస్ బండలు తీసుకోవచ్చు అని తెలిపారు. అలాగే డివిజన్ వ్యాప్తంగా 186 మంది డీలర్లకు సంబంధిత మిషన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తనకు తెలియ జేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత, బిజేపీ రాష్ట్ర కార్యదర్శి ఈరోజు స్వప్న కుమారి,మండలపార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్, వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, సీతపల్లి గుడి చైర్మన్ బాపన్న దొర, కారం సింహాచలం, తెదేపా సీనియర్ నాయకులు అడబాల బాపిరాజు, మాజీ సర్పంచ్ నిరంజనీ దేవి, ఎంపీపీ బంధం శ్రీదేవి, పండా వెంకటలక్ష్మి, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, బాలకృష్ణ, అబ్బులు, జీసీసీ డివిజన్ మేనేజర్ జయశ్రీ, మండల ప్రత్యేక అధికారి షరీఫ్, జనసేన నియోజకవర్గం ప్రతినిధి కుర్ల రాజశేఖరరెడ్డి, పి. శ్రీనివాస రావు, బీజేపీ నాయకులు విశ్వ రెడ్డి, అధిక సంఖ్యలో కూటమి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో మహిళలే మహారాణులు

**●సూపర్ సిక్స్ సూపర్ హిట్... పీయూసీ చైర్మన్ కూనరవికుమార్**



ఆమదాలవలస (చైతన్యరథం): ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన "స్త్రీ శక్తి" భారీ బహిరంగ సభకు భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళల కోసం చేపట్టిన గొప్ప కార్యక్రమం "స్త్రీ శక్తి" అని, సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీ లోని మహిళలను " మహారాణులను " చేసారని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి మహిళల ఆర్థిక తోడ్పాటుకు మరింత కృషి చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అమలు చేసిన అనేక పథకాలు గురించి ప్రస్థావిస్తూ... దీపం-2 పథకం - ప్రతి మహిళకు "ఉచిత గ్యాస్ సిలిండర్". ఏపీలో ఎక్కడి నుండి ఎక్కడికైనా ఉచిత బస్సు ప్రయాణం - మహిళలకు పూర్తిగా "ఫ్రీ ట్రావెల్". తల్లికి వందనం - ఇంట్లో ఉన్న ప్రతి పిల్లవాడికి ప్రత్యేక గౌరవం. ఎన్టీఆర్ భరోసా - దేశంలో ఎక్కడా లేని విధంగా నెలకు "రూ.4,000 పెన్షన్" మహిళల భద్రత కోసం "శక్తి యాప్". డ్వాక్రా మహిళలకు 10 లక్షల వడ్డీరహిత రుణాలు. మహిళా పారిశ్రామికవేత్తలకు "పారిశ్రామిక రాయితీలు" ఇంకా అనేక మహిళా ప్రోత్సాహక పథకాలు అమలు చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహిళామణులు అందరూ ఆమదాలవలస బ్రిడ్జి నుండి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. అడుగడుగునా అక్క చెల్లమ్మలు నీరాజనాలు పలికారు. తమ అభిమాన నేతతో పాటు ర్యాలీగా కథం తొక్కారు. ఆమదాలవలస రోడ్ అంతా మహిళామణులతో వారి అభిమానంతో సంద్రాన్ని తలపించింది.

# పుష్కరాల రేవులో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనావాస్ సమీక్ష

రాజమహేంద్రవరం (చైతన్యరథం): పుష్కరాల రేవులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, గోదావరి నిత్య హారతులు ప్రదేశం అభివృద్ధిపై రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సోమవారం రాత్రి ఇరిగేషన్, పర్యాటక శాఖ, నగర పాలక సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులను పిలిపించి అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు, పురోహితులు చెప్పిన కొన్ని సూచనలను పరిగణలోకి తీసుకున్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# విద్యతోనే సంపూర్ణ దేశ అభివృద్ధి సాధ్యమవుతుంది

**● సింగుపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా అక్షరాస్యత దినోత్సవం... శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్**



శ్రీకాకుళం (చైతన్యరథం): సంపూర్ణ అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం ఆ రూరల్ మండలం సింగుపురం జడ్పీహెచ్ స్కూల్లో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడిలోనే ఉంచాలని అన్నారు. నిరక్షరాస్యత వలన సమాజానికి ఎంతో చెడు ఏర్పడుతుందని చెప్పారు. విద్యతోనే మన హక్కులు కాపాడుకోగలమని చెప్పారు. నేడు అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం యునెస్కో ప్రపంచ వ్యాప్తంగా సోమవారం ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రతిపాదించింది. నిరక్షరాస్యత దేశానికి పెద్ద కళంకం దానిని తొలగించి తీరాలనీ మహాత్మా గాంధీ తెలిపారు అన్నారు. భారతదేశంలో ఈనాటికీ కూడా ఇంకా 35 శాతం మంది నిరక్షరాస్యులు ఉన్నారు... అంటే బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. బడి ఈడు పిల్లల్ని బడిలోకి పంపించాలి చదువును మధ్యలో ఆపేసిన వాళ్ళకి చదువును కొనసాగించేందుకు ప్రోత్సాహాన్ని ఇవ్వాలి సంపూర్ణ అక్షరాస్యత ఉన్నప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరము గమనించి మన పరిసరాలలో అక్షరాస్యతకు దూరంగా ఉండి బాల కార్మికులుగా జీవిస్తున్న వాళ్లని... ఇంటి పనుల్లో ఉండి బడుల్లో చేరని వారిని ప్రోత్సహించి వారి తల్లిదండ్రులను చైతన్యపరిచి అక్షరాస్యులుగా చేయడానికి అందరు నడుం కట్టాలి. వయోజనుల్లో కూడా ఈ నిరక్షరాస్యత ప్రబలంగా ఉందని చెప్పారు. వయోజనులను అక్షరాస్యలను చేయడం ద్వారా వారిని ప్రభుత్వ కార్యక్రమాల పట్ల అవగాహన పెంపొందించుకునే విధంగా... బాధ్యతాయుతంగా ప్రవర్తించే విధంగా... వారు విధులను, హక్కులను తెలుసుకునే విధంగా మనం తయారు చేయవచ్చునని ఇది సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ దిశలో 1991 నుండి భారతదేశం వ్యాప్తంగా సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమం జిల్లాల వారీగా జరిగి అనేక సత్ఫలితాలను సాధించింది.. అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు విశేష కృషి కూడా జరిగిందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో అక్షరక్రాంతి పేరుతో 1991 సెప్టెంబర్‌లో సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమం ప్రారంభమై ఆరు సంవత్సరాల పాటు నిర్విఘ్నంగా కొనసాగి జిల్లాలో అక్షరాస్య శాతాన్ని పెంచడమే కాకుండా ప్రజలలో చైతన్యాన్ని పెంపొందించడానికి కూడా కృషి చేసిందని చెప్పారు. అనంతరం పాఠశాలలో సైన్సు, మ్యాథ్స్ ల్యాబ్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, టిడిపి సీనియర్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, విద్య కమిటీ చైర్మన్, తల్లిదండ్రులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు ప్రయోజనమే ప్రభుత్వ ప్రాధాన్యం : మంత్రి అచ్చెన్నాయుడు

**●ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దు**



శ్రీకాకుళం (చైతన్యరథం): రైతులు ఎరువుల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన తెలిపారు. సోమవారం శ్రీకాకుళం మండలం తండేం వలసలోని రైతు సేవా కేంద్రంలో ఎరువులు పంపిణీ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి ఈ మేరకు మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో 23 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, త్వరలో మరో 3 వేల మెట్రిక్ టన్నులు రానున్నాయని తెలిపారు. రాబోయే రబీ సీజన్‌కు కూడా రాష్ట్రానికి 9.50 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను కేటాయించడానికి కేంద్రం అంగీకరించిందని, కాబట్టి రబీ కోసం ఇప్పుడే ఎరువులు నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని రైతులకు సూచించారు.

**యూరియా వాడకంపై హెచ్చరికలు**

వరి పంటలో యూరియా వాడకంపై మంత్రి అచ్చెన్నాయుడు కీలక సూచనలు చేశారు. పంటకు మూడు సార్లు, ఒక్కోసారి 25 కిలోలకు మించి యూరియా వేయకూడదని హెచ్చరించారు. అధికంగా వాడితే ఆరోగ్యపరమైన ప్రమాదాలు ఉంటాయని చెప్పారు. దీనికి ప్రత్యామ్నాయంగా నానో యూరియాను వాడాలని, ముఖ్యంగా రెండో దశలో దీనిని ఉపయోగించాలని సూచించారు. ఎవరైనా ప్రైవేట్ డీలర్లు ఎరువులతో పాటు ఇతర వస్తువులను బలవంతంగా అమ్మడానికి ప్రయత్నిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని రైతులకు మంత్రి పిలుపునిచ్చారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక ఫోన్ నెంబర్ ఏర్పాటు చేశామని తెలిపారు. కర్నూలులో ఉల్లి ధరలు పడిపోకుండా కిలో రూ.12కి ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని, ఇది రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ గందరగోళం సృష్టించే వారి మాటలు నమ్మకూడదని హెచ్చరించారు. ప్రతి హామీని నెరవేర్చుతున్న ప్రభుత్వం మాదే. గత ఏడాది కాలంలోనే తండెం వలస గ్రామంలో కోట్ల రూపాయలతో రహదారులు వేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, పీఎసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, జిల్లా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాధ స్వామి, తహసీల్దార్ గణపతి, ఎంపీడీవో శైలజ, మాజీ ఎంపీపీ గొండు జగన్నాథరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరికలు

పాచిపెంట (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లా పాచిపెంట మండలం, రాయిగుడివలస పంచాయతీ పరిధిలోని కొండతాడురు గ్రామానికి చెందిన 50 కుటుంబాలు, ఉప సర్పంచ్ జన్ని లక్ష్మణ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ చేరికలతో మొత్తం 300 మంది పైగా గ్రామస్తులు టీడీపీకి జతయ్యారు. ఈ కార్యక్రమం రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు హాజరయ్యారు. పార్టీలో చేరిన కుటుంబాలకు కండువాలు కప్పి అహ్వానం పలికారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైన అంశం. ప్రతి గ్రామ అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నాం. స్థానిక ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చినట్లయితే మరింత అభివృద్ధి ఖాయం" అని హామీ ఇచ్చారు. అనంతరం పార్టీలో చేరిన గ్రామస్తులు మాట్లాడుతూ.. "మన గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ మాత్రమే కృషి చేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ బాబు, మంత్రి గుమ్మిడి సంధ్యారాణి రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో అమలు చేస్తున్న పథకాలు చూసి మేమంతా టీడీపీ మీద విశ్వాసం ఉంచి పార్టీలో చేరుతున్నామని తెలిపారు.



# ఎరువులు అక్రమంగా తరలిస్తే పీడీ యాక్ట్ కేసులు

- రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా పంపిణీ జరగాలి : మంత్రి నాదెండ్ల ఆదేశం



ఏలూరు (చైతన్యరథం): జిల్లాలో ఎరువులను అక్రమంగా నిల్వ చేయడం, అక్రమంగా తరలించే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలనీ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో సోమవారం జిల్లాలో ఎరువుల సరఫరా, పంపిణీపై సంబంధిత శాఖల అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... గత సంవత్సరం కన్నా అధికంగా ఈ సంవత్సరం జిల్లాకు యూరియా, డిఏపి, తదితర ఎరువులను జిల్లాకు అధికంగా అందించామన్నారు. ప్రస్తుత సీజన్లో 33 వేల 762 మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం కాగా, ఇప్పటికే 30 వేల 557 టన్నులను అందించామని, మరో రెండు రోజుల్లో మరో 2200 మెట్రిక్ టన్నులు అందుబాటులోనికి రానున్నదన్నారు. ఎరువుల పంపిణీ విషయంలో రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అయినప్పటికీ కొంతమంది రైతులు ముందుజాగ్రత్తగా ఎరువులను అదనంగా కొనుగోలు చేయడంతో తాత్కాలికంగా కొరత ఏర్పడిందని, అయినప్పటికీ రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఎరువులను అందుబాటులో ఉంటున్నామన్నారు. జిల్లా నుండి ఎరువులు తరలిపోకుండా 29 చెక్ పోస్టులలో నిఘా పెట్టడం జరిగిందని, నిఘాను మరింత పెంచాలన్నారు. జిల్లా నుండి ఎరువులు ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా చూడాలని, అక్రమంగా తరలించేవారిపై, ఎరువులను బ్లాక్ మార్కెటింగ్, దారిమళ్లించే వారిపై, అధిక ధరలకు అమ్మడం, అక్రమంగా నిల్వ చేసేవారిపై 6ఏ కేసులు కాకుండా పీడీ ఆక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు పడేలా చూడాలన్నారు. ఎరువుల కొరత ఏర్పడిందనే దుష్ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. ఆయిల్ పామ్‌లో యూరియా వినియోగం తగ్గించేలా రైతులకు అవగాహన కలిగించాలన్నారు. కూటమి ప్రభుత్వం రైతు శ్రేయస్సే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని, అన్ని విషయాలలోనూ ప్రతీ రైతుకు అండగా నిలుస్తుందన్నారు. సాగులో యాంత్రీకరణను పెంచడం ద్వారా సాగు ఖర్చును తగ్గించి, రైతాంగానికి అధిక దిగుబడి, ఆదాయం పొందేలా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులకు గత ప్రభుత్వం బకాయిలు పడిన 1674 కోట్ల రూపాయలను కూటమి ప్రభుత్వం చేపట్టిన నెలరోజులలోనే పూర్తిగా చెల్లించిందని, రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందనడానికి నిదర్శనమన్నారు. జిల్లాలో రైతులకు 530 పంపిణీ కేంద్రాల ద్వారా ఎరువులను పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని, రైతులలో భరోసా నింపేందుకు అన్ని నియోజకవర్గాలలోనూ మండల స్థాయిలో ఎరువుల పంపిణీ ప్రణాళిక, కొరత లేదన్న విషయాలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎరువుల పంపిణీలో రైతుల సమస్యలను తెలియజేసేందుకు సంబంధిత అధికారుల ఫోన్ నంబర్ల వివరాలను జిల్లాలోని అన్ని సొసైటీలు, ఎరువుల డీలర్లు, డిసిఎంఎస్ కేంద్రాలు, రైతు సేవ కేంద్రాల వద్ద ప్రదర్శించాలన్నారు. రాష్ట్రంలో ఎరువుల పంపిణీపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతీరోజు జిల్లాల కలెక్టర్లతో సమీక్షిస్తున్నారని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారన్నారు.

ఖరీఫ్‌లో 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం ఖరీఫ్ సీజన్లో గతంలో కన్నా అధికంగా 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ధాన్యం సేకరించిన 48 గంటలలోగా రైతుల ఖాతాలలోకి సొమ్ము జమ చేస్తామన్నారు. కాల్ సెంటర్‌కు వచ్చే రైతుల సమస్యలపై 24 గంటలలోగా పరిష్కరించాలన్నారు. ఎరువుల పంపిణీలో ఆన్లైన్లో సర్వర్ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

**జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ...** జిల్లాలో గత సంవత్సర కన్నా అధికంగా ప్రస్తుత వ్యవసాయ సీజన్లో ఎరువులను రైతులకు అందించారన్నారు. సూపర్ సిక్స్ కార్యక్రమాలతో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, ఇది భరించలేని కొందరు లేని కొరతను సృష్టించి రైతులను రెచ్చగొడుతున్నారని, వాటిని తిప్పికొట్టాలన్నారు.

**దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ...** జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలతో రైతులకు ఎరువులను సక్రమంగా పంపిణీ జరిగిందన్నారు. రైతు సేవా కేంద్రాల పరిధిలో గోడౌన్లను స్టాక్ పాయింట్ లుగా ఉపయోగించుకుని గ్రామ స్థాయిలో ఎరువులు పంపిణీ జరిగేలా చూడాలన్నారు. "రైతులెవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని, రైతులు అందరికీ యూరియాను అందచేస్తున్నామన్నారు. కొన్ని మీడియా కథనాల్లో యూరియా కొరత అంటూ వస్తున్న వార్తలతో అభద్రతకు గురై రైతులు ఆందోళన చెందడం వల్ల యూరియా కృత్రిమ కొరత ఏర్పడుతుందని, అయితే అదనంగా యూరియా తీసుకున్న రైతులకు సుదీర్ఘ కాలం నిల్వ చేసుకునే అవకాశం కూడా వారికి ఉండదన్నారు. సొసైటీలకు అందించే యూరియా స్టాకులు ఒకేసారి అవసరమైన మేర అందించటం, అదే విధంగా యూరియా స్టాక్ వచ్చిన వెంటనే రైతులకు అందించేలా ఈ-పాస్ సాంకేతిక సమస్యలను పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలన్నారు.

**చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ...** చింతలపూడి నియోజకవర్గంలోని రైతులకు ఎరువుల పంపిణీ సక్రమంగా జరిగిందని, జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని, రైతుల అవసరాలకు తగినవిధంగా ఎరువులు అందించారన్నారు.

**పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు మాట్లాడుతూ...** తమ నియోజకవర్గంలో ఎరువుల కొరత లేదన్నారు. ప్రస్తుతం 229 మెట్రిక్ టన్నులు నిల్వలు ఉన్నాయని, సెప్టెంబర్ నెలకు మరో 200 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలలో 10 వేల ఎకరాలలో ప్రత్తి, మిర్చి పంటలు వేస్తున్నారని, వాటికి యూరియా సరఫరా చేయాలనీ కోరారు.

**డిసిఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ మాట్లాడుతూ...** తమ 21 బ్రాంచీలలో 396 టన్నుల ఎరువుల నిల్వలు ఉంచి, రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పారదర్శకంగా ఎరువుల పంపిణీ చేస్తున్నామన్నారు.

సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, ఉద్యానవనాలాధికారి రామ్మోహన్, జిల్లా సహకారాధికారి ఆరిమిల్లి శ్రీనివాస్, మార్కెఫెడ్ అధికారి సిహెచ్. ప్రసాద్ గుప్త, జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# కొవ్వూరు మండలం మద్దూరు గ్రామంలో బస్ సర్వీస్ ప్రారంభం




కొవ్వూరు (చైతన్యరథం): మండలం మద్దూరు గ్రామంలో ఏపీఎస్ఆర్టీసీ నిడదవోలు డిపో బస్ సర్వీస్‌ను నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... గత కోవిడ్ నుండి బస్ సర్వీస్ లేక విద్యార్థులు, మహిళలు, వృద్ధులు చాలా ఇబ్బందులకు గురాయ్యేవారని మద్దూరు కూటమి నాయకులు ఈ విషయాన్ని శుక్రవారం నాడు జరిగే గ్రీవన్స్ లో నాదృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం చొరవతో మళ్ళీ ఈ బస్ సర్వీస్ పునః ప్రారంభం చేస్తున్నారని. ఈ బస్ ఉదయం 8 మద్దూరు వస్తుందని... రూట్ నిడదవోలు నుండి సమిశ్రగూడెం, గోపవరం, విజ్జేశ్వరం మద్దూరు, బంగారమ్మపేట, వాడపల్లి, ఔరాంగబాద్, టోల్గేట్ కొవ్వూరు మీదుగా రాజమహేంద్రవరానికి 4 ట్రిప్పులు షటిల్ సర్వీస్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే పెద్దపీట

- పెరవలి మండల తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్



నిడదవోలు/పెరవలి: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యం అని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సోమవారం నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండల తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా విన్నారు. పీజీఆర్ఎస్ వచ్చిన అర్జీలు పెండింగ్‌లో లేకుండా నిర్ణీత కాల వ్యవధి లోనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు.అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రజల నుంచి వివిధ సమస్యలపై స్వీకరించిన అర్జీలను ఎప్పటి కపుడు పరిశీలించి, సకాలంలో నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీజిఆర్ఎస్‌కు అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. సమస్యపై తీసుకున్న చర్యలతో అర్జీదారుడు సంతృప్తి చెందాలని, అర్జీ మరలా రీ ఓపెన్ అయ్యే పరిస్థితి ఉండరాదన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులతో మంత్రి దుర్గేష్ నేరుగా ఫోన్ కాల్‌లో మాట్లాడారు. ప్రతి పౌరుడి అండతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ తెలిపారు. ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపడుతున్న ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంత్రి దుర్గేష్ స్పందించిన తీరుపై పౌరులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రియా సౌజన్య, పెరవలి తహశీల్దార్ కే. నిరంజన్, ఎంపీడీవో కే. ఉమా రాజ్యలక్ష్మీ పద్మజ, ఏవో గంటా శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ శంకర్, ఏపిఎం రామకృష్ణ, ఈఓఆర్డి సిహెచ్ వెంకటరమణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలపై ఆశ వదులుకున్న... మంత్రి సుభాష్ ప్రాణభిక్ష పెట్టారు

- ఎనీమియా బాధితునికి రూ.5 లక్షల సీఎంఆర్ఎఫ్ సహాయం
- ఎల్ఓసి ద్వారా బాధితునికి భరోసా ఇచ్చిన మంత్రి సుభాష్



కాజులూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతోమంది ప్రాణాలను కాపాడుతోంది అనటానికి ఇదొక నిదర్శనం. అరుదైన అప్లాస్టిక్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్న బాధితునికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కొండంత అండగా నిలిచి సీఎంఆర్ఎఫ్ సహాయ నిధి నుంచి రూ.5 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసి) అందించి బాధితునికి బాసటగా నిలిచారు. వివరాల్లోకి వెళితే కాజులూరు మండలం పల్లిపాలెంకు చెందిన ముడికి తిరుపతిరావు గత 18 సంవత్సరాలుగా ఎప్లాస్టిక్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్నాడు. దీనికి వైద్యులు ఆపరేషన్ చెయ్యాలనీ, దీనికి రూ 12 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. పేదరికంలో ఉన్న తిరుపతిరావు ఆపరేషన్ చేయించుకునే స్తోమత లేక గత 18 సంవత్సరాలుగా ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్నాడు. సాయం కోరుతూ రాజకీయ నాయకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నాడు. కానీ ఏ ఒక్క నాయకుడు కనికరించలేదు. రక్తదాతలు, బ్లడ్ బ్యాంక్ సహకారంతో నెలలో రెండుసార్లు రక్తం ఎక్కించుకుంటూ ప్రాణాల నిలుపు కుంటూ వస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలతో దారిద్రాన్ని అనుభవిస్తూ బతకీడుస్తున్నాడు. కాజులూరు మండల పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కు తన దీనస్థితిని, ఆరోగ్య పరిస్థితిని విన్నవించుకున్నాడు. బాధితుని సమస్యలు విన్న మంత్రి చలించి పోయారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందేలా చూస్తానని భరోసా ఇచ్చి రూ.5 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసి) బాధితునికి అందించారు. తక్షణమే మెరుగైన వైద్యం పొంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాధితుడు తిరుపతిరావు మాట్లాడుతూ పేదరికం కారణంగా, మెరుగైన వైద్యం పొందలేక ప్రాణాలపై ఆశలు వదులుకున్నానని, మంత్రి సుభాష్ రూపంలో.. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎల్ ఓ సి పొందటం పట్ల జీవితంపై ఆశ చిగురించిందని ఆనంద భాష్పాలుతో తెలిపాడు. బాధితుడు తిరుపతిరావు మోములో ఆనందం చూసిన స్థానిక ప్రజలు, కూటమి పార్టీ నాయకులు, ఆయన కుటుంబ సభ్యులు మంత్రి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేదల పట్ల, రోగుల పట్ల మానవతా దృక్పథంతో ప్రభుత్వ పరంగాను, వ్యక్తిగతంగాను నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తున్న మంత్రి సుభాష్ సేవా నిరతిని ప్రజలు కీర్తిస్తున్నారు.

## దొండపాడు మట్టి తవ్వకాలపై చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సీరియస్

**●సమగ్ర నివేదిక కోరడంతో క్షేత్రస్థాయి పరిశీలనకు అధికారులు**



వినుకొండ (చైతన్యరథం): నియోజకవర్గం దొండపాడు గ్రామ పరిధిలో మట్టి తవ్వకాలకు సంబంధించి వచ్చిన వార్త కథనంపై చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తీవ్రంగా పరిగణించినట్లు ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. మీడియాలో వచ్చిన కథనాలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదిక కోరడంతో స్థానిక అధికారులు కూడా హుటాహుటీన కదిలారు. ఇప్పటికే రెవెన్యూ సిబ్బంది మట్టి తవ్వకాలు జరిగి ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానికులనూ అడిగి వివరాలు తెలుసుకున్నారు. వారి నుంచి నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు ఉంటాయని, ఎవరైనా ఉపేక్షించే లేదని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నట్లు వారి కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఎక్కడా ఎవరికి ఎలాంటి తవ్వకాలకు అనుమతి ఇవ్వలేదని, ఒకవేళ ఎవరైనా తమ పేరో, ప్రభుత్వం పేరో చెబితే మాత్రం ఊరుకునేది లేదని ఆయన తెలిపినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. మట్టి, ఇసుక తవ్వకాలు సహా వేరే ఏ పనిలో అయినా ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఎవరైనా ప్రవర్తించినా, తప్పుడుగా పేర్లు వాడుకున్నా తీవ్రంగా పరిగణిస్తామన్నారు. అంతేకాక ఇకపై నియోజకవర్గం వ్యాప్తంగా ఎక్కడ ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తామని, స్థానిక నాయకత్వం, శ్రేణులు కూడా అప్రమత్తంగా ఉండి, ఇలాంటి ఘటనలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలన్నారు.

## ఉనికి కోసమే రైతు బాసట"హోరు"

**●వైసీపీవి చిల్లర రాజకీయాలు**

**●టీడీపీ సీనియర్ నేత బేగ్ విమర్శ**



విజయవాడ: రైతాంగం నిజంగా ఇబ్బందులు ఎదుర్కొంటుంటే... రైతుల పట్ల అమిత ప్రేమ ఉన్నట్లయితే, అసెంబ్లీలో అన్నదాతల పక్షాన పోరాటం చేయాలని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి మిర్జా ముజఫర్ బేగ్ వైసీపీకి హితవు పలికారు. ప్రజాస్వామ్య పద్ధతిలో అది చేయడం మానేసి పార్టీ ఉనికిని కాపాడుకునే క్రమంలో అన్నదాతకు బాసట పోరుతో ఈ నెల 9 తేదీన రోడ్డెక్కి ఒక రసవత్తర నాటకీయ కార్యక్రమానికి తెరదీయడం కపట ప్రేమను తేటతెల్లం చేస్తోందని ధ్వజమెత్తారు. ఏదో ఒక బురద జల్లుడు కార్యక్రమం పేరుతో ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయాలని జగన్ కుట్రలు, కుయుక్తులను ప్రజానీకానికి ఇప్పటికే అర్థమయిందన్నారు. కనీసంలో కనీసంగా క్వింటాలు ఉల్లిని 700 రూపాయలకు కూడా అమ్ముడుపోని స్థితిలో ఉంటే దాన్ని ప్రభుత్వమే 1200 రూపాయలకు కొనడం రైతు క్షేమం కాదా అని జగన్‌ను నిలదీశారు. మిర్చి, మామిడి, పొగాకు, కోకో రైతాంగానికి ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించిన విషయం జగన్‌కు కనిపించడం లేదా అని బేగ్ ప్రశ్నించారు. రాబోయే ఖరీఫ్ సీజన్లో దృష్టిలో ఉంచుకొని అన్నదాతల సంక్షేమంలో భాగంగా గ్రామ గ్రామాన ఎరువుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ఉదహరించారు. ఎరువుల యూరియా నిల్వలు రాష్ట్రంలో పుష్కలంగా ఉంటే... ఆ విక్రయ, సరఫరాలను పక్కదారి పట్టించేలా తన సొంత పత్రికలో అన్నదాతల ఇబ్బందుల పేరుతో క్యూలైన్లలో రైతులు పడిగాపుల ఫోటోలను రోజు ప్రమచురిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్న జగన్ నాటకాలను ప్రజలు చిత్కరించుకుంటున్నారని దుయ్యబట్టారు. రైతు సంక్షేమంతో సహా అన్ని వర్గాల శ్రేయస్సు కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. తన పాలనలో వందలాది రైతు కుటుంబాలు ఉసురు తీసిన జగన్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే... అసెంబ్లీ వేదికగా ప్రభుత్వంతో చర్చకు రావడం ద్వారా అన్నదాతకు బాసటగా నిరూపించుకోవాలని బేగ్ ఈ సందర్భంగా జగన్‌కు సవాల్ విసిరారు.

## మంత్రి నారా లోకేష్ చొరవతో మంజూరైన ఎల్‌వోసీ చెక్కు అందజేత



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి పట్టణంలోని కొత్తపేటకు చెందిన షేక్ సలీమా కుమార్తె జోయా ఆశ్రత్ (3సం) అనారోగ్యానికి గురికాగా విజయవాడలోని ఆంధ్రా ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. సలీమా కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో మంత్రి నారా లోకేష్‌కు అర్జీ పెట్టుకోగా వెంటనే స్పందించిన ఆయన సీఎంఆర్ఎఫ్ అధికారులతో మాట్లాడి రూ. 2 లక్షల 50 వేల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఆ ఎల్‌వోసీ పత్రాన్ని టీడీపీ నాయకులు సోమవారం జోయా ఆశ్రత్ తల్లికి అందజేశారు. దీనితో మంత్రి నారా లోకేష్‌కు జోయా ఆశ్రత్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్ మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని, గత వైసిపి ప్రభుత్వం దీనిని నిర్వీర్యం చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, 1వ వార్డు అధ్యక్షులు శ్రీనివాసరావు, కె రమేష్ బాబు, పోలూరి నాగేశ్వరరావు, ఎం రామకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి... అమ్మకానికి తేడా తెలియని వ్యక్తులు వైసీపీ నాయకులు



విజయవాడ (చైతన్యరథం): మెడికల్ కాలేజీలపై వైకాపా నేతల వ్యాఖ్యలను మంత్రి కొల్లు రవీంద్ర ఖండించారు. అభివృద్ధికి, అమ్మకానికి తేడా తెలియని వ్యక్తులు వైకాపా నాయకులని ఎద్దేవా చేశారు. జగన్ ఐదేళ్ల పాలనలో వైద్య విద్యను భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. గత ఐదేళ్లలో మచిలీపట్నం మెడికల్ కాలేజీకి జగన్ ఏం చేశారని ప్రశ్నించారు. వైకాపా నేతలు తప్పుడు ఆరోపణలను నమ్ముకున్నారని విమర్శించారు. ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. పీపీపీ పద్ధతితో మెడికల్ కాలేజీలను అభివృద్ధి చేస్తే తప్పేంటని నిలదీశారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే మచిలీపట్నం మెడికల్ కాలేజీ పనులు పూర్తయ్యాయని చెప్పారు. హామీ మేరకు సంక్షేమ పథకాలన్నీ అమలు చేశామన్నారు. మెడికల్ కాలేజీలపై వైకాపా నేతలు చర్చకు సిద్ధమా అని మంత్రి కొల్లు రవీంద్ర సవాల్ విసిరారు.

## సూపర్ సిక్స్ - సూపర్ హిట్, స్త్రీ శక్తి కార్యక్రమం విజయవంతం

**●గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో కదం తొక్కిన నారీమణులు**



గుంటూరు (చైతన్యరథం) : ఆంధ్రప్రదేశ్‌లో అభినవ జ్యోతిరావు పూలే చంద్రబాబునాయుడు అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సూపర్ సిక్స్ – సూపర్ హిట్, స్త్రీ శక్తి కార్యక్రమ మహిళా విజయవంతమైనది. తొలుత ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి నల్లచెరువుకు చేరుకున్నారు. గుంటూరు నల్లచెరువు 3 బొమ్మల సెంటర్ నుండి ఏటుకూరు బైపాస్ వరకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి వేలాది మంది మహిళలతో కలసి భారీ ర్యాలీగా ముందుకు కదిలారు. ఈ ర్యాలీ మహిళలలో జోష్ నింపింది. ఈ ర్యాలీకి ట్రాన్స్ జెండర్స్ కూడా భాగ మవ్వటం ఆకట్టుకుంది. అనంతరం వేలాది మంది మహిళలతో సభా వేదికకు చేరుకున్నారు. సభా వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నెల్లూరుకు చెందిన ప్రాసమణి ప్రసంగం ఆకట్టుకుంది. అదేవిధంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందిన లబ్దిదారులు తమ అభిప్రాయాలను పంచుకొని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే గళ్ళా మాధవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున పోటెత్తిరావటం చూసి చాలా ఆనందంగా ఉంది. మహిళలు సాధికారత సాధిస్తేనే, దేశం అభివృద్ధి చెందుతుంది. ఏపీలో సూపర్ సిక్స్‌లో 4 పథకాలు మహిళల కోసమే పెట్టారు. అది ఈ ఎన్డీయే కూటమి ప్రభుత్వంకు మహిళల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం.

**మహమ్మద్ నసీర్**

**మాట్లాడుతూ...** ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజలకి అండగా నిలిచింది. గళ్ళా మాధవి ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి అనేక కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యలు తీరుస్తున్నారు.

**బూర్ల రామాంజనేయులు**

**మాట్లాడుతూ...** ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ కార్యక్రమం సూపర్ హిట్ అయ్యింది. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు మహిళలకు అండగా నిలిచారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత చంద్రబాబు దే అని ఎమ్మెల్యే కొనియాడారు.

**పొడపాటి తేజస్వి**

**మాట్లాడుతూ...** ఎమ్మెల్యే గల్లా మాధవి సభకు మహిళలు ఇంత పెద్ద ఎత్తున పోటెత్తారు. మహిళలు తలుచుకుంటే ఏం జరుగుతుందో, స్త్రీ శక్తి అంటే ఏమిటో ఈరోజు చూపించారు. శ్రీశక్తి అంటే ఎన్డీయే ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన గౌరవం, ఆస్తిలో సమాన హక్కు ఇచ్చిన పార్టీ తెలుగుదేశం. 1995 లో డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళలకు స్వయంగా ఎదగటానికి అవకాశం ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడుదేనని అన్నారు.

## 15 నెలల్లో చంద్రబాబు కనివినీ ఎరుగని సంక్షేమం అందించారు

**●15 ఏళ్లు ప్రజాప్రభుత్వం అధికారంలో ఉంటే జరిగే మేలు ప్రజలకు వివరించండి**

**●జగన్, వైసీపీ అసత్యప్రచారాన్ని తిప్పికొట్టి, పథకాలపై విస్తృత ప్రచారం చేయండి**

**●ఉరవకొండ పార్టీ శ్రేణులకు మాజీమంత్రి ప్రత్తిపాటి మార్గనిర్దేశం**



ఉరవకొండ / చిలకలూరిపేట (చైతన్యరథం): కష్టనష్టాలు అధిగమించి, సవాళ్లు... సంక్షోభాలను అవకాశాలుగా మలిచి ప్రజలకోసం ఏ ముఖ్యమంత్రికీ సాధ్యంకానన్ని సంక్షేమపథకాలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. 'సూపర్ సిక్స్ – సూపర్ హిట్' విజయోత్సవ సభ నిర్వహణలో భాగంగా టీడీపీ అధిష్టానం ఆదేశాలమేరకు ప్రత్తిపాటి సోమవారం ఉరవకొండ నియోజకవర్గ శ్రేణులతో సమావేశమయ్యారు. ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి స్థానిక పార్టీ కార్యాలయంలో నేతలు, కార్యకర్తల అభిప్రాయాలు, ఆలోచనలు తెలుసుకున్న అనంతరం ప్రత్తిపాటి మాట్లాడారు. 15నెలల పాలనలో కూటమిప్రభుత్వం కనివినీ ఎరుగని రీతిలో ప్రజలకు సుపరిపాలన అందించిందన్న ప్రత్తిపాటి... మరో 15 ఏళ్లపాటు మనప్రభుత్వం అధికారంలో ఉండాలంటే ప్రతి ఒక్కరూ ప్రజలతో మమేకమై పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కూటమిప్రభుత్వమే 15 ఏళ్లు అధికారంలో ఉండాలని, అప్పుడే రాష్ట్రం దేశం గర్వించే స్థాయిలో అభివృద్ధి చెందుతుందంటున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యల్లోని వాస్తవాన్ని పార్టీ శ్రేణులు గ్రహించాలని ప్రత్తిపాటి సూచించారు.

**ఐదేళ్లు ప్రజలకు ఏమీ చేయలేదు కాబట్టే.. వైసీపీ అవాస్తవాలు నమ్ముకుంది**

జగన్ పచ్చి అబద్ధాలకోరని, ఆయన.. వైసీపీ చేస్తున్న అసత్యప్రచారాన్ని ఎప్పటికప్పుడు టీడీపీ శ్రేణులు సమర్థంగా తిప్పికొట్టాలన్నారు. కేంద్రప్రభుత్వమిచ్చిన నిధుల్ని పక్కదారి పట్టించి, ఒక్క మెడికల్ కాలేజీకూడా సక్రమంగా పూర్తిచేయని జగన్, 17 కాలేజీలు కట్టించినట్టు చెప్పుకోవడం సిగ్గుచేటని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు.

## రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేదు : భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు (చైతన్యరథం): రాష్ట్రంలో ఎరువుల సరఫరా విషయంలో ఎలాంటి సమస్య లేదని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండే రైతు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని ఆయన పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు, నీరు, మద్దతు ధర అన్నింటిని సమయానుకూలంగా రైతులకు అందేలా సీఎం చంద్రబాబు నాయుడు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గంలో 1110 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉందని ఎక్కడా కూడా ఎరువుల కొరత లేదన్నారు. రైతుల సంక్షేమం గురించి ఎప్పుడూ పట్టించుకోని జగన్ మోహన్ రెడ్డి, ఇప్పుడు దుష్ప్రచారం చేస్తూ రైతులను ఆందోళనకు గురి చేయాలని ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలన్నారు.

# విలువలతో కూడిన విద్యను బోధించండి

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపు



కోవూరు, (చైతన్యరథం): నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో వివేకానంద ఇంటర్నేషనల్ స్కూల్ భూమి పూజ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో మొట్టమొదటి సీబీఎస్ఈ సిలబస్‌తో విద్యా బోధన చేసే వివేకానంద ఇంటర్నేషనల్ స్కూల్ భూమి పూజ తన చేతుల మీదుగా జరపడం చాలా సంతోషంగా ఉందన్నారు. బుచ్చిరెడ్డి పాళెంలో 35 సంవత్సరాలుగా నాణ్యతా ప్రమాణాలతో విద్యాబోధన చేసే వివేకానంద స్కూల్ గత విద్యా సంవత్సరంలో 130 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాస్తే రాస్తే అందులో 127 మంది అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించారన్నారు అయ్యారన్నారు. ప్రైవేటు విద్యా రంగంలో 1991 నుంచి మంచి అకడమిక్ ట్రాక్ రికార్డ్ ఉందన్నారు. నిజమైన విద్య అంటే జ్ఞానం విలువలని, ఈ రెండు కలిసినప్పుడు మాత్రమే సమాజానికి ఉపయోగపడే పౌరులు తయారవుతారన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు నేర్పాలని వివేకానంద స్కూల్ యాజమాన్యానికి సూచించారు. వివేకానంద ఇంటర్నేషనల్ స్కూల్ లో విద్యనభ్యసించే విద్యార్థినీ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. కష్ట పడి చదివి గురువులకు, తల్లి తండ్రులకు మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి విద్యార్థులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, బుచ్చి మున్సిపల్ ఛైర్మన్ మోర్ల సుప్రజ, ఎఎంసి ఛైర్మన్ బెజవాడ గోవర్ధన్ రెడ్డి, టీడీపీ బుచ్చి మండల అధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, యర్రంరెడ్డి గోవర్ధన్ రెడ్డి, తేజా డెవలపర్స్ అధినేత శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి డోలా ఆకస్మిక తనిఖీ

మార్కాపురం, (చైతన్యరథం): మెడికల్ కాలేజ్ వెలిగొండ గురుకుల పాఠశాను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు, ఆయన వెంట మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాళెం టీడీపీ ఇన్ చార్జ్ గూడూరి ఎరిక్సన్‌బాబు, మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, కూటమి నాయకులు ఉన్నారు.




# యూరియాపై వైసీపీ కొత్త డ్రామా

## చిత్తూరు టీడీపీ నేతల ఆగ్రహం

చిత్తూరు, (చైతన్యరథం): రాష్ట్రంలో యూరియా కొరత ఉందని వైసీపీ నాయకులు సరికొత్త నాటకానికి తెర తీశారని చిత్తూరు టీడీపీ నేతలు విరుచుకుపడ్డారు. ఇందులో భాగంగా రైతు పోరు పేరిట సరికొత్త డ్రామాకి రంగం సిద్ధం చేశారన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత ఉన్నదని ఏ రైతు చెప్పనప్పటికీ వైసీపీ నాయకులు కేవలం వారిని రెచ్చగొట్టడానికి, తన పేటీఎం బ్యాచ్‌తో తప్పుడు పోస్టులు పెట్టించి ప్రచారం చేస్తున్నారన్నారు. అనంతపురంలో సూపర్ సిక్స్- సూపర్ హిట్ కార్యక్రమానికి ప్రజలనుండి వస్తున్న స్పందనను చూసి జడుసుకొని రైతుల పేరుతో సరికొత్త నాటకానికి తెర తీస్తున్నారున్నారు. వైసీపీ కార్యకర్తలే ఖాళీ పురుగుల మందుల డబ్బాల్లో మద్యం పోసుకుని తాగి రైతులు ఆత్మహత్యాయత్నం చేస్తున్నట్టు పెద్ద ఎత్తున వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని రైతులు ప్రజలు బాగా గమనించారన్నారు. గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతుల్ని కనీసం పట్టించుకోని, రైతును దగా చేసిన జగన్మోహన్ రెడ్డి రైతుల పక్షాన మసలి కన్నీరు కారుస్తున్నారు. బంగారు పాళ్యంలో మామిడి రైతుల పరామర్శ పేరుతో మామిడికాయల్ని రోడ్డుపై పోసి ట్రాక్టర్లతో తొక్కించినటువంటి పెద్దమనిషి రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఒకపక్క ఉల్లి రైతులు 1500 రూపాయలు గిట్టుబాటు ధర కల్పిస్తూ ఉంటే ఉల్లి రైతుల పక్షాన నకిలీ కన్నీరు కారుస్తున్న, నకిలీ రైతు జగన్మోహన్ రెడ్డి విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి అదనంగా, కేంద్రం నుండి యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ తీసుకొచ్చి నిల్వ ఉంచి ప్రతి రైతుకి అందిస్తుంటే, ఈ లెక్కలు తెలియని జగన్మోహన్ రెడ్డి పిచ్చిగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. యూరియా కొరతపై గానీ, ఉల్లి రైతుల గిట్టుబాటు ధర గురించి గానీ, చర్చించే దమ్ముంటే జగన్ అసెంబ్లీకి రావాలని తెలుగుదేశం పార్టీ నాయకులు సవాలు విసిరారు. అసెంబ్లీకి వచ్చి మాట్లాడే దమ్ము లేదు గాని మీడియా ముందు తమ పేటీయం మీడియా ముందు గొంతు చించుకుని అరవడం వల్ల వచ్చే లాభమేమీ ఉండదన్నారు. రైతులు జగన్‌ను, వైసీపీని నమ్మే పరిస్థితి లేదని విమర్శించారు. సమావేశంలో టీడీపీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, పూతలపట్టు బీసీ సెల్ అధ్యక్షుడు ధరణి ప్రకాష్, చిత్తూరు రూరల్ ఎస్సీ సెల్ నాయకుడు గోవిందరాజులు, బాలకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# చెత్త తొలగింపుపై మునిసిపల్ మంత్రి సంతృప్తి

అనంతపురం, (చైతన్యరథం): అనంతపురంలో చెత్త తరలింపు ప్రక్రియ పనులపై మంత్రి నారాయణ సంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఎమ్మెల్యేతో కలిసి మంత్రి పరిశీలించారు. ఇప్పటికే 60శాతంకి పైగా చెత్త తరలించాం.. మంత్రి నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలకులు ప్రభుత్వం చెత్తపై పన్ను వేసి.. 85లక్షల టన్నుల చెత్త పెట్టి పోయారన్నారు. ప్రస్తుతం అనంతపురం డంపింగ్ యార్డులో చెత్త తరలింపు వేగంగా సాగుతోందన్నారు. అక్టోబర్ -2 నాటికి ఇక్కడ చెత్త లేకుండా చేస్తామన్నారు. డంపింగ్ యార్డు స్థానంలో అద్భుతమైన పార్క్ ఏర్పాటు చేస్తామన్నారు. అమృత్, స్వచ్ఛభారత్ పథకాల విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను సరిగా వినియోగించుకోలేకపోయిందన్నారు. ఈ రెండు ప్రాజెక్టుల పనులు వేగంగా సాగుతున్నాయి 10లక్షల కోట్లు అప్పులు ఉన్నా.. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు. సాలిడ్ వేస్ట్‌ను ప్రాసెస్ చేసి తరలిస్తున్నామన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ తరుపున ఏపీలో 6 క్రష్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు తీసుకొస్తున్నామన్నారు. చెత్త తరలింపులో దేశంలోనే రోల్ మోడల్ గా నిలుస్తామన్నారు. ప్రతి ఒక్క పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మారుస్తున్నామన్నారు.



# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## టీడీపీ నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి వెల్లడి

రాయచోటి, చైతన్యరథం): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర్లోని హెూమ్ మీటింగ్ హాల్‌లో జరిగిన "స్త్రీ శక్తి సూపర్ హిట్" విజయోత్సవ సభ కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు టీడీపీ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్నదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాలేక పోయినా సూపర్ సిక్స్ అమలు పథకాలు అమలు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో ప్రజలందరికీ మేలు జరుగుతున్నదన్నారు. రాష్ట్రం లోని మహిళలు అందరికీ "స్త్రీ శక్తి" పథకం ద్వారా నాలుగు రకాల ఆర్టీసీ బస్సుల్లో మహిళా మూర్తులు అందరికీ ఉచితంగా బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికి కి మాత్రమే దక్కింది అని పేర్కొన్నారు.పథకం అమలు కోసం ముఖ్యమంత్రితో కలిసి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రివర్యులుమండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకొని ఈ "స్త్రీ శక్తి" పథకం మహిళలకు అందుబాటులోకి తీసుకొని రావడానికి చాలా కృషి చేశారన్నారు. దాని ఫలితమే రాష్ట్రం లోని మహిళలు అందరూ ఉచితంగా బస్సు ప్రయాణాలు కొనసాగిస్తున్నారు అని సభా ముఖంగా పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ద్వారా ప్రజలకు మేలు చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో పాటు మంత్రులు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ కృషి చేస్తున్నారు అని పేర్కొన్నారు. నియోజకవర్గం లో ప్రజలకు ఏ కష్టం వచ్చినా మండిపల్లి కుటుంబం వారికి అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తుందని, పేద ప్రజలకు సేవ చేయడానికి మండిపల్లి కుటుంబం ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని, మండిపల్లి కుటుంబాన్ని ఆదరిస్తున్న మీ అందరికీ ఋణపడి ఉంటామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గంలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు. పలువురు టీడీపీ నాయకులు, టీడీపీ మహిళా నాయకురాలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# అనంతలో సీఎం సభకు భారీగా తరలి రండి

## పరిటాల శ్రీరామ్, అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు పిలుపు

ధర్మవరం, (చైతన్యరథం): సూపర్ సిక్స్‌సూపర్ హిట్ సభకు పెద్ద ఎత్తున మహిళలు తరలిరావాలని తెలుగుదేశంపార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్, అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు పిలుపునిచ్చారు. ధర్మవరం పట్టణం, చిగిచెర్ల రోడ్డులోని శ్రీ పద్మావతి కళ్యాణమండపంలో జరిగిన సమావేశంలో పరిటాల శ్రీరామ్, ఎమ్మెల్యే ఆనందరావు తెలుగు మహిళలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున మహిళలు తరలి వెళ్లి సీఎం సభను విజయవంతం చేద్దామని పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ, అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించి అన్ని సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందజేస్తూ ముందుకు వెళుతున్న నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో జరుగుతున్న సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభకు ప్రతి గ్రామ, వార్డు నుండి ప్రతి కుటుంబం నుండి ఒక్కొక్క మహిళను సీఎం సభకు తీసుకు వెళ్లే విధంగా ప్రణాళిక రూపొందించాలని ఆనంద్ రావు పార్టీ మహిళ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

# అందరి దృష్టి అనంత సభపైనే



## మోహరించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు

అనంతపురం, (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొనే సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభపై అనంతపురం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, జిల్లా ఎమ్మెల్యేలతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్ లో ఉన్న ముఖ్య అతిథులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, సీఎం ప్రోగ్రాం సమన్వయకర్తలకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కూటమి పార్టీల మంత్రులు ఎమ్మెల్యేలతో నిర్వహించే సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభకు అనంతపురం సత్యసాయి ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 5లక్షల మంది జనం తరలించే విధంగా ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా గ్రామస్థాయి నుంచి బూతులు వారిగా వాహనాల ఏర్పాట్లు భోజన వసతి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చే విధంగా చూడాలని కోరారు. ఈనెల 10న మధ్యాహ్నం 1 గంటకు సభా వేదిక వద్దకు ప్రజలు చేరుకునే విధంగా చూడాలని మందులు అనగానే సత్య ప్రసాద్ ఎమ్మెల్యేలకు సూచించారు. ఈ సమావేశంలో పుట్టపర్తి నియోజకవర్గ పల్లె సింధూర రెడ్డి, ఎమ్మెస్ రాజు, దగ్గుపాటి వెంకట ప్రసాద్,ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర డైరెక్టర్లు , టీడీపీ జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, అంజనప్ప, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు సభను సక్సెస్ చేయండి

## ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా, ఎమ్మెల్యేలు సునీత, శ్రీరామ్, ఏలూరి



అనంతపురం, (చైతన్యరథం): సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ నేపథ్యంలో అనంతపురం రూరల్ మండల నాయకులకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కీలక సూచనలు చేశారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు ఏలూరు సాంబశివరావు, మన్నే సుబ్బారెడ్డి, ఆదోని కృష్ణమ్మ, పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. సభకు గడువు దగ్గర పడడంతో నాయకులు క్షేత్రస్థాయిలో జన సమీకరణపై చర్చించారు. అనంతపురం నగరంలో సభ జరిగే నేపథ్యంలో భారీగా జనం తరలి వచ్చేలా కృషి చేయాలని పల్లా శ్రీనివాసరావు సూచించారు. దీనిని ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు 164 మంది ఎమ్మెల్యేలు సభలో పాల్గొంటారని, ఎంతో ప్రతిష్టాత్మకమని ఆయన గుర్తు చేశారు. పరిటాల సునీత మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో రూరల్ మండలంలో భారీ మెజార్టీతో గెలిపించారని... అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంతంలో జరుగుతున్న అతిపెద్ద సభను అదే స్ఫూర్తితో విజయవంతం చేసే బాధ్యత మనపై ఎక్కువగా ఉందని అన్నారు. రూరల్ మండలం నుంచి 20వేల మందికి తగ్గకుండా జనం వచ్చేలా చూడాలని నాయకులకు సూచించారు. సభకు వచ్చేవారికి ప్రత్యేకంగా సూచనలు చేశారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రజలందరికీ అందుతున్న నేపథ్యంలో ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చేలా చూడాలన్నారు.

# ఎమ్మెల్యే ఎమ్మెస్ నివాసంలో మంత్రులు, ఎమ్మెల్యేల మంతనాలు



## అనంత సభ ఏర్పాట్లపై చర్చోప చర్చలు

అనంతపురం, (చైతన్యరథం):అనంతపురంలో జరగనున్న "సూపర్ సిక్స్...సూపర్ హిట్" కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు రానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాస్ యాదవ్ గారితో మొదలు రాష్ట్ర మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త మంతెన సత్యనారాయణరాజు రాజు నివాసానికి వచ్చారు. తమ నివాసానికి వచ్చినవారిని ఎమ్మెల్యే దంపతులు ఆప్యాయంగా ఆహ్వానించారు. ఆయన నివాసానికి ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకటరాజు, పులివర్తి నాని, పల్లె సింధూరరెడ్డి, బి జయనాగేశ్వరరెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుబాటి వెంకటప్రసాద్, పరిటాల సునీత, ముత్తుముల అశోక్ రెడ్డి, అయితాబత్తుల ఆనందరావు, బండారు శ్రావణిశ్రీ, తదితర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ధర్మవరం టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు గన్ని వీరాంజనేయులు, అనిమిని రవినాయుడు, దామచర్ల సత్య, మంతెన రామరాజు, డైరెక్టర్లు, పార్టీ నాయకులు మద్దిపట్ల సూర్యప్రకాష్, బీద రవిచంద్రయాదవ్, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు. విందు అనంతరం ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులతో చర్చించారు.



అనంతపురం జిల్లా కేంద్రంలో ఈ నెల 10 తేదీ న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి అధ్యక్షతన జరగనున్న సూపర్ సిక్స్ - సూపర్ హిట్ విజయోత్సవ సభను విజయవంతం చేయడంలో భాగంగా పరిగి, గోరంట్ల మండలాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో భాగంగా నియోజకవర్గ పరిశీలకులు ప్రభుత్వ చీఫ్‌విప్ ఆంజనేయులు, నరసింహా రావుతో కలసి సమీక్ష నిర్వహించిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత

# అనంత సభపై కదిరిలో సమావేశం

## పాల్గొన్న ఎమ్మెల్యేలు ధూళిపాళ, కందికుంట, తదితరులు

కదిరి, (చైతన్యరథం): పట్టణం మదనపల్లి రోడ్డు లోని పీవీఆర్ ఫంక్షన్ హాల్ నందు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభ పరిశీలకులుగా సీనియర్ నాయకులు పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, రాష్ట్ర శాప్ చైర్మన్ అమినేని రవి నాయుడు, రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి, కదిరి నియోజకవర్గ పరిశీలకులు వహీద్ హుస్సేన్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పివి పవన్ కుమార్ రెడ్డి, జనసేన ఇంచార్జ్ భైరవ ప్రసాద్, బీజేపీ నాయకులు మాజీ శాసనసభ్యులు ఎంఎస్ పార్థసారథి, మున్సిపల్ చైర్మన్ దిల్షాద్ ఉన్నీసా, స్వచ్ఛ ఆంధ్ర కమిషన్ సభ్యురాలు పర్వీన్ బాను, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మున్సిపల్ వైస్ చైర్మన్లు, పట్టణ కౌన్సిలర్లు, మండల కన్వీనర్‌లు, క్లస్టర్ యూనిట్ బూత్ ఇంచార్జిలు, ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు.



# రైతుల ముసుగులో వైసీపీ రాజకీయం

## పులివెందుల టీడీపీ ఇన్చార్జి బీటెక్ రవి

పులివెందుల, (చైతన్యరథం): రైతుల ముసుగులో రాజకీయం చేస్తే సహించేది లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి వైసీపీ నేతలను హెచ్చరించారు. రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు సరైన గిట్టుబాటు ధరలు కల్పిస్తామన్నారు. రైతుల కోసం ఏమైనా చేస్తామని పేర్కొన్నారు. రైతులను దళారులు మోసం చేస్తే సహించేది లేదన్నారు. ఎవరికి నష్టం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రేడింగ్ వ్యవస్థను అమలు చేస్తామని వెల్లడించారు. మార్కెట్ ఎట్టి పరిస్థితుల్లో రాత్రులు జరగదన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ ఆధ్వర్యంలో కొత్త పాలకవర్గం ఏర్పాటు జరిగిందన్నారు. మార్కెట్ అధికారులు,రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబు కుడా సానుకూలంగా ఉన్నారన్నారు. పులివెందుల మార్కెట్ ను నెంబర్ వన్ గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.



చైతన్యరథం

# ఉపరాష్ట్రపతి ఎన్నికకు సర్వం సిద్ధం

## ఎన్డీఏ, ఇండియా మధ్యే ప్రధాన పోటీ



జగదీప్ ధన్కడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి స్థానం భర్తీ చేసేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ఈ పదవి కోసం ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌లు పోటీ పడుతున్నారు. సెప్టెంబర్ 8న ఎన్నిక జరగనుంది. అయితే, అధికార ఎన్డీయేకు పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. పార్టీలకు అతీతంగా ఎంపీలు ఓటు వినియోగించుకోవాలని విపక్ష అభ్యర్థి ప్రచారం చేయడంతో ఉపరాష్ట్రపతి ఎన్నికపై కాస్త ఉత్కంఠ నెలకొంది. ఉపరాష్ట్రపతి ఎన్నికలో రహస్య ఓటింగ్ విధానాన్ని అనుసరిస్తారు. రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో కూడుకున్న ఎలక్టోరల్ కాలేజీలో ఎంపీలు తమకు నచ్చిన వారికి ఓటు వేసే వెసులుబాటు ఉంటుంది. అయినప్పటికీ తమ పార్టీకే ప్రాధాన్యం ఇస్తారు. క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశమూ ఉంటుంది.

**ఇద్దరి మధ్యే పోటీ**

లోక్‌సభలో 542, రాజ్యసభలో 230 మంది సభ్యులు కలిసి మొత్తం ఎలక్టర్ల సంఖ్య 781 ఇందులో ప్రతి సభ్యుడి ఓటు విలువ ఒకటిగానే ఉంటుంది. మెజార్టీ మార్కు 301 అధికార ఎన్డీయే కూటమికి ఇప్పటివరకు 422 సభ్యుల బలముంది. దీంతో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపు ఖాయంగానే కనిపిస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ (11 మంది సభ్యులు). ఎన్డీయేకు మద్దతు ఇస్తుండడంతో మెజార్టీ పెరగనుంది. మరిన్ని పార్టీలు మద్దతు తెలిపే అవకాశం ఉంది. విపక్షాల ఇండియా కూటమికి 311 మంది బలముంది. ఇతరులు 45 మంది ఉన్నారు. వీరితో సహా కొన్ని పార్టీలు మద్దతిచ్చినా విపక్ష అభ్యర్థి విజయానికి దూరంగానే కనిపిస్తున్నారు. దీంతో పార్టీలకు అతీతంగా ఆలోచించి ఓటు వేయాలని విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఇప్పటికే ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఈ ఎన్నికకు దూరంగా ఉంటున్నట్లు భారత రాష్ట్ర సమితి తాజాగా ప్రకటించింది. దీంతో నలుగురు సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం లేదు. ఏడుగురు ఎంపీలున్న బిజు జనతాదళ్ ఈ ఎన్నికకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించింది. శిరోమణి అకాలీదళ్, జోరమ్. పీపుల్స్ మూమెంట్ (మిజోరం) వంటి పార్టీలకు ఒక్కో సభ్యులున్నారు. విపక్షాల అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు ఆమ్ ఆద్మీ (10 మంది ఎంపీలు) ప్రకటించినప్పటికీ.. ఎంపీ స్వాతి మాలివాల్ ఆ పార్టీతో సంబంధాలు క్షీణించిన నేపథ్యంలో ఆమె ఎవరికి ఓటు వేస్తారనే దానిపై స్పష్టత లేదు. స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీ సభ్యులు ఎవరివైపు మొగ్గు చూపుతారనే విషయంపై ఆసక్తి నెలకొంది.

# ట్రంప్ స్వభావం.. పాదరసం

## అందుకే భారత్ ఆచీతూచీ అడుగులు



భారత్, అమెరికా సంబంధాలపై ట్రంప్ సానుకూలంగా మాట్లాడగానే ప్రధాని నరేంద్రమోదీ స్పందించడంపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని త్వరగా స్పందించినప్పటికీ, రెండు దేశాల ప్రభుత్వాలు, దౌత్యవేత్తలు చేయాల్సిన తీవ్రమైన మరమ్మతులు మిగిలే ఉన్నాయన్నారు. ట్రంప్ కొత్త స్వరాన్ని జాగ్రత్తగా స్వాగతిస్తున్నామని తెలిపారు.. భారతీయులు ఎదుర్కొన్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ట్రంప్ వల్ల కలిగిన బాధ, అవమానాన్ని త్వరగా మర్చిపోలేమన్నారు. అధ్యక్షుడు, ఆయన సిబ్బంది చేసిన అవమానాలు చాలా ఉన్నాయన్నారు. ట్రంప్ పాదరస స్వభావం కలిగిన వ్యక్తి అని థరూర్ అభివర్ణించారు. ప్రధాని నరేంద్రమోదీ చాలా త్వరగా స్పందించారు. సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం అనే ప్రాథమిక సంబంధం గురించి విదేశాంగ మంత్రి కూడా నొక్కి చెప్పారు. అది ఇప్పటికీ అలాగే ఉంది. అదే మనం ఇవ్వాల్సిన ముఖ్యమైన సందేశం. రెండు దేశాల ప్రభుత్వాలు, దౌత్యవేత్తలు కలిసి పరిష్కరించుకోవాల్సిన తీవ్రమైన అంశాలు కొన్ని ఉన్నాయని నేను భావిస్తున్నాను. కొత్త స్వరాన్ని జాగ్రత్తగా స్వాగతిస్తున్నాను. భారతీయులు: ఎదుర్కొన్న వాస్తవ పరిణామాలు చాలా ఉన్నాయి. కాబట్టి అంత త్వరగా క్షమించలేరు. ఆ పరిణామాలను అధిగమించాల్సి ఉంది' అని థరూర్ వ్యాఖ్యానించారు.

భారత్ విషయంలో తప్పు చేశానని ట్రంప్‌నకు అర్థమైంది కాబట్టి స్వరం మార్చారని ఇండియా మాజీ దౌత్యవేత్త కేపీ ఫాబియన్ అన్నారు. దూకుడుగా ముందుకెళ్లి తప్పుచేసినట్లు ట్రంప్ గ్రహించారని పేర్కొన్నారు. రష్యా చమురుకొంటే 25 శాతం అదనపు సుంకం విధించడం ట్రంప్‌నకు ఆశించిన ఫలితం ఇవ్వలేదన్నారు. 'ట్రంప్ వ్యాఖ్యలకు తగినట్లుగా ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. కానీ, దీనితోనే వివాదం ముగిసిపోయిందనే నిర్ధారణకు రాకూడదు. ఇండియా ఎప్పటికీ ఇండియాగానే ఉంటుంది. ఇండియా నాగరిక దేశం. భారత్ మరే ఇతర దేశాన్ని అనుసరించదు. ప్రతిఒక్క దేశంతో స్నేహ సంబంధాలు కోరుకుంటుంది. వ్యాపారం చేస్తుంది. కానీ, ఇతరుల ఆదేశాలకు తలొగ్గదు' అని ఫాబియన్ చెప్పారు.

# అనుమానాస్పదంగా కొట్టుకొచ్చిన కంటెయినర్లు

## - మహారాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం



మహారాష్ట్రలోని సముద్రతీరానికి మూడు అనుమానాస్పద కంటైనర్లు కొట్టుకురావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పాల్ఘర్ జిల్లాలోని సత్పతి, షిర్గావ్ బీచ్‌లకు మూడు అనుమానాస్పద కంటైనర్లు కొట్టుకురావడంతో భద్రత, విపత్తు నిర్వహణ సంస్థలను అలర్ట్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ సమాచారం అందుకున్న కోస్ట్ గార్డ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని.. అవి ఎక్కడి నుంచి వచ్చాయి? అందులో ఏముందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. దీంతో తీర గ్రామాలను అలర్ట్ చేసి.. బీచ్‌ల వెంబడి ముమ్మరంగా పెట్రోలింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. సముద్రంలో అధిక ఆటుపోట్లు ఉండడం వల్ల ప్రస్తుతం కుటైనర్లను తెరవడం కష్టతరంగా మారిందని, ఓ కంటైనర్ పాక్షికంగా మునిగిపోయిందని అధికారులు తెలిపారు. పోలీసులు, సముద్ర నిఘా అధికారులు, కోస్ట్ గార్డు సమన్వయంతో పని చేస్తూ.. కంటైనర్లకు సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి షిప్పింగ్ లాగ్‌లు, తీరప్రాంత నిఘా డేటా ద్వారా దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఆగస్టులో ఒమన్ నుంచి వెళుతున్న ఓ కార్గో షిప్ నుంచి దాదాపు 48 కంటెయినర్లు సముద్రంలో జారిపడ్డాయని.. ప్రస్తుతం అవే కొట్టుకొచ్చినవి అయ్యుంటాయని అధికారులు అనుమానిస్తున్నారు. అయితే ఈ విషయంపై ఎటువంటి అధికారిక ప్రకటన లేదు. సముద్ర తీరాల్లో అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే ముట్టుకోవద్దని స్థానిక మత్స్యకారులు, తీర ప్రాంతాల్లోని గ్రామస్థులకు సూచించారు. ఆగస్టులో ఒమన్ నుంచి వెళ్తున్న ఓ కార్గో షిప్ నుంచి దాదాపు 48 కంటెయినర్లు సముద్రంలో జారిపడ్డాయి. కంటెయినర్లు అరేబియా సముద్రం గుండా మహారాష్ట్రలోని ఒడ్డుకు కొట్టుకువచ్చే సూచనలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. కంటెయినర్లను లేదా సంబంధిత వస్తువులను గుర్తిస్తే భారత నావికాదళానికి, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని స్థానిక మత్స్యకారులు, తీర ప్రాంతాల్లోని గ్రామస్థులు, గస్తీ బృందాలకు అధికారులు సూచించారు.

# భారత పర్యటనకు ఇజ్రాయేల్ ఆర్థిక మంత్రి

- విదేశాంగ శాఖ అధికారిక వర్గాలు వెల్లడి
- వాణిజ్య ఒప్పందం దిశగా అడుగులు



ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ భారత పర్యటనకు రానున్నారు. నేటినుంచి మూడు రోజుల పాటు బెజలెల్ స్మోట్రిచ్ దేశంలో పర్యటించనున్నట్లు విదేశాంగ శాఖ అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ఇరుదేశాల మధ్య కొంతకాలంగా ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరుగుతున్నాయని, ప్రస్తుత పర్యటనలో భాగంగా భారత్, ఇజ్రాయెల్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఇరుదేశాల మధ్య స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం దిశగా అడుగులు పడనున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. స్మోట్రిచ్ గాంధీనగర్‌లోని భారతదేశ ప్రపంచ ఆర్థికసేవల కేంద్రాన్ని సైతం సందర్శించనున్నారు. బెజలెల్ స్మోట్రిచ్ భారత ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్లతో భేటీ అవనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని పెంపొందించడం, బలమైన, స్థితిస్థాపక పెట్టుబడి వాతావరణాన్ని సృష్టించడం, ప్రపంచ పరిస్థితులు వంటి విషయాలపై ఇరువర్గాల మధ్య చర్చలు జరిగే అవకాశం ఉంది. ఢిల్లీతో పాటు, ముంబయి ఇతర ప్రాంతాలను ఆయన సందర్శించనున్నట్లు తెలుస్తోంది. ఈ సంవత్సరం ఇజ్రాయెల్ మంత్రులు భారత్‌కు రావడం ఇది నాలుగోసారి. ఇజ్రాయెల్ పర్యాటక మంత్రి హైమ్ కాట్జ్, పరిశ్రమల మంత్రి నిర్ బర్కత్, వ్యవసాయం ఆహార భద్రతా మంత్రి అవి డిచర్ ఈ ఏడాది ప్రారంభంలో భారత్‌ను సందర్శించారు.

# మీరు పంపండి మేం చూసుకుంటాం

## ఆర్థిక నేరస్తుడు చోక్సీ అప్పగింతకు భారత్ హామీ



పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.వేల కోట్లు ఎగవేసి పారిపోయిన వ్యాపారవేత్త ఆర్థిక నేరగాడు. మెహుల్ చోక్సీని తమకు అప్పగిస్తే అతడిని ఏకాంతంగా నిర్బంధించమని బెల్జియంకు భారత్ హామీ ఇచ్చింది. అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ సౌకర్యాలను ఏర్పాటుచేస్తామని పేర్కొంది. బెల్జియం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. చోక్సీని ముంబయి జైలులో బ్యారక్ నంబర్ 12 లో ఉంచనున్నారు. అందులో ఎక్కువమంది ఖైదీలు ఉండరు. అంతేకాకుండా ఛోక్సీని బంధించే సెల్పై 20 గంటలు నిఘా ఉంటుంది. ఫర్నిచర్ కాకుండా 1 చదరపు మీటర్ల స్థలం అందుబాటులో ఉంటుంది. ఈ సెల్లో సరిపడా గాలి, వెలుతురు. వస్తువులు దాచుకునే సౌకర్యం, కాటన్ పరుపు, దిండ్లు, బెడ్షీట్, దుప్పటి ఏర్పాటుచేస్తారు. వైద్య సౌకర్యాలకు తగినట్లుగా బెడ్ ఉంటుంది. శుద్ధమైన తాగునీరు, అత్యవసర వైద్య సదుపాయం కల్పిస్తారు. పరిశుభ్రమైన మరుగుదొడ్లతోపాటు వాటిని ఎప్పటికప్పుడు కడిగించే ఏర్పాట్లు చేయనున్నారు. ఇక. మెహుల్ చోక్సీ(Mehul Choksi)కి రోజూ గంటకు పైగా వ్యాయామం చేసుకోవడానికి అనుమతిస్తారు. నిర్బంధ కాలంలో సరిపడా ఆహారం అందిస్తారు. ఈ ఏడాది ఏప్రిల్ లో ఆంట్వెర్ప్లో మెహుల్ చోక్సీని బెల్జియం అధికారులు అరెస్టు చేశారు. భారత దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేసిన అభ్యర్థన కారణంగానే అరెస్టు జరిగింది. అప్పటినుంచి అతడు ఆ దేశంలోని జైలులో ఉన్నాడు. ఇటీవల బెయిల్కు దరఖాస్తు చేసుకోగా.. దేశం నుంచి పారిపోతాడనే కారణంగా న్యాయస్థానం ఆ విజ్ఞప్తిని తోసిపుచ్చింది. సెప్టెంబర్ రెండో వారంలో అతడి అప్పగింత పిటిషన్ విచారణకు రానుంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి తీసుకున్న దాదాపు రూ. 13 వేల కోట్ల రుణాలను ఎగ్గొట్టిన ఛోక్సీ. అతడి మేనల్లుడు నీరవ్ మోదీ (కేసులో మరో ప్రధాన నిందితుడు) దేశం విడిచి పారిపోయారు. చోక్సీ ఆంటిగ్వా-వార్బుడాకు వెళ్లగా.. నీరవ్ మోదీ లండన్లో ఆశ్రయం పొందాడు. చోక్సీ తమ దేశ పౌరసత్వం తీసుకున్నాడని ఇటీవలే బెల్జియం ప్రభుత్వం నిర్ధారించింది.

# నేపాల్‌లో తీవ్ర ఉద్రిక్తతలు

- కుదిపేసిన సోషల్ మీడియాపై నిషేధం
- పార్లమెంట్‌పైకి దూసుకెళ్లిన యువత
- పోలీసు కాల్పుల్లో 19 మంది మృతి
- ప్రధాని హోంటౌన్‌లోనూ నిరసనలు
- రాళ్లు రువ్విన ఆందోళన కారులు
- పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధింపు
- నైతిక బాధ్యత వహిస్తూ హోంమంత్రి రాజీనామా



నేపాల్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. యువత ప్రభుత్వంపైకి తిరుగుబాటు చేసింది. సోమవారం ఉదయం కొన్ని వందల మంది యువతీ, యువకులు ఖాట్మాండు వీధుల్లో కి వచ్చి నిరసనలు మొదలుపెట్టారు. అనంతరం పార్లమెంట్ భవనాన్ని చుట్టుముట్టారు. పార్లమెంట్ మెయిన్ గేట్ బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించారు. ప్రవేశ ద్వారానికి నిప్పుపెట్టారు. దీంతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. అయినా యువత వెనక్కి తగ్గలేదు. ఈ నేపథ్యంలోనే పోలీసులు రబ్బరు బుల్లెట్లతో వారిపై కాల్పులు జరిపారు. ఈ కాల్పులు, ఘర్షణల్లో 19 మంది చనిపోగా.. దాదాపు 250 మంది దాకా గాయపడినట్లు తెలుస్తోంది. గాయపడ్డ వారిలో ముగ్గురు జర్నలిస్టులు కూడా ఉన్నట్లు సమాచారం. యువత నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరిస్థితులు మరింత దిగజారకుండా ఉండేలా పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించింది. బనేశ్వోర్, లాయిన్ చౌర్‌లతోపాటు పలు సున్నిత ప్రదేశాల్లో కర్ఫ్యూ విధించింది. కాగా, యువత నిర సనలు మొదట శాంతియు తంగానే మొదలయ్యాయి. అయితే కొన్ని గంటల తర్వాత ఉద్రిక్తతలు చెలరేగి తీవ్ర హింసాత్మకంగా మారాయి.

## అసలేం జరిగిందంటే..

నేపాల్ ప్రభుత్వం కొత్త సోషల్ మీడియా నిబంధనలను అమల్లోకి తెచ్చింది. ఆ కొత్త నిబంధనలు అన్ని సోషల్ మీడియా యాప్స్ ఫాలో కావాలని స్పష్టం చేసింది. ఫాలో కావటంతో పాటు అధికారికం గా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపింది. ఇందుకోసం కొంత సమయం ఇచ్చింది. అయితే 26 ప్రముఖ సోషల్ మీడియా యాప్స్ నేపాల్ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలు ఫాలో అవ్వలేదు. రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. దీంతో యూట్యూబ్, ఇన్‌స్టా గ్రామ్, వాట్సాప్, ఎక్స్, లింక్డ్ఇన్, ఫేస్‌బుక్, సిగ్నల్‌తో పాటు మరి కొన్నింటిని నేపాల్ ప్రభుత్వం బ్యాన్ చేసింది. ఇది అక్కడి జెన్‌జీలకు నచ్చలేదు. యాప్స్‌ను బ్యాన్ చేయటంతో పాటు దేశంలో అవినీతి పెరిగిపోయిందంటూ వందల మంది యువతీ, యువకులు నిరసనలకు దిగారు.

## ప్రధాని హోమ్‌టౌన్‌ను తాకిన నిరసనలు

సోషల్ మీడియాపై విధించిన నిషేధానికి వ్యతిరేకంగా నేపాల్‌లో యువత చేపట్టిన ఆందోళన సోమవారం నాడు హింసాత్మకంగా మారింది. పోలీసులతో జరిగిన ఘర్షణల్లో సుమారు 19 మంది ప్రాణాలు కోల్పోగా, 250 మందికి పైగా గాయపడ్డారు. నేపాల్ పార్లమెంటు వైపు జనం దూసు కువస్తున్న క్రమంలో భద్రతా దళాలు అడ్డుకోవడం, కాల్పులకు దారితీయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. నిరసనలకు కేంద్ర స్థానమైన కాఠ్‌మాండుకు సుమారు 400 కిలోమీటర్ల దూరంలోని ప్రధాని కేపీ శర్మ ఓలి స్వగ్రామానికి కూడా నిరసన సెగలు తాకాయి. కోషి ప్రావిన్స్‌లోని దమక్ ప్రాంతంలో ఉన్న ఓలి పూర్వీకుల ఇంటిపై నిరసనకారులు రాళ్లు రువ్వారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు వార్నింగ్ షాట్లు పేల్చారు. కాగా, నిరసనలు ఉవ్వెత్తున ఎగసిపడటంతో నేపాల్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి నివాసాలతో పాటు బలువతార్‌లోని ప్రధానమంత్రి నివాసం, చుట్టుపక్కల ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు.

సోషల్ మీడియాపై విధించిన నిషేధం, ప్రభుత్వంపై అవినీతి ఆరోపణల కు వ్యతిరేకంగా ఫ్లాట్ 'జనరేషన్ జి' పేరుతో వేలాది మంది ప్రదర్శకులు ఖాట్మండులోని మైతీఘర్ వద్ద గుమిగూడారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించి ఒక్కసారిగా పార్లమెంటు ఆవరణలోకి దూసుకెళ్లడంతో ఉద్రిక్తతలు నెలకొన్నారు. పోలీసులు జలఫిరంగులు, టియర్ గ్యాస్, లైవ్ ఎమ్యునేషన్‌తో ఆందోళనకారులను అడ్డుకున్నారు. కాగా, నేపాల్‌లో హింస, ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఇండియా-నేపాల్ సరిహద్దుల వెంబడి నిఘాను సశస్త్ర సీమాబల్ కట్టుదిట్టం చేసింది. అదనపు భద్రతా బలగాలను సైతం మోహరించారు.

## నేపాల్ హోం మంత్రి రాజీనామా

ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ నేపాల్ హోం మంత్రి రమేష్ లేఖక్ రాజీనామా చేశారు. ఆందోళనల్లో ఊహించలేనంత నష్టం జరిగిందని కాంగ్రెస్ ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితిని అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందంటూ తీవ్ర విమర్శలు రావడంతో ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. రమేష్ లేఖక్ తన రాజీనామాను ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలికి అందజేశారు. యువత ఆందోళనలపై ప్రధాని అత్యవసరంగా ఏర్పాటు చేసిన మంత్రివర్గ సమావేశంలో హోంమంత్రి తన రాజీనామా అందజేసినట్టు సీనియర్ మంత్రి ఒకరు తెలిపారు. సోషల్ మీడియాపై విధించిన నిషేధం, ప్రభుత్వ అవినీతి ఆరోపణలకు వ్యతిరేకంగా వివిధ నగరాల్లో చోటుచేసుకున్న నిరసనలు ఖాట్మండు సహా పలు చోట్ల హింసాత్మకంగా మారాయి.

## ప్రధాని రాజీనామాకు డిమాండ్

కాగా నేపాల్ నిరసనల్లో పలువురు ప్రాణాలు కోల్పోవడానికి నైతిక బాధ్యత వహించి ప్రధానమంత్రి రాజీనామా చేయాలని రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ డిమాండ్ చేసింది. నిరసనకారులపై అత్యంత పాశవికంగా ప్రభుత్వం విరుచుకుపడటాన్ని ఆర్ఎస్‌పీ ప్రధాన కార్యదర్శి కబీంద్ర బుర్లకోటి ఖండించారు. ప్రభుత్వం ఇంకెంతమాత్రం గద్దెపై ఉండే నైతికత, చట్టబద్ధత కోల్పోయిందన్నారు. తక్షణం నేషనల్ ఎలక్షన్స్ జరపాలని డిమాండ్ చేశారు. నిరసనకారులపై కాల్పులను ఖండించారు.







# ట్రంప్ టారీఫ్‌లకు జెలెన్‌స్కీ మద్దతు



- రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై ఒత్తిడి

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న కీలక నిర్ణయానికి మద్దతు ప్రకటించారు. రష్యాతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలపై ట్రంప్ వేసిన టారీఫ్‌లు న్యాయమేనంటూ జెలెన్ స్కీ వ్యాఖ్యానించారు. ఓ అమెరికన్ న్యూస్ చానల్‌తో మాట్లాడిన జెలెన్స్కీ రష్యా ఎగుమతులు అధ్యక్షుడు పుతిన్‌కి ఆయుధంలా పనిచేస్తు న్నాయన్నారు. అతని చేతిలోని ఆయుధాన్ని తొలగించా లంటే రష్యా నుంచి ఎలాంటీ ఎనర్జీ సరఫరా అయినా ఆపాల్సిందేనని స్పష్టం చేశారు.

## యూరప్‌పై జెలెన్ స్కీ అసంతృప్తి

జెలెన్‌స్కీ ఉక్రెయిన్‌కు సహాయం చేస్తున్న యూరప్ దేశాలపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎందుకంటే, కొన్ని యూరప్ దేశాలు ఇప్పటికీ రష్యా నుంచి గ్యాస్, ఆయిల్ కొనుగోలు చేస్తున్నా యి. ఇది న్యాయం కాదని, రష్యా నుంచి ఎనర్జీ కొనడం ఆపాలని ఆయన సూచించారు. ట్రంప్ ఈ విషయంలో యూరప్ దేశాలపై ఒత్తిడి తెచ్చే నిర్ణయాలు తీసుకోవడం సరైన దని జెలెన్‌స్కీ వెల్లడించారు.

## ట్రంప్-పుతిన్ భేటీ

ఇటీవల అలాస్కాలో ట్రంప్, పుతిన్‌లు సమావేశమయ్యారు. ఈ భేటీ గురించి జెలెన్ స్కీ మాట్లాడుతూ పుతిన్‌కు ట్రంప్ ఒక అవకాశం ఇచ్చారు. పుతిన్ ఈ సమావేశంతో తన ప్రభావం చూపించాలని చూశారు. దురదృష్టవశాత్తూ ఆ సమావేశంలో ఉక్రెయిన్ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పుతిన్ తనను మాస్కోకు ఆహ్వా నించిన విషయాన్ని కూడా జెలెన్‌స్కీ ప్రస్తావించారు. మా దేశం మీద మిసైల్స్ పడుతున్నప్పుడు నేను మాస్కో కు వెళ్లలేను. పుతిన్ కావాలంటే కీవ్‌కు రావచ్చని ఆయన స్పష్టం చేశారు.

## ట్రంప్ స్పందన

ఆదివారం రష్యా ఉక్రెయిన్‌పై మరో పెద్ద దాడి చేసింది. ఈ ఘటనలో నలుగురు మరణించారు. కీవ్‌లోని ప్రభుత్వ కార్యాలయాలు అగ్నికి ఆహుత య్యాయి. ఈ దాడి తర్వాత ట్రంప్ మాట్లాడుతూ నేను ఈ పరిస్థితితో సంతోషంగా లేను. రష్యాపై కొత్త ఆంక్షలు విధించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఆగస్టు 15న ట్రంప్, పుతిన్‌ల సమావేశం యుద్ధ విరమణకు ఎటువంటి ఫలితా లు ఇవ్వలేదు. దీంతో రష్యా తన దాడులను మరింత తీవ్రతరం చేసింది.

## భారత్ విధానం మారనుందా..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై సుంకాలు విధించారు. భారత్‌పై కూడా 50% సుంకాలు విధించారు. అందులో 25% అదనపు సుంకం రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ కొనుగోలు చేసినందుకు. భారత్ ఈ నిర్ణయాన్ని.. అన్యాయమని తప్పుపట్టింది. అయినా భారత్ ఎప్పటిలాగే ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగియాలని కోరుకుంటోంది. ఈ నేపథ్యంలో భారత్..ఉక్రెయిన్ అధ్యక్షుడి వ్యాఖ్యల విషయంలో మళ్లీ ఎలాంటి ప్రకటన చేస్తుందో చూడాలి మరి.




# నేటి నుంచే ఆసియా కప్

## ఈ సారి టీ 20 ఫార్మాట్‌లో

క్రికెట్ ప్రియులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న ఆసియా కప్-2025కు సర్వం సిద్ధమయింది. సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభం కానుంది. ఈసారి టోర్నమెంట్ టీ 20 ఫార్మాట్‌లో జరుగుతుంది. వచ్చే ఏడాది జరగనున్న టీ20 వరల్డ్ కప్‌ను దృష్టిలో పెట్టుకుని ఈసారి ఆసియా కప్‌ను ప్లాన్ చేశారు. 2026 అక్టోబర్‌లో భారత్, శ్రీలంక సంయుక్తంగా టీ20 వరల్డ్ కప్ నిర్వహించబోతున్నాయి. దీంతో అన్ని ఆసియా జట్లు తమ బలహీనతల్ని తెలుసుకునే మంచి ఛాన్స్‌గా ఈ టోర్నీని భావిస్తున్నాయి. గతంలో 2022లో టీ 20 ఫార్మాట్లో జరిగిన ఆసియా కప్‌ను శ్రీలంక గెల్చుకుంది. దుబాయ్‌లో జరిగిన ఫైనల్‌లో పాకిస్తాన్ జట్టును ఓడించింది.

**ఆసియా కప్ ఫార్మాట్**

ఈ సారి ఆసియా కప్ మూడు దశల్లో జరుగుతుంది. గ్రూప్ దశ, సూపర్ 4, ఫైనల్. ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. ప్రతి గ్రూప్‌లో నాలుగు జట్లు ఉంటాయి.
గ్రూప్ ఏలో: భారత్, పాకిస్తాన్, ఒమన్, యూఏఈ
గ్రూప్ బీలో: శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, హాంకాంగ్

**గ్రూప్ దశ**

ఈ దశలో ప్రతి గ్రూప్‌లోని జట్లు ఒకరితో ఒకరు చొప్పున ఒక్కసారి తలపడతాయి. అంటే ప్రతి జట్టూ మిగిలిన మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ చొప్పున ఆడుతుంది. ఈ గ్రూప్ దశలో రెండు గ్రూపుల్లోనూ టాప్-2లో నిలిచిన జట్లు సూపర్ 4కి అర్హత సాధిస్తాయి. అంటే ప్రతి గ్రూప్ నుంచి రెండు జట్లు ముందుకు వెళతాయి.

**సూపర్ 4 దశ**

సూపర్ 4లో గ్రూప్ ఏ, గ్రూప్ బీ నుంచి వచ్చిన నాలుగు జట్లు రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో ఆడతాయి. ఈ నాలుగు జట్లలో ప్రతి జట్టూ మిగిలిన వారితో ఒక్కో మ్యాచ్ చొప్పున ఆడతాయి. టాప్-2లో నిలిచిన జట్లు ఫైనల్‌కి చేరుకుంటాయి. ఈ దశలో ప్రతి మ్యాచ్ కీలకం కానుంది. ఎందుకంటే ఒక్క ఓటమి కూడా జట్టు ఫైనల్ రేస్ నుంచి బయటకి వెళ్లేలా చేస్తుంది.

**ఫైనల్**

సూపర్ 4 దశలో టాప్-2లో నిలిచిన జట్లు సెప్టెంబర్ 28 దుబాయ్‌లో ఫైనల్ మ్యాచ్ ఆడతాయి. 2022లో శ్రీలంక ఇక్కడే పాకిస్తాన్ జట్టును ఓడించి కప్ గెలిచింది. మరి ఈ సారి ఎవరు గెలుస్తారో చూడాలి మరి.

**మొదటి మ్యాచ్ ఎక్కడ?**

ఆసియా కప్ సెప్టెంబర్ 9న రాత్రి 8 గంటలకు మొదలవుతుది. టోర్నమెంట్ దుబాయ్‌లో జరుగుతుంది. ఫైనల్ కూడా ఇక్కడే జరుగుతుంది. ఆసియా కప్ అంటే కేవలం క్రికెట్ మాత్రమే కాదు. ఆసియా దేశాల మధ్య ఒక ఉత్కంఠభరితమైన పోటీ అని చెప్పవచ్చు. శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ లాంటి జట్లు సర్‌ప్రైజ్‌లు ఇస్తుంటాయి. ఒమన్, యూఏఈ, హాంకాంగ్ లాంటి జట్లు ఈ సారి ఏదైనా అద్భుతం చేస్తాయేమో చూడాలి.
ఆసియా కప్ షెడ్యూల్ గ్రూప్ స్టేజ్
9 సెప్టెంబర్: అఫ్గానిస్థాన్- హాంకాంగ్
10 సెప్టెంబర్: భారత్ - యూఏఈ
11 సెప్టెంబర్: బంగ్లాదేశ్ -హాంకాంగ్
12 సెప్టెంబర్: పాకిస్థాన్ -ఒమన్
13 సెప్టెంబర్: బంగ్లాదేశ్ - శ్రీలంక
14 సెప్టెంబర్: భారత్- పాకిస్థాన్
15 సెప్టెంబర్: శ్రీలంక - హాంకాంగ్
16 సెప్టెంబర్: బంగ్లాదేశ్ -అఫ్గానిస్థాన్
17 సెప్టెంబర్: పాకిస్థాన్- యూఏఈ
18 సెప్టెంబర్: శ్రీలంక -అఫ్గానిస్థాన్
19 సెప్టెంబర్: భారత్- ఒమన్

### యూఎస్ ఓపెన్ విజయంతో..

# మళ్లీ టాప్ ర్యాంక్‌కు అల్కరాస్



యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ విజేతగా స్పెయిన్‌కు చెందిన 22 ఏళ్ల యువ ఆటగాడు కార్లోస్ అల్కరాస్ నిలిచాడు. హెూరాహెూరీగా సాగిన ఫైనల్లో 24 ఏళ్ల ఇటాలియన్ ఆటగాడు యానిక్ సినర్‌ను 6-2, 3-6, 6-1, 6-4 తేడాతో ఓడించాడు. ఈ విజయంతో 65 వారాలుగా ప్రపంచ నంబర్ 1 స్థానంలో ఉన్న సినర్‌ను వెనక్కి నెట్టి అల్కరాస్ మళ్లీ టాప్ ర్యాంకు దక్కించుకున్నాడు. మొత్తం 2 గంటల 42 నిమిషాల పాటు సాగిన ఫైనల్లో తొలిసెట్‌ను అల్కరాస్ అలవోకగా నెగ్గాడు. రెండో సెట్లో తేలిపోయినప్పటికీ, మూడో సెట్ లో విజృంభించాడు. దూకుడుగా ఆడి 6-1 తేడాతో సెట్‌ను కైవసం చేసుకున్నాడు. ఇక కీలక నాలుగో సెట్ లో ఇరువురు ఆటగాళ్లు హెూరాహెూరీగా తలపడ్డప్పటికీ అల్కరాస్ ఒత్తిడిని అధిగమించి విజేతగా అవతరించాడు. అల్కరాస్‌కు ఇది ఆరో గ్రాండ్ స్లామ్ టైటిల్ కాగా, రెండో యూఎస్ ఓపెన్. ఈ ఏడాది జరిగిన మూడు గ్రాండ్ స్లామ్ ఫైనల్స్‌లో అల్కరాస్, సినర్ పోటీ పడగా.. తొలుత ఫ్రెంచ్ ఓపెన్‌ను అల్కరాస్ గెలుచుకోగా, వింబుల్డన్‌ను సినర్ సొంతం చేసుకున్నాడు. ఈ విజయంతో ఒకే ఏడాదిలో అల్కరాస్ రెండు గ్రాండ్ స్లామ్ టైటిళ్లు నెగ్గినట్లు అయింది.

# స్పిన్నర్ నవాజ్ హ్యాట్రిక్

### - ముక్కోణపు సిరీస్ గెలిచిన పాక్




పాకిస్తాన్ లెఫ్ట్ ఆర్మ్ ఆర్థోడాక్స్ స్పిన్నర్ మొహమ్మద్ నవాజ్ చరిత్ర సృష్టించాడు. అతని దేశం తరఫున టీ20ల్లో హ్యాట్రిక్ నమోదు చేసిన తొలి స్పిన్ బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు. యూఏఈలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై ఈ ఘనత సాధించాడు. హ్యాట్రిక్ సహా ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేసి పాకిస్థాన్‌కు టైటిల్ అందించాడు.

అంతర్జాతీయ టీ20ల్లో నవాజ్‌కు ముందు 73 మంది హ్యాట్రిక్‌లు నమోదు చేశారు. పాక్ తరపున నవాజ్ ది మూడో హ్యాట్రిక్.. నవాజ్‌కు ముందు పాక్ తరపున హ్యాట్రిక్‌లు సాధించిన వారిద్దరు (ఫహీమ్ అష్రాఫ్, మొహమ్మద్ హుస్నేన్) పేస్ బౌలర్లే.

ఇక నవాజ్ హ్యాట్రిక్ సహా ఐదు వికెట్ల ప్రదర్శనతో చెలరేగడంతో ఆఫ్ఘనిస్తాన్‌పై 75 పరుగుల తేడాతో పాకిస్తాన్ గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 141 పరుగులు మాత్రమే చేయగలిగింది.

ఫకర్ జమాన్ (27), మొహమ్మద్ నవాజ్ (25), కెప్టెన్ సల్మాన్ అఘా (24) మాత్రమే 20కి పైగా స్కోర్లు చేశారు. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేసి పాక్‌ను కట్టడి చేశారు. రషీద్ ఖాన్ 3, నూర్ అహ్మద్, ఫజల్ హక్ ఫారూకీ తలో 2, ఘజన్ఫర్ ఓ వికెట్ తీసి పాక్ను కట్టడి చేశారు.

అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనలో ఆఫ్ఘనిస్తాన్ చేతులెత్తేసింది. పాక్ స్పిన్నర్ మొహమ్మద్ నవాజ్ (4-1-19-5) ధాటికి 15.5 ఓవర్లలో 66 పరుగులకే కుప్పకూలింది. ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్‌లో ఒక్కరు కూడా చెప్పుకోదగ్గ స్కోర్ చేయలేకపోయారు.

రషీద్ ఖాన్ (17), సెదిఖుల్లా అటల్ (13) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. మిగతా వాళ్లంతా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు.

నవాజ్ 6వ ఓవర్ చివరి రెండు బంతులకు, 8వ ఓవర్ తొలి బంతికి వికెట్లు తీసి హ్యాట్రిక్ సాధించాడు. 8వ ఓవర్లో నవాజ్ మరో వికెట్ కూడా తీశాడు. పాక్ బౌలర్లలో అబ్రార్ అహ్మద్, సుఫియాన్ ముఖీమ్ కూడా తలో 2 వికెట్లు తీసి ఆఫ్ఘనిస్తాన్‌ను దెబ్బ కొట్టారు. షాహీన్ అఫ్రిది ఓ వికెట్ దక్కించుకున్నాడు.

ఈ టోర్నీలో పాల్గొన్న మరో జట్టు యూఏఈ. ఈ జట్టు లీగ్ దశలో ఆడిన 4 మ్యాచ్‌ల్లోనూ ఓడి మొదట్లోనే నిష్క్రమించింది.

# మహా బలుడు!




ఐస్‌లాండ్‌కు చెందిన హాఫ్థోర్ బ్జోర్న్‌సన్‌ను ఇష్టపడని సినీ అభిమానులు ఉండరు. అయితే 'గేమ్ ఆఫ్ థ్రోన్స్' సినిమాలో 'ది మౌంటైన్'గా గ్రెగర్ క్లెగన్ పాత్రను పోషించిన హాఫ్థోర్ బ్జోర్న్‌సన్ ఇప్పుడు మానవ శక్తికి కొత్త నిర్వచనం చెబుతూ ప్రపంచంలోనే అత్యధిక బరువు ఎత్తిన వెయిట్ లిఫ్టర్‌గా రికార్డు సృష్టించాడు. గతంలోనూ తన పేరిటే ఉన్న ఆ ఘనతను మరోసారి బద్దలు కొట్టడం విశేషం. హెవీ వెయిట్ లిఫ్టర్ కమ్ సినీయాక్టర్ అయిన హాఫ్థోర్.. స్ట్రాంగ్‌మ్యాన్- 2025 కాంపిటీషన్‌లో ఏకంగా 510 కిలోల (1,124 పౌండ్లు) బరువు ఎత్తాడు. ఇంతకుముందు 505 కిలోలు లిఫ్ట్ చేసిన హాఫ్థోర్ ఇప్పుడు ఆ రికార్డును తుడిచిపెట్టాడు. 2018లోనూ అతడే 'స్ట్రాంగ్ మ్యాన్'గా గుర్తింపు సాధించాడు. ఇంత భారీ బరువు ఎత్తినా సరే హాఫ్థోర్ మాత్రం తన అత్యుత్తమ ప్రదర్శన ఇది కాదని వ్యాఖ్యానించాడం విశేషం.

510 కిలోలు ఎత్తడం తేలికగా అనిపించిందా? లేక ఇంకా బరువు ఎత్తగలవా? అని అభిమానులు నన్ను అడుగుతుంటారు. నేను మాత్రం లేదు అనే చెబుతా. ఇందులో విజయం సాధించాలని బలంగా కోరుకున్నా. నేను అనుకున్న వ్యూహం ప్రకారమే బరువు ఎత్తి విజయవంతమయ్యా. ఇక అంతకుమించి మరింత బరువు మాత్రం ఎత్తను. వెయిట్ లిఫ్ట్ చేసేందుకు నా రోజువారీ ఆహారం, ప్రణాళికలో ఎలాంటి మార్పులు చేయను. అయితే, పొట్టను హాయిగా ఉండేలా చూస్తా. లిఫ్టింగ్ పైనే ఎక్కువ దృష్టిపెడతా" అని హాఫ్థోర్ వెల్లడించాడు.

# ఓజీ కోసం 117 మంది సంగీత కళాకారులు



పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రాల్లో 'ఓజీ' ఒకటి. సెప్టెంబర్ 25న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈనేపథ్యంలో కొన్ని రోజులుగా వరుస అప్‌డేట్లు, పోస్టర్లతో సోషల్ మీడియాలో చిత్రబృందం సందడి చేస్తోంది. తాజాగా తమన్ ఓ మ్యూజికల్ అప్‌డేట్ పంచుకున్నారు.

ఇప్పటికే ఈ సినిమా కోసం జపాన్ వాయిద్య పరికరం కోటోను ఉపయోగించి బీజీఎం క్రియేట్ చేసినట్లు తెలిపిన ఆయన తాజాగా మరో పోస్ట్‌లో ఫ్యాన్స్‌లో జోష్ నింపారు. లండన్‌లోని స్టూడియోలో దీని రికార్డింగ్ పనులు జరుగుతున్నట్లు తమన్ తెలిపారు. 117 మంది సంగీత కళాకారులు దీనికోసం వర్క్ చేస్తున్నట్లు చెప్పారు. నేపథ్య సంగీతం అద్భుతంగా వచ్చిందన్నారు.

సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఓజీ రూపొందుతోంది. ఇందులో పవన్ ఇప్పటివరకూ ఎన్నడూ చూడని పాత్రలో ఓజాస్ గంభీర అనే గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. ఆయన సరసన ప్రియాంకా మోహన్ నటించారు. ఇమ్రాన్ హష్మీ విలన్. శ్రియారెడ్డి, ప్రకాశ్ రాజ్, అర్జున్‌దాస్, తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం దీని పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

# సింగర్‌గా రామ్



ఆంధ్ర కింగ్ తాలూకా'లో హీరోగా నటిస్తూ ఇప్పటికే అందులో 'నువ్వుంటే చాలే పాటను రాసి గాయకుడిగా మారి రామ్ పోతినేని ఆ సినిమాలోనే.. 'పప్పీ షేమ్' అనే పాటను పాడటం విశేషం. భాస్కరభట్ల రాసిన ఈ గీతం సోమవారం విడుదలైంది. వివేక్, మెర్విన్ సంగీతం అందించారు. గతంలో మిస్ శెట్టి.. మిస్టర్ పొలిశెట్టి సినిమా తీసిన పీ. మహేశ్ బాబు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఉపేంద్ర కీలక పాత్ర పోషించారు. ఆయన అభిమానిగా రామ్ కనిపించనున్నారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. మైత్రీ మూవీస్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, వై రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా నవంబరు 28న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# రజనీ-కమల్ మల్టీస్టారర్ ఖరారు

కోట్ల మంది సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న మల్టీస్టారర్ అధికారికమైంది. ఇండస్ట్రీలో అగ్ర కథానాయకుల్లో ముందు వరుసలో ఉండే కమల్ హాసన్, రజనీకాంత్.. 46 ఏళ్ల తర్వాత కలిసి మరోసారి తెరపై కనిపించనున్నారు. వీరిద్దరి కలయికలో మల్టీస్టారర్ రానుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాను కమల్ హాసన్ అధికారికంగా ప్రకటించారు. ఇటీవల జరిగిన సైమా అవార్డుల వేడుకలో దీని గురించి కమల్ హాసన్ బిగ్ అప్డేట్ ఇచ్చారు. 'మీరు, రజనీకాంత్ కాంబినేషన్ లో ఓ సినిమాను ఆశించవచ్చా' అని వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు ఆయన ఆసక్తికర సమాధానమిచ్చారు. "ప్రేక్షకులు మా కాంబినేషన్ ను ఇష్టపడితే మంచిదే కదా.. వారు సంతోషంగా ఉంటే మాకూ ఆనందమే. మేమిద్దరం కలిసి నటించాలని ఎన్నోఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నాం. కానీ, ఇన్ని రోజులు అది కుదర్లేదు. త్వరలోనే మీ ముందుకు కలిసి రానున్నాం. అది మిమ్మల్ని కచ్చితంగా సర్‌ప్రైజ్ చేస్తుంది" అని స్పష్టం చేశారు. అయితే, ఈ ప్రాజెక్ట్ వివరాలు మాత్రం ఆయన బయటపెట్టలేదు. దీంతో ఈ బిగ్ మల్టీస్టారర్ గురించి అధికారిక ప్రకటన వచ్చిందని అభిమానులు సంబరపడుతున్నారు.

లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వీరిద్దరి మల్టీస్టారర్ రానున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. లోకేశ్ గ్యాంగ్ స్టర్ డ్రామాగా ఓ సినిమాని తెరకెక్కించనున్నారని, రజనీ- కమల్ ఇద్దరూ గ్యాంగ్ స్టర్‌లు గానే కనిపిస్తారని తమిళ సినీ పరిశ్రమలో చర్చ జరుగుతోంది. ఇదే నిజమైతే 46 ఏళ్ల తర్వాత రజనీ- కమల్ మళ్లీ కలిసి కెమెరా ముందుకువచ్చినట్టవుతుంది. ఈ ఇద్దరూ కలిసి 5 భాషల్లో 20కి పైగా సినిమాలు చేశారు. అయితే అదంతా 1970వ దశకం లోనే. ఆ తర్వాత ఈ ఇద్దరూ మళ్లీ తెరను పంచుకొనే అవకాశం రాలేదు. ఇన్నేళ్లకు లోకేశ్ రాసిన కథలో వీరు సందడి చేయనున్నట్లు తెలుస్తోంది.



# సల్మాన్ ఓ గూండా..

బాలీవుడ్ స్టార్ హీరోల్లో సల్మాన్ ఖాన్ ఒకడు. దాదాపు 7-8 ఏళ్ల నుంచి ఇతడు సినిమాలైతే చేస్తున్నాడు గానీ హిట్ పడట్లేదు. అలాంటిది ఇతడిపై ఓ బాలీవుడ్ డైరెక్టర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. సల్మాన్ ఓ గుండా, అతడికి నటన అంటే అసలు ఆసక్తి లేదు. కేవలం సెలబ్రిటీ హోదా కోసమే సినిమాలు చేస్తున్నాడని సంచలన ఆరోపణలు చేశాడు. ఇప్పుడు ఈ విషయం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది.

తెలుగులో పవన్ కళ్యాణ్ 'గబ్బర్ సింగ్' మూవీ పెద్ద హిట్. దాని ఒరిజినల్ చిత్రం 'దబంగ్' కూడా హిందీలో పెద్ద హిట్ సినిమాగా నిలిచింది. 2010లో రిలీజైన ఈ హిందీ సినిమాకు అభినవ్ కశ్యప్ దర్శకుడు. ఇతడు అనురాగ్ కశ్యప్‌కి అన్నయ్య. అయితే సల్మాన్‌తో ఈ మూవీ చేసిన తర్వాత అభినవ్.. ఇండస్ట్రీలో అడ్రస్ లేకుండా పోయాడు. అయితే దీనికి సల్మాన్, అతడి కుటుంబమే కారణమని గతంలోనే అభినవ్ ఆరోపించాడు. ఇప్పుడు తాజాగా ఒక ఇంటర్వ్యూలో మరోసారి సంచలన కామెంట్స్ చేశాడు. 2010లో 'దబంగ్' సీక్వెల్ చేయమని సల్మాన్ కుటుంబం నన్ను అడిగింది. దానికి నేను నో చెప్పాను. అప్పటినుంచి నాపై పగ పెంచుకున్నారు. వాస్తవానికి సల్మాన్‌కి నటనపై ఆసక్తి లేదు. 25 ఏళ్లుగా అతడు నటించడం లేదు. సెలబ్రిటీగా ఉండటానికే సెట్ కి వస్తాడు. అతడొక గూండా. పగ-ప్రతీకారంతో రగిలిపోయే ఓ అసభ్యకరమైన వ్యక్తి. వారు చెప్పిన మాట కాదంటే వెంటాడి మరీ వేధిస్తాడు. వారందరూ రాబందులు. సల్మాన్ మాత్రమే కాదు బోనీ కపూర్ కూడా అలాంటోడే. నా తమ్ముడు అనురాగ్‌తో బోనీ అసభ్యంగా ప్రవర్తించాడు. అందుకే అతడి సినిమా నుంచి అనురాగ్ బయటకొచ్చేశాడు. ఈ రాబందుల గురించి నా తమ్ముడు ముందే చెప్పాడని అభినవ్ తాజాగా ఇంటర్వ్యూలో చెప్పాడు.




# వెబ్ సిరీస్‌లో రాజమౌళి...

రాజమౌళి పేరు చెప్పగానే బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాలుగుర్తొస్తాయి. ప్రస్తుతం ప్రిన్స్ మహేష్ బాబుతో ఓ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ చేస్తున్నాడు. అదే టైంలో ఈ మధ్య కాలంలో యాడ్స్, ఈవెంట్స్‌లో తరుచుగా కనిపిస్తూనే ఉన్నాడు. ఇప్పుడు ఎవరూ ఊహించని విధంగా ఓ హిందీ వెబ్ సిరీస్‌లోనూ రాజమౌళి నటించడం విశేషం. తాజాగా రిలీజైన ట్రైలర్‌తో ఈ విషయం బయట పడింది. షారుఖ్ ఖాన్ కొడుకు ఆర్యన్.. దర్శకుడిగా మారి తీసిన సిరీస్ 'ద బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్'. హిందీ చిత్రసీమలో తెరవెనక జరిగే సంగతుల్ని ఆధారంగా చేసుకుని కామెడీ ఎంటర్ టైనర్‌గా దీన్ని తీశాడు. సెప్టెంబరు 18 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ఇందులోనే ఓ సీన్లో ఆమిర్ ఖాన్, రాజమౌళి కనిపించారు. వీళ్లతో పాటు దర్శకనిర్మాత కరణ్ జోహార్, దిశా పటానీ, షారుఖ్ ఖాన్, ర్యాపర్ బాద్ షా కూడా అతిథి పాత్రల్లో కనిపించారు.

# మల్లెపూలు తీసుకెళ్లినందుకు...

మల్లెపూలు తీసుకెళ్లినందుకు.. ఓ నటికి రూ.1.14 లక్షల జరిమానా విధించిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఓ ఈవెంటుకు హాజరయ్యేందుకు మలయాళ నటి నవ్య నాయర్ ఆస్ట్రేలియా వెళ్లారు. ఆ సమయంలో నవ్య తన బ్యాగులో మల్లెపూలను తీసుకెళ్లారు. మెల్బోర్న్ ఎయిర్పోర్టులో వాటిని గుర్తించిన సిబ్బంది అధికారులకు సమాచారం ఇవ్వడంతో.. అక్కడి అధికారులు ఆమెకు రూ.1.14లక్షల జరిమానా వేశారు.

ప్రపంచంలోని అత్యంత కఠినమైన బయోసెక్యూరిటీ చట్టాలు ఉన్న విమానాశ్రయాల్లో ఆస్ట్రేలియా లోని మెల్బోర్న్ ఎయిర్పోర్టు ఒకటి. ప్రయాణికులు పండ్లు, విత్తనాలు, పూలను తీసుకువెళ్లడం అక్కడ నిషిద్ధం. వాటివల్ల ప్రయాణికులకు వివిధ రకాల వ్యాధులు, తెగుళ్లు సులభంగా వ్యాపించే అవకాశం ఉండడంతో ఈ నిబంధన పెట్టారు. నవ్య మెల్బోర్న్ విమానాశ్రయానికి చేరుకున్న అనంతరం అక్కడి కస్టమ్స్ అధికారులు ఆమె బ్యాగ్‌లో మల్లెపూలను తీసుకువచ్చి నందుకు జరిమానా విధించడంతో నటి లక్షా 14 వేల రూపాయలు చెల్లించింది.

అనంతరం మెల్బోర్న్ జరిగిన ఓనం కార్యక్రమంలో మాట్లాడుతూ.. నటి నవ్య తనకు ఎదురైన అనుభవాన్ని చెప్పడంతో ఈ విషయం బయటకు వచ్చింది. తాను తీసుకువచ్చిన పూలు లక్ష రూపాయలు ఖరీదైనవని జరిమానా విధించేవరకు తనకు తెలియదని ఆమె చమత్కరించింది.

